సంపుటి: 46
సంచిక : 3

ఫోన్ నెం: 64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

డాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 90 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

ఏప్రిల్, 1988

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-235

[ఫలితాలు]

ఫిబ్రవరి '88 నెల "అపరాధ పరిశోధన పోటీ-235" కి సరియైన సమాధానాలు:

1. గొరేడు.
2. విశ్వనాథన్ ఆనంద్.
3. పన్నెండవది.
4. బి జె పి.
5. నకిలీ మందులు.

పై జవాబుల ప్రకారం ఐదుగురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి వచ్చే నెలనుండి ఒక ఏడా పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా స మెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు స మెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ కె. రామారావ్, 3-1-43B/1, నింబోలి అడ్డ హైద్రాబాదు-500 027.

(2) శ్రీ ఎ.వి. మధుప్రసాద్, 8-3-143/1, ఓంకార్ విలాస్ స్ట్రీట్, స్టేషన్ రోడ్, వరంగల్

(3) శ్రీ ఎస్. పార్వతీశ కిరణ్ S/O ఎస్.వి. కృష్ణారావ ఎస్.బి.ఎ. నిలయం, ఆర్.ఎస్. పేట, తుని-533 (తూ. గో. జి

(4) శ్రీ కృష్ణ, C/O కృష్ణ లైబ్రరీ & జనరల్ ఆశోక్ నగర్, హైద్రాబాదు-20.

(5) శ్రీమతి పి. కళావతి, రూమ్ నెం. 7/బి ఎఫ్, వాడా బావల్, దీపక్ టాకీస్ దగ్గర, ఎన్.ఎమ్. జోషిమార్గ్, బొంబాయి-13.

ఈ నెలలో . . .

కథలు (మాస పత్రిక)

4. ప్రతీకారజ్వాల—జొన్నలగడ్డ రామలక్ష్మి

22. దుష్టత్రయం—సరసి

37. వరించివచ్చిన కన్య—బి. రాజేశ్వరి

61. మిస్ మిస్టరీ (సీరియల్)—వసుందర

3. నేరస్థుల దీవెనెలు—యస్.డి.వి. అజీజ్

4. ఇంటరాగేషన్—బొమ్మిడి అచ్చారావు

3. ఫాలనేత్రం (సీరియల్)—వి.యస్. రావ్

పొరుగింటి ప్రేమలేఖ—వసుంధర

7. ఈ నేరాలు ఆగవు—డి.వి వి. సత్యనారాయణ

68. నగరంలో నేరగాళ్ళు—(సీరియల్) ప్రతాప రవిశంకర్

నవలలు (సప్లిమెంట్)

ఇరవై కోట్ల బంగారం—వసుంధర

డబ్బుకోసం దారుణం—వి. యస్. రావ్

యువ చోరులు—బొమ్మిడి అచ్చారావు

8. షసపేట (సీరియల్)—వాణిశ్రీ

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

ప్రతీకారజ్వాల

విజయ్ బట్టలు మార్చుకున్నాడు. వచ్చిన డబ్బులు లెక్క-చూసుకుని జేబులో వేసుకున్నాడు.

"మిస్టర్ విజయ్! నువ్వు నేరం చేశావో లేదో నాకు తెలియదు. జైల్లో నీ ప్రవర్తనమాత్రం నన్నాశ్చర్యచకితుణ్ని చేసింది. నీ సంస్కారానికి నేను ముగ్ధుణ్నయ్యాను. సత్ప్రవర్తన కారణంగా నీ శిక్ష మూడేళ్ళలో

మూడునెలలు తగ్గించబడ్డాయి. ఈ అదృష్టాన్ని సరిగ్గా ఉప యోగించుకో. మళ్ళీ యిక్కడకు రాకు—" అన్నాడు జైలర్.

"అదృష్టం! చేయని నేరానికి జైలుపాలవడం అదృష్టమా?" అన్నాడు విజయ్ చిరాకును కప్పిపుచ్చుకుంటూ.

"జరిగింది మర్చిపో. కొత్త జీవితం ప్రారంభించు. నువ్వు నేరస్థుడివి కాకపోతే వృద్ధిలోకి వస్తావని దీవిస్తున్నాను. నా దీవెన వృధాపోదు...."

"కొత్తజీవితమెలా ప్రారంభించేది సర్! నామీద నేరస్థుడన్న ముద్రపడింది. ఆ ముద్ర నన్ను జీవితాంతం వెంటాడి వేటాడుతుంది. నన్నీ అవస్థకు గురిచేసిన దుర్మార్గుణ్ణి శిక్షించకుండా నేనెలా ఉండగలను?" అన్నాడు విజయ్.

"దుర్మార్గులకు శిక్ష భగవంతుడే విధిస్తాడు. నువ్వు భగవంతుణ్ని నమ్ము...."

"నాకు దేవుడిపై నమ్మకం లేదు"

"నీకు దేవుడిపై నమ్మకం లేకపోయినా ఫరవాలేదు. కానీ చట్టాన్ని నీ చేతుల్లోకి తీసుకోకు. నీ కన్యాయం జరిగిందనుకుంటే—ఒక నేరస్థుడు తప్పించుకున్నాడని నీ కనిపిస్తే—అతణ్ని తెలివిగా ట్రాప్‌చేసి చట్టాని కప్పగించు...."

"ఇవన్నీ మీరు నాకెందుకు చెబుతున్నారు?"

"ఇన్నాళ్ళుగా నిన్ను చూస్తున్నాను. నీలో సంస్కారం, మంచితనం కనబడ్డాయి. ఈరోజు విడుదలయ్యే సమయంలో— నీ కళ్ళలో ప్రతీకార జ్వాలలు రగులుతూండడం నాకు స్పష్టంగా తెలుస్తూంది. ఆ జ్వాలల్ని వెంటనే

చల్లార్చకపోతే అవి నిన్నే దహించివేస్తాయి. నా మాట విను. మంచితనం మనిషికి సుఖాన్నిస్తుంది. సహనం సంతృప్తినిస్తుంది. ఈ రెండూ లేని వ్యక్తికి జీవితంలో మిగిలేదేమీ ఉండదు. ఉంటుందనుకుంటే అది తెలివి తక్కువ. ప్రతీకారం గురించి నీకు తోచినప్పుడల్లా నువ్వు నా మాటలు గుర్తుచేసుకో—" అన్నాడు జైలర్.

"వెలవు" అన్నాడు విజయ్.

"నా మాటలు నీకు నచ్చలేదని నీకళ్ళు నాకు చెబుతున్నాయి. కానీ నా మాటలు నచ్చడంమీదనే నీ భవిష్యత్తు పునాదులున్నాయని మర్చిపోకు...." అన్నాడు జైలర్. ఆయన గొంతులో ఆవేదన ఉంది.

విజయ్ అక్కణ్ణించి కదిలి విశాల ప్రపంచంలోకి వచ్చాడు.

ఇప్పుడు తను తన ఊరు వెళ్ళాలి. ఇక్కణ్ణించి బస్టాండుకు వెడితే—బస్సులో నాలుగు గంటలు ప్రయాణం చేస్తే వస్తుంది తన ఊరు.

ఊళ్ళో తనకోసం రమ ఎదురుచూస్తూంటుంది రమ ఎదురు చూపుకు మూడునెలలు తగ్గిపోయింది. ఆమె తన్ను చూసి ఆశ్చర్యపడుతుంది.

అసలు రమ ఎలా ఉందో యిప్పుడు?

తను జైలుపాలు కాగానే చూడ్డానికి వచ్చింది. ఆ తర్వాత నాలుగు నెలలు వరుసగా నెలకొకసారి చొప్పున చూడ్డానికి వచ్చింది.

ఆమె వచ్చినప్పుడల్లా విజయ్‌కి మనసేదోలాగై పోయేది.

"రమా! నువ్వు రాకు. నిన్ను చూడగానే నాకు ఈ జైల్లోంచి పారిపోయి నీ దగ్గరకు వచ్చేయాలన్న కోరిక

పెరిగిపోతోంది. ఎలాగో రోజులు గడుపుతాను. ఇక నీవు నన్ను చూడ్డానికి రావద్దు. నాకు త్తరంకూడా రాయొద్దు" అన్నాడు విజయ్.

అతడి కోరికమీద ఆమె రావడం మానేసింది.

కానీ అక్కడ....

ఆ దుర్మార్గుడు ప్రతాప్ ఏం చేస్తున్నాడో?

విజయ్ ఆలోచనల్లోకి ప్రతాప్ రాగానే ఆవేశం రగిలింది.

ప్రతాప్ ఆఫీసులో రమకు బాస్. రమ వివాహిత అని తెలిసుండీ అతడామెపై కన్నేశాడు. చొరవచేశాడు. రమ ఆరంభంలో సహనం చూపించింది. ఆ సహనాన్ని ఆసరాగా తీసుకుని అతడు "తప్పు బహిరంగంగా చేస్తేనే తప్పు. నేను రహస్యాన్ని కాపాడతాను" అని మాటకూడా యిచ్చాడు.

అప్పుడు రమ అతణ్ణి సాచి లెంపకాయ కొట్టి—పై ఆఫీసరుకు ఫిర్యాదుచేసింది. ఫలితంగా రమ సెక్షను మారింది. ప్రతాప్‌కు వార్నింగొచ్చింది.

కానీ అతడికి బుద్ధిరాలేదు. రమపైన పగబట్టాడు. అతడు విజయ్‌ని కలుసుకుని రమపై లేనివీ పోనివీ నూరిపోశాడు.

"మా పెళ్ళికి ముందే రమ ఉద్యోగం చేస్తూంది. ఉద్యోగం చేసుకునే ఆడదానిమీద అపనిందలుంటాయి. అన్నీ తెలిసే నేనామెను వివాహం చేసుకున్నాను. వివాహం చేసుకున్నాక కూడా ఆమె నా అనుమతిమీదనే ఉద్యోగం చేస్తూంది. ఆమె నా భార్య. మా యిద్దరికి పరస్పర విశ్వాసముంది. ఆమెకు వ్యతిరేకంగా ఎవరైనా చెబితే నేను అమర్యాదగా ప్రవర్తిస్తాను. గెటౌట్ అనే

లోగా వెళ్ళిపో" అన్నాడు విజయ్.

అప్పటికీ ప్రతాప్‌కి బుద్ధిరాలేదు. అతడు విజయ్‌మీద కూడా పగబట్టాడు.

ఇలా ఉండగా ప్రతాప్‌కి అవకాశం వచ్చింది. ఒక రోజున అతడో వ్యాపారస్థుడితో మాట్లాడుతూండగా హఠాత్తుగా అక్కడికో ముసుగు దొంగ వచ్చాడు. కత్తిచూపి యిద్దర్నీ బెదిరించాడు. ప్రతాప్ భయపడితే వ్యాపారస్థుడు ప్రతిఘటించబోయాడు. దొంగ అతణ్ణి కత్తితో పొడిచి పారిపోయాడు. వ్యాపారస్థుడికి స్పృహ తప్పింది.

ప్రతాప్ పెద్దగా అరిచి గొడవచేశాడు. ముసుగుమనిషి పారిపోవడం చాలామంది చూశారు. కానీ అతడు దొరక లేదు.

ప్రతాప్ తను ముసుగుమనిషిని చూశానన్నాడు. విజయ్ పేరు చెప్పాడు. ఆరోజు ఉదయమే విజయ్, వ్యాపారస్థుడు గొడవపడ్డారు. ఆ గొడవ చాలామంది విన్నారు. ఒకరి అంతు ఒకరు చూస్తామనుకునేదాకా వెళ్ళిందా గొడవ. ఆ వ్యాపారస్థుడికి విజయ్‌వల్ల ఆఫీసుద్వారా ఏదో ప్రయోజన ముంది. విజయ్ నిరాకరించడమేకాక వ్యాపారస్థుణ్ని నిందించాడు. తప్పు వ్యాపారస్థుడిదే అయినా ధనబలంతో అతడు తలెత్తుకుని మాట్లాడగలిగాడు.

ప్రతాప్ కారణంగా విజయ్‌మీద హత్యానేరం మోప బడింది. కోర్టులో కేసు నడిచింది.

విజయ్‌కి సరైన ఎలిబీలేదు. భార్య సాక్ష్యం అతడికి పనికి రాలేదు.

ప్రతాప్‌కు తమపై పగ ఉందని లాయరుద్వారా నిరూ పించడానికి ప్రయత్నించాడు విజయ్.

మొదట్నించీ తనను అపనిందలపాలు చేయడానికి

విజయ్ ప్రయత్నిస్తున్నట్లుగా ప్రతాప్ ఆరోపించాడు.

వ్యాపారస్థుడు ప్రాణాలు దక్కి బయటపడటంవల్ల విజయ్‌కి హత్యాప్రయత్నం నేరంమీద మూడేళ్ళు జైలు శిక్ష పడింది.

నేరం చేసింది విజయ్ కాదని అటు వ్యాపారస్థుడికీ, ఇటు ప్రతాప్‌కీ కూడా తెలుసు. కానీ యిద్దరికీ అతడిమీద పగ ఉంది కాబట్టి—విజయ్ నేరస్థుడయ్యాడు. అయితే వ్యాపారస్థుడు తన సాక్ష్యంలో ముసుగుమనిషిని తను చూడలేదనే చెప్పాడు. విజయ్‌కి తనమీద పగ ఉండే అవకాశముందని మాత్రం అతడు చెప్పాడు.

అందుకే ఇప్పుడు విజయ్ పగ అంతా – ప్రతాప్‌మీదనే ఉంది. చేయని నేరానికి తన్ను జైలుపాలు చేసిన దుర్మార్గుడు ప్రతాప్!

"నా జీవితం నాశనమైపోయినా ఫరవాలేదు. నేనేమైపోయినా ఫరవాలేదు. హత్యాప్రయత్నం నేరాన్ని నామీద మోపిన ఆ ప్రతాప్‌ని చంపేస్తాను. అతడి చావు మాత్రమే నా ఆవేశాన్ని చల్లార్చుతుంది" అనుకున్నాడు విజయ్.

అప్పుడతడికి జైలర్ మాటలు గుర్తుకు రాలేదు. ఆవేశం మాత్రం రెట్టింపయింది. ఆ ఆవేశంలోనే—విజయ్ బస్‌స్టాండుకు వెళ్ళి బస్‌లో కూర్చున్నాడు. బస్సు కదలడానికి ముందే అతడి మనసతడి ఊరుకు వెళ్ళిపోయింది.

2

ప్రముఖ వ్యాపారస్థుడు భీమానంద్ సోఫాలో కూర్చుని పేపరు చదువుతున్నాడు. ఆ సమయంలో ప్రతాప్ అతణ్ణి చూడ్డానికి వచ్చాడు.

ప్రతాప్ కంగారుగా వణకడం చూసి— "ఏమిటీ —

ఏమయిందీ?" అన్నాడు.

"విజయ్ జైల్నించి విడుదలై వచ్చేశాడు?"

"ఎప్పుడు?"

"నిన్ననే!"

"అయితే నీకు భయమెందుకు?"

"ఈ రోజుదయం నాకు ఫోన్ వచ్చింది...."

"విజయ్ చేశాడా?"

"కాదు — ఓ స్త్రీ గొంతు...."

"ఏమంటుంది"

"కొన్నాళ్ళపాటు నువ్వీ ప్రాంతాల ఉండకు. విజయ్ నిన్ను చంపేస్తానంటున్నాడు. అతడు చల్లబడేదాకా నువ్వ తడి కళ్ళ బడడం మంచిదికాదు, అనిచెప్పింది...."

"ప్రతాప్—నువ్వనవసరంగా భయపడుతున్నావు. నాకు తెలుసు—నన్ను పొడిచింది విజయ్ కాదని! అతడు మామూలు మనిషి. హత్యలకు పాల్పడేరకం కాదు...."

"అయితే మరెవరు ఫోన్ చేసి ఉంటారు?"

"ఆ గొంతెవరిదో నువ్వు గుర్తుపట్టలేదా?"

"కచ్చితంగా చెప్పలేను కానీ—ఫోన్ చేసింది విజయ్ భార్య రమ అని నా అనుమానం...."

"ఆమె నీ కెందుకు ఫోన్ చేస్తుంది?"

"తన భర్త హంతకుడు కాకూడదన్న కోరికతో చేయ వచ్చుగదా!"

భీమానంద్ క్షణంపాటు ఆలోచించి-"నువ్వు చెప్పింది నిజం కావచ్చు. ఆ అమ్మాయి నీతోపాటే నీ ఆఫీసులో పని చేస్తోంది కదా! ఆమెకు నీ గురించి బాగా తెలిసి వుంటుంది. విజయ్ నిన్ను చంపాలనుకుంటున్నాడని నే ననుకోను. ఆమె నిన్ను భయపెట్టి నీకు మనశ్శాంతి

లేకుండా చేయాలనుకుంటోంది. నా మాట విని నువ్వు నిశ్చింతగా ఉండు” అన్నాడు.

“సర్ - మిమ్మల్ని ప్రతిమాలుకుంటున్నాను. నన్ని ఊర్నించి బయటపడేయండి. ఆఫీసుకి వారం రోజులు సెలవు రాసిచ్చేశాను. ఎందుకో నాకు చాలా భయంగా ఉంది” అన్నాడు ప్రతాప్.

“భయ మెందుకు?”

“నిన్న రోజంతా నాకన్నీ దుశ్శకునాలే కనిపించాయి. రాత్రంతా పీడకలలే వచ్చాయి. ఇప్పుడేమో ఫోన్ వచ్చింది ....”

“ప్రతాప్-నువ్వనవసరంగా భయపడుతున్నావు. నేను వ్యాపారస్థుణ్ని. ఎలాంటి మనిషివల్ల ప్రమాదముంటుందో నాకు తెలుస్తుంది. విజయ్‌వల్ల ప్రమాదముండదని నేను నమ్మకంగా చెప్పగలను ....”

“మీ నమ్మకాన్ని మీవద్ద వుంచుకోండి. నా నమ్మకాన్ని కూడా కాస్త గౌరవించండి ....” అన్నాడు ప్రతాప్.

భీమానంద్ ప్రతాప్ వంక పరీక్షగా చూశాడు. మూర్తీభవించిన భయంలా ఉన్న ప్రతాప్‌ని చూసి అతడు జాలిగా నిట్టూర్చి - “సరే నేను నీకు సాయపడతాను” అన్నాడు.

“థాంక్యూ సర్___” అన్నాడు ప్రతాప్ సంతోషంగా.

“అయితే ఒక పని చేద్దాం-మధ్యాహ్నం మూడింటికి మనం బయల్దేరుదాం - ఈలోగా నువ్వు కూడా కొన్ని ఏర్పాట్లు చేసుకోవడం మంచిది. ఇంతకీ నువ్వెక్కడికి వెడదామనుకుంటున్నావు?” అన్నాడు భీమానంద్.

“గురువూర్” అన్నాడు ప్రతాప్. “అక్కడ మా బాబాయున్నాడు. మా బాబాయి గురించి విజయ్‌కు తెలియదు. నేనక్కడుండగలనని విజయ్ ఊహించలేడు. గురు

వూర్లో మా బాబాయికి పలుకుబడి బాగా ఉంది. పోలీసు డిపార్టుమెంటుతో కూడా పరిచయముంది. నా కక్కడ పూర్తి రక్షణ లభిస్తుంది."

"ఎన్నాళ్ళు?"

"ఫోన్‌లో హెచ్చరికనుబట్టి ఓ వారం రోజులుచాలదా అనిపిస్తోంది...."

"వారం రోజుల్లో నీ ప్రమాదం తప్పిపోతుందన్న గ్యారంటీ ఏమిటి?" అన్నాడు భీమానంద్.

"విషయం బాబాయికి చెప్పి ఆయన సలహా తీసుకుంటాను. ఇలాంటి విషయాల్లో ఆయన్ను మించి సలహా లివ్వగలవారు లేరు...."

"సరే - నీ యిష్టం.... అయితే ముందుగా నా సలహా కూడా విను."

"చెప్పండి...."

"నువ్వు వేషం మార్చుకునేటందు కేర్పాట్లు చేసుకో."

"ఎందుకు?"

"ఒకవేళ విజయ్ మనని అనుసరించి వచ్చేడనుకో. అతణ్ని తప్పుదారి పట్టించటానికి మారువేషం చాలా బాగా పనికొస్తుంది...."

"సార్ - మీరు ముందు నాకేమీ భయం లేదన్నారు. ఇప్పుడు మారువేషం వేసుకోవాల్సొంటుందని భయపెడుతున్నారు."

"నేను వ్యాపారస్థుణ్ని. ఏ పని చేసినా సీరియస్‌గా చేస్తాను. నీ ప్రాణాలకు ప్రమాదం లేదని నేననుకుంటున్నాను. కానీ నువ్వు భయపడి నా సాయ మడిగావు. అయితే ఒకసారి సాయపడ్డాక అందువల్ల నీకు ప్రయోజన ముండాలి గదా! కాబట్టి మారువేషం గురించి సూచి

స్తున్నాను. నిన్ను క్షేమంగా గురువూర్లోని మీ బాబా యింటికి చేర్చుతాను సరా?" అన్నాడు భీమానంద్.

"నాకు మారువేషం వేసుకోవడం తెలియదు...."

"నా స్నేహితుడు రాజారావింటికి వెళ్ళు. అతడికి విద్యలో ప్రవేశ మున్నట్లు చాలామందికి తెలియదు. నేనతడి కిప్పుడే ఫోన్ చేస్తాను. అతడు నీకు కొన్ని టిప్పి స్తాడు. మేకప్ సామానూ యిస్తాడు. అయితే వెంటనే మేకప్ మార్చుకోకు. అవసరమైతేనే వేషం మార్చు కుందువుగాని...." అన్నాడు భీమానంద్.

ప్రతాప్ అతడికి ధన్యవాదాలు చెప్పుకుని బయలు దేరాడు.

3

"విజయ్ - మనిద్దరం కలిసి హాయిగా జీవిద్దాం. గతాన్ని తవ్వి - నాకు భవిష్యత్తు లేకుండా ఎందుకు చేస్తావు?" అంది రమ.

"రమా! నన్ను మన్నించు. ఆ ప్రతాప్ నంతం చేస్తే తప్ప నాకు భవిష్యత్తుండదు. నా నరనరాలా వాడిపట్ల ద్వేషం నిండిపోయింది. ఈ ఒక్క విషయంలో నా దారి కడ్డు రాకు...." అన్నాడు విజయ్.

"నీ యిష్టం....ఆ ప్రతాప్‌ని ఫోన్‌లో బెదిరించాను. బాగా భయపడ్డాడు. ఊరొదిలిపోయే ప్రయత్నంలో ఉంటాడు. దారిలో చంపాలని నువ్వనుకుంటున్నావు. కానీ నువ్వు జైల్లోంచి నిన్ననే విడుదలయ్యావు. ఈ రోజే ప్రతాప్ హత్య జరిగితే పోలీసుల అనుమానం నీ మీదకు పోదా? హత్యా ప్రయత్నానికి మూడేళ్ళు జైలు శిక్ష. హంతకుడికయితే ఉరిశిక్ష...." అంది రమ. ఆమె గొంతు జీరవోయింది.

"రమా! నీ మెడలో తాళి కట్టినందుకు నువ్వు వాడు చేయగలిగిన ఉపకారం ప్రస్తుతానికి వాడిని ఫోన్‌లో బెదిరించడమే! ఏనాడయితే నా మీద హత్యాప్రయత్న నేరం ఆపాదించబడిందో - ఆ రోజే నేను చచ్చిపోయాను. నా కింక బ్రతకాలని లేదు. తప్పుడు సాక్ష్యం పలికిన వాళ్ళ గతేమవుతుందో ప్రపంచంలోని ప్రతి ఒక్కడూ తెలుసుకోవాలి.

దేవుడు వాడికి నా చేతిలో శిక్ష విధిస్తున్నాడు. వాడి చావు ఖాయం. ఆ తర్వాత పోలీసులు నన్నే అనుమానిస్తే నాకేమీ భయం లేదు. సాక్ష్యాలు సంపాదించుకోమని సవాలు చేస్తాను ప్రత్యక్ష సాక్షులు లేకుండా చేస్తాను. ఋజువులు దొరక్కుండా చేస్తాను. అంతగా నా నేరాలు ఋజువయితే సంతోషంగా ఉరికంబ మెక్కుతాను. ఉరికంబ మెక్కితే విచార మెందుకు? ప్రతాప్‌ని చంపానన్న సంతోషంలో నా ప్రాణాలు పోగొట్టుకుందుకు బాధపడను. ప్రతాప్‌ని చంపినందుకు ఉరి ప్రతిఫలమైతే - ప్రతిఫలానికి నేను సిద్ధం...."

"విజయ్! నువ్వు ప్రతాప్‌ని చంపి తప్పించుకున్నావనుకో. పోలీసులకు నీమీద అనుమానం కూడా రాలేదనుకో. అయినా సరే నీకు సంతోషంగా ఉండదు. జీవితం తృప్తిగా ఉండదు. నేరస్థుడినన్న భావం నీలో ఉండిపోతుంది" అంది రమ.

విజయ్ నవ్వాడు - "రమా! నీకూ నాకూ తేడా ఉంది. నువ్వు బయటి ప్రపంచంలోంచీ ఈ మాటలు చెబుతున్నావు నేను జైలు అనుభవంలో చెబుతున్నాను. జైల్లో వున్నవాళ్ళందరూ నేరస్థులు కారు. బయట ఉన్న వాళ్ళందరూ పెద్దమనుషులూ కారు. నేరం చేయక

పోయినా జైలుకు వెళ్ళినవాడు నేరస్థుడే అవుతాడు. నేరం చేసినా బయట ఉన్నవాడు పెద్దమనిషే అవుతాడు. అందు వల్ల నన్నిప్పుడే సెంటిమెంట్సూ బాధించవు.

ఒకవేళ అలాంటి సెంటిమెంటు నిన్ను బాధిస్తూంటే చెబుతున్నాను విను. ప్రతాప్ వంటి దుర్మార్గుడు బ్రత క్కూడదు. వాణ్ణి చంపినందు కసలే శిక్ష ఉండకూడదు. ఒకవేళ శిక్షంటూ ఉంటే అది మూడు సంవత్సరాలకు మించకూడదు. నా శిక్ష అయిపోయింది. ఇక నేను నేరం మాత్రం చేయాల్సి వుంది. అసలు నాకు జెయిలు శిక్ష ఎందుకు పడిందనుకుంటున్నావ్? చేయని నేరానిక్కాదు. చేయబోయే నేరానికి!"

రమ అతడి వంక నిస్సహాయంగా చూసి - "నీతో వాదించలేను. వాదించాలని కూడా అనుకోవడం లేదు. జెయిలు జీవితం నీ మనసు మీద గట్టి దెబ్బ తీసింది. కాబట్టి నేనేం చెప్పినా నాకు తోచింది నేను చెప్పాననుకో. నీకు తోచింది నువ్వు చేయి...." అంది.

"థాంక్యూ రమా!" అన్నాడు విజయ్.

"ఇప్పుడేం చేస్తావ్?" అంది రమ.

"నేను ప్రతాప్‌కి తెలియకుండా వాణ్ని కనిపెడుతు న్నాను. వాడు భీమానంద్‌ని కలుసుకున్నాడు. బయటకు వచ్చాడు. తర్వాత వాడేం చేస్తున్నదీ కనిపెట్టమని ఓ కుర్రాడి కప్పజెప్పాను. ఈ రోజు ఏదో సమయంలో వాడు పారిపోయే ప్రయత్నం చేస్తాడని నా అనుమానం."

"ఆ కుర్రా డెవరు? నీకు వ్యతిరేకంగా సాక్ష్యమివ్వడు కదా?"

వాడో అనాధుడు. వాడికి నేను చాలాసార్లు సాయ పడ్డాను. వాడికి నేనంటే ప్రాణం. వాడు నాకు వ్యతి

రేకంగా సాక్ష్యమివ్వడు. అయినా పోలీసులకు వాణ్ని సాక్ష్యానికి పిలవాలని తోచే అవకాశమే ఉండదు."

"ప్రతి హంతకుడూ ఇలాగే అనుకుంటాడు" అని ఎత్తిపొడిచింది రమ. "ఇంతకీ నువ్వేం చేయాలనుకుంటు న్నావో చెప్పు...."

"నా మోటార్ సైకిల్ మీద వాడి ననుసరిస్తాను. దాంతో వాణ్ణి చంపడానికి ఇదిగో చూడు...." అంటూ జేబులోంచి బటన్ నైఫ్ తీసి బటన్ నొక్కాడు.

తళ తళ మెరిసింది పదునయిన కత్తి.

రమ ఆ కత్తివంక భయంగా చూసింది. తన భవిష్యత్తును హత్య చేయబోతున్న ఆయుధ మది.

"కత్తిని దాచేసేయ్" అంది రమ.

విజయ్ నవ్వుతూ జేబులో కత్తి వేసుకుని - "నాకే ఆశ్చర్యంగా ఉంది. నాకిప్పు డెలాంటి టెన్షనూ లేదు. తప్పు చేస్తున్నానన్న భావం లేదు. పట్టుబడతానన్న భయం లేదు" అన్నాడు.

"నాకు మాత్రం వళ్ళంతా వణుకుతోంది...."

"రమా! భయపడే వాళ్ళనీ లోకం తరిమి తరిమి వేధిస్తుంది. భయపెట్టేవాళ్ళని చూసి భయపడి పారి పోతుంది. నువ్వు భయపడకు. భయపెట్టడం నేర్చుకో!" అన్నాడు విజయ్!

"నువ్వేం చెప్పినా ఇప్పుడు నేను చేసే దొక్కటే! నా విజయ్‌కు భవిష్యత్తు లేకుండా చేయవద్దనీ, మేమిద్దరం కలిసి హాయిగా, సుఖంగా కాపురం చేసేలా అనుగ్ర హించమనీ - భగవంతుణ్ణి ప్రార్థిస్తాను."

"రమా! అన్నింటికీ మించి నా అభీష్టం నెరవేరాలని భగవంతుణ్ణి ప్రార్థించు—" అన్నాడు విజయ్.

4

"కారెక్కు!" అన్నాడు భీమానంద్.

"మారుతీ తీశారేం!" అన్నాడు ప్రతాప్.

"ఈ కారును మంచి పనుల కుపయోగిస్తుంటాను. ఇది నాకు శుభప్రదమైనది మనం వెళ్ళాల్సిన గురువూర్ - ఇక్కణ్ణించి అరవై కిలోమీటర్ల దూరం మాత్రం. అన్నింటికీ ఇదే అనుకూలం...." అన్నాడు భీమానంద్.

"సరే - మీ యిష్టం" అంటూ కారెక్కాడు ప్రతాప్. మారుతి స్టార్టయింది.

"కొంతదూరం వెళ్ళాక - మనమేదో కొత్తదారిలో వెడుతున్నట్లుందే-" అన్నాడు ప్రతాప్.

"అవును - ఇక్కణ్ణించి తిన్నగా ప్రకాశంరోడ్డుకు వెడితే అక్కణ్ణించి జగన్నాథపురం వెళ్ళే రోడ్డుంది. ఆ రోడ్డులో ప్రయాణంచేస్తే ఓ అడ్డదారి వస్తుంది. అది గురువూర్ వెళ్ళే రోడ్డుకి కలుపుతుంది. మన మెక్కడికి వెడుతున్నామో - ఎలా వెడుతున్నామో ఎవరికీ తెలియదు...."

"మీరు నాకోసం చాలాజాగ్రత్తలు తీసుకుంటున్నారు."

"అందుకు ముఖ్య కారణం చెప్పనా?" అన్నాడు భీమానంద్ - "నువ్వు విజయ్‌ని జైలుకు పంపాలనుకు నేందుకు నీ కారణాలు నీ కున్నాయి. నేనందుకు నిన్ను ప్రోత్సహించలేదు కూడా! కానీ విజయ్ జైలుకు వెళ్ళడం వల్ల అతడిస్థానంలో ఆఫీసులో సీట్లోకి వచ్చిన భాస్కర్ నాకు చాలా ప్రయోజనకారిగా ఉన్నాడు. ఈ మూడు నెలల్లోనూ-నేనీ మారుతీ కారుకి తీసుకున్న లోన్ కట్టేశాను."

"మారుతీ కారు కొనడానికి మీరు లోన్ తీసుకున్నారా?" ఆశ్చర్యంగా అడిగాడు ప్రతాప్.

"నేను తీసుకోలేదు. నాకైతే లోనుకూడా దొరకదు. మా చుట్టాలబ్బాయి పేరుమీద కొన్నానిది. విజయ్ జైలు శిక్ష కారణంగా నాకీ కారు ఊరికే వచ్చినట్లయింది. అందు వల్ల నేనీ కార్లో నీ పనికి సాయపడుతున్నాను."

కారు—ప్రకాశం రోడ్డు దాటేక—జగన్నాధపురం వెళ్ళే రోడ్లో ప్రవేశించింది.

అప్పుడు చూశాడు ప్రతాప్....కాస్త దూరంగా తమకు వెనుకగా ఓ మోటారుసైకిలు....ఆ సైకిలుమీద విజయ్.

"సార్! విజయ్ మన ననుసరిస్తున్నాడు" అన్నాడతడు.

"అవును - నేను గమనించాను....అయితే అందు కుపాయం సిద్దంగానే ఉంది...."

భీమానంద్ వివరించాడు.

జగన్నాధపురంనుంచి గురువూర్ రోడ్డును కలిపే అడ్డదారిలో చాలా మెలికలుంటాయి. ఆ దారిలో వెళ్ళే టప్పుడు నువ్వు కారు దిగి పోదువుగాని. నేను విజయ్‌ని తప్పుదారి పట్టించి మళ్ళీ వచ్చేదాకా ఆ ప్రాంతాలే తిరుగు తూందువుగాని."

ప్రతాప్ భీమానంద్‌ని మెచ్చుకున్నాడు గానీ అతడి మనసులో భయం పెరిగింది.

భీమానంద్ అతణ్ణి అడ్డదారిలో దింపేశాడు.

విజయ్ దృష్టిలో ఆ సన్నివేశం పడలేదు. అతడు మారుతీ కారు ననుసరిస్తూ కొంతదూరం వెళ్ళి - గురువూర్ రోడ్డు చేరేలోగానే—కారును దాటించి ముందుకి వెళ్ళి - అడ్డంగా ఆపి తను దిగాడు.

భీమానంద్ తనూ కారాపాడు.

విజయ్ జాప్యం చేయలేదు. అతడు ప్రతాప్ గురించి వాకబు చేశాడు.

"నాకు తెలియదు...." అన్నాడు భీమానంద్.

"భీమానంద్! నాకు నీమీద పగలేదు. కానీ ప్రతాప్ గురించి నాకు ఆచూకీ చెప్పకపోతే ఇప్పుడే నిన్ను చంపేస్తాను...." అన్నాడు విజయ్.

భీమానంద్ దబాయించాలని చూశాడు కానీ ప్రయోజనం కనబడలేదు. విజయ్ ఆవేశంలో ఉన్నాడు. అన్నింటికీ తెగించినవాడిలా కనబడుతున్నాడు.

"దారిలో దింపేశాను...." అన్నాడు భీమానంద్.

"ఎక్కడ దింపావో చూపించు..." అన్నాడు విజయ్.

ఇద్దరూ వెనక్కుమళ్ళారు. ప్రాణభయంకొద్దీ భీమానంద్ విజయ్‌కు తను దింపిన చోటు చూపించాడు.

అప్పుడక్కడ ప్రతాప్ ఉన్నాడు. కానీ అతడి వేషం, బట్టలు పూర్తిగా మారిపోయాయి. పేద వృద్ధుడిలా ఉన్నాడతడు.

"తాతా: ఇక్కడ నువ్వెవరినైనా చూశావా?" అనడిగాడు విజయ్. అతడు ప్రతాప్‌ని గుర్తుపట్టలేదు.

ప్రతాప్ గొంతును వణికిస్తూ - "ఓ మనిషిని చూశాను. మనిషి చాలా వెధవలాగున్నాడు. నాదగ్గిర్నుంచి ఓ పంద రూపాయలు లాక్కున్నాడు. నే నిప్పు డర్జంటుగా గురువూర్ వెళ్లాలి. నా కోడలు చావుబ్రతుకుల్లో ఉందని తెలిసింది. లారీ ఎక్కి వెడుతూంటే డ్రైవ రిక్కడ దింపేసి—ఈ అడ్డదారిన గురువూర్ రోడ్డుకి వెళ్ళి ఇంకో లారీ చూసుకోమన్నాడు...." అన్నాడు.

విజయ్ ప్రతాప్‌ని—ఆ వెధవ వివరాలు చెప్పమని అడిగాడు. ప్రతాప్ ప్రతాప్‌ని వర్ణించి చెప్పి - ఓ దారి చూపించి - "ఓ అయిదు నిమిషాల క్రితం- ఈ దారిలోనే వెళ్ళాడు" అని చెప్పాడు.

విజయ్ భీమానంద్‌తో—"నువ్వు చేసిన తప్పులన్నీ క్షమిస్తాను. ఈ వృద్ధుణ్ణి గురువూర్ చేర్చు" అన్నాడు.

తను కోరినదే విజయ్ కూడా కోరుతున్నాడు. భీమానంద్‌కు కలిగిన సంతోష మింతా అంతా కాదు. అయిష్టాన్ని నటిస్తూనే అతడందు కంగీకరించాడు.

కారు వెనక్కి తిరిగి ప్రతాప్‌ని తీసుకుని వెళ్ళిపోయింది.

విజయ్ అక్కడే ప్రతాప్‌కోసం ఎంతోసేపు వెతికాడు. ప్రతాప్ ఎక్కడా కనిపించలేదు.

అప్పుడతడికి అనుమానం వచ్చింది.

తనుగానీ మోసపోయాడా? చేజేతులా ప్రతాప్‌ని వదిలిపెట్టాడా?

అసలా నిర్మానుష్య ప్రాంతంలోకి వృద్ధుడెలా వచ్చాడు? తా నతడి మాటలనెలా నమ్మాడు?

విజయ్ చటుక్కున మోటార్‌సైకిల్ స్టార్టు చేశాడు. గురువూర్ రోడ్డు చేరుకునేటందు కతడికెంతోసేపు పట్టలేదు.

"ఎంత పొరపాటు చేశాను?" అనుకుంటూ అతడు తన వాహనం వేగం పెంచాడు. అతడలా రెండు కిలోమీటర్లయినా వెళ్ళాడో లేదో దారిలో వాహనాలన్నీ స్థంభించిపోయి ఉన్నాయి.

విజయ్ కుత్సాహం వచ్చింది. ఏదో కారణంగా ట్రాఫిక్ జామ్ వచ్చి ఉండాలి. ముందెక్కడో మారుతి కూడా ఉంటుంది. అక్కణ్ణించి జాగ్రత్తగా అనుసరించి వెళ్ళి ప్రతాప్‌ని అంతం చేయాలనుకున్నాడు విజయ్.

వెనుకనున్న వాహనంలోని వ్యక్తి నడిగితే—"ఏదో యాక్సిడెంటయిందట - ఒక మారుతీకారు పప్పుపప్పై పోయింది. అందులో ఇద్దరు మనుషులున్నారు. ఇద్దరూ అప్పటికప్పుడే పోయారు. ఒకడైతే మారువేషంలో

ఉన్నాడట. పెట్టుడు గడ్డం యాక్సిడెంట్లో ఉండిపోయిందిట....” అని చెప్పాడు.

విజయ్ తెల్లబోయాడు.

యాక్సిడెంట్లో చనిపోయింది - ప్రతాప్ భీమానంద్ లేనని అతడికి తెలియడానికెంతోసేపు పట్టలేదు.

అప్పుడతడికి జైలర్ మాటలు గుర్తుకు వచ్చాయి.

“మంచితనం మనిషికి సుఖాన్నిస్తుంది. సహనం సంతృప్తినిస్తుంది. దుర్మార్గులకు శిక్ష భగవంతుడే విధిస్తాడు. నువ్వు భగవంతుణ్ణి నమ్ము....”

రమ తాను భగవంతుణ్ణి మంచి భవిష్యత్తుకై ప్రార్థిస్తున్నానంది.

భగవంతుడున్నాడా?

అతడే భీమానంద్, ప్రతాప్‌లను శిక్షించాడా?

అది వారికి శిక్షకాదు—తనకు రక్ష....

ప్రతాప్‌ని తను చంపాలనుకున్నాడు. ప్రతాప్ భీమానంద్‌ను సాయం కోరాడు.

తక్షకుడింద్రుణ్ణి శరణువేడితే — సర్పయాగంలో సహేంద్ర తక్షకాయస్వాహా అని పిలుపు వచ్చింది. ఇంద్రుడి సింహాసనం కదిలిపోయింది.

దుర్మార్గులకు శిక్ష తప్పదు ఆది తెలియక చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలనుకునే వారికి — జీవితంలో ఏమీ మిగలదు.

మంచితనం సహనం—ఈ రెండూ అలవర్చుకుంటే మనిషికి భవిష్యత్తుంటుంది.

విజయ్ తన అదృష్టాన్నభినందించుకుంటూ వెనక్కు తిరిగాడు. అతడి మనసిప్పుడు రమ కోసం ఉరకలు వేస్తోంది. □

త్రైరె బాజ్ఖాన్ రోడ్ నించి సర్రున దూసుకొస్తోంది ఓ కారు! అందులో వున్నారు డిటెక్టివ్ దీక్షితులు, అసిస్టెంటు చిరంజీవి!

దీక్షితులు చేతిలో ఫైలుని తాపీగా పరిశీలిస్తూ కేసుని స్టడీ చేస్తున్నాడు.

14 వ తేదీ ఉదయం గాంధీ విగ్రహానికి సమీపంలో ఓ శవం!!

తెల్లవారుతుండగా మోర్నింగ్ వాక్‌కి వెడుతున్న కొందరు వ్యక్తులు శవాన్ని గమనించి పోలీస్‌స్టేషనుకి సమాచారం అందజేశారు. హుటాహుటిన ఇన్‌స్పెక్టర్ శతభిషం ఆ ప్రదేశానికి చేరుకున్నాడు.

శవం బోర్లాపడివుంది. బట్టలనిండా దుమ్ముకొట్టుకుని వుంది. హతుడికి పాతికేళ్ళుంటాయి. సన్నాగా వున్నాడు. జేబులో దొరికిన కాగితాలనిబట్టి అతడెవరో సులభంగానే గుర్తించగలిగారు పోలీసులు.

పేరు సుబ్రమణ్యం! పనిచేసేది పత్రికా విలేఖరిగా. పత్రికపేరు, అడ్రసూ వున్నాయి.

ఫొటోలు, శవం పడివున్న ప్రదేశం కొలతలు మొదలైన తతంగాలన్నీ పూర్తిచేసి శవాన్ని మార్చురీకి పంపించేడు ఇన్‌స్పెక్టర్.

తర్వాత దర్యాప్తులో భాగంగా పోలీసు కుక్కల్ని రప్పించి వాసన చూపించారు. అది మెయిన్‌రోడ్డు కావడం చేత, వాహనాల రద్దీవల్ల ఆచూకీ కనుక్కోలేక పోయాయి.

శవ పరీక్ష రిపోర్టులో డాక్టరు తెలిపిన ప్రకారం సైకిల్‌చైన్‌వంటి ఇనుప వస్తువుతో ఇష్టం వచ్చినట్టు కొట్టడంవలన ఒళ్ళంతా గాయాలయ్యాయి. మెడక్రింద తగిలిన గాయంవల్ల రక్తం బాగా పోయి మరణం సంభవించింది. హత్యరాత్రి సుమారు పదిన్నరా పదకొండు గంటలమధ్య జరిగింది.

ఇదీ క్లుప్తంగా ఫైలులోవున్న సమాచారం!

ఫైలుమూసి, జేబులోంచి ముక్కుపొడుం డబ్బాతీసి కొంచెం పీల్చి "నాయనా రంజీ! కేసు చదివేవుకదా! నీకు

తోచిన మొదటి పాయింటేవిటో చెప్పు!" అన్నాడు దీక్షితులు.

"ఏవుంది? రక్తం బాగా పోయిందని రిపోర్టులోవుంది. శవం దొరికినచోట అసలు రక్తంమరకలే లేవు. అంటే అతడ్ని ఎక్కడో హత్యచేసి తీసుకొచ్చి అక్కడ పడేశారన్నమాట!" అన్నాడు చిరంజీవి కళ్ళు మూసుకుని ఆలోచించి.

"ఆ పాయింటు ఎలిమెంటరీ స్కూలు కుర్రాడు చెప్తాడు! ముందు దిగు.... పురూరవుడి ఆఫీసొచ్చింది." అంటూ కారు దిగేడు దీక్షితులు.

పురూరవుడు ఓ పేరున్న దిన పత్రికకి ఎడిటరు. అతడి ఆఫీసులోనే రిపోర్టరుగా పనిచేశాడు హతుడు సుబ్రమణ్యం!

హతుడిగురించి సదభిప్రాయం వ్యక్తంచేశాడు ఎడిటరు.

"పత్రికలో పనిచేస్తున్న కొద్దిమంది మెరికల్లాంటి విలేఖర్లలో సుబ్రమణ్యం మొదటివాడు. అతడు జీతానికి పనిచేసే ఉద్యోగిలా కాక సిద్ధాంతాలకు, నియమాలకూ కట్టుబడి వృత్తికి అంకితమైనవ్యక్తి! నలుగురితోనూ సరదాగా వుండే అతడికి గిట్టనివాళ్లు కూడా వుంటారంటే ఆశ్చర్యంగావుంది" అన్నాడు ఎడిటరు.

"ఈమధ్య—అంటే గత కొద్దిరోజుల్లో అతడెవరైనా కొత్తవాళ్ళతో కలిసి తిరగడంగాని చూశారా?" అడిగేడు చిరంజీవి.

"విలేఖరన్నాక కొత్తవాళ్ళతో పరిచయాలు తప్పవు. అలాగని అనుమానించదగ్గ పరిచయయాలేవీ నా కంట పడలేదు."

"అమ్మాయిలతో చనువుగా తిరిగే స్వభావమా అతడిది?

అతడి ప్రవర్తనలో ఏదైనా మార్పు గమనించారా ఈ మధ్య?"

"అటువంటిదేమీలేదు. కాకపోతే— నాలుగురోజుల క్రితం ఫొటో రీలొకటి మిస్సయినందుకు కోప్పడ్డాను. అందువల్ల అతడు ఆ రోజు నొచ్చుకున్నా మర్నాటినించి మామూలుగానే వున్నాడు." అన్నాడు పురూరవుడు.

"ఫొటో రీలేవిటీ? ఏ రోజున? వివరంగా చెప్పండి దయచేసి!" ఉత్సాహంగా అడిగేడు చిరంజీవి.

"మొన్న 11 వ తారీకునాడు గండిపేటలో ఎమ్మెల్లేలతో ఎన్టిఆర్‌గారి సమావేశం, ఫంక్షనూ ఉన్నాయంటే పంపించాను. రాత్రి తొమ్మిదీ తొమ్మిదిన్నరకి అక్కడి కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి. వాటి ఫొటోలు, వార్తలు తీసుకురావాల్సిన సుబ్రమణ్యం ఫొటోలు తీశాక రీలు ఎక్కడో మిస్‌చేశాడు. పదీ పదిన్నరకి ఆఫీసుకి రాగలిగిన మనిషి రాత్రి పన్నెండున్నరకొచ్చాడు.

ఫొటోలగురించి ప్రశ్నించేసరికి రీలు పోయిందన్నాడు. అతడి వాలకం చూస్తే నమ్మబుద్ధికాలేదు. ఎక్కడ పోయిందీ....ఎలా పోయిందీ అని నేను నిలదీసి రెండు చీవాట్లేశాను.

క్షమించండి! రీలుపోయింది! అందుకు మీరే పనిష్మెంట్ ఇచ్చినా సిద్ధంగా వున్నానన్నాడు. న్యూస్ ఐటమ్ మాత్రం రాసిచ్చాడు.

నిజానికి వేరే రిపోర్టర్ అయితే మెమో యిచ్చివుండేవాణ్ణి!

అతడి వ్యక్తిత్వంమీద, నిజాయితీమీద నాకు గట్టి నమ్మకం. అందుకే అతణ్ణి ఏమీ అనలేకపోయాను.

మర్నాటినించి మామూలుగానే వున్నాడు." అన్నాడు

ఎడిటర్.

"హత్యజరిగిన నాటి రాత్రి మీరతణ్ణి ఎప్పుడు చూశారు ఆఖరుగా?"

"రోజూ రాత్రి పదిగంటలకి ఇంటికి వెళ్ళిపోతాడు. అలాగే ఆ రోజుకూడా సుమారు పది ప్రాంతంలో నాకు చెప్పి వెళ్ళేడు. న్యూస్ ఐటమ్స్ చెక్ చేస్తున్న నేను తలెత్తకుండానే 'గుడ్ నైట్' చెప్పేను. కాని అదే అతడి ఆఖరు రాత్రి అవుతుందని ఊహించలేదు." పురూరవుడు బాధగా అన్నాడు

"థేంక్స్. అవసరమైతే కలుస్తాం!" అనేసి డిటెక్టివు లిద్దరూ విశ్రమించేరు.

* * *

ఆఫీసులోకి వస్తూనే అడిగేడు ఇన్స్పెక్టర్ శతభిషం "ఎనీ ప్రోగ్రెస్?" అంటూ.

డిటెక్టివ్ దీక్షితులు చిన్నగా తలూపేడు.

"బై దిబై ....ఓ క్లూ దొరికింది! శుక్రవారం రాత్రి సుమారు ఒంటిగంట ప్రాంతంలో ట్యాంక్ బండ్ వైపు వేగంగా దూసుకుపోతున్న మారుతీకారు నెంబర్ నోట్ చేశాడొక బీట్ కానిస్టేబిల్! శవాన్ని ఎక్కణ్ణించో తెచ్చి గాంధీబొమ్మవద్ద పడేశారని ఊహిస్తున్నాం కాబట్టి ఈ కారు ఆ దిక్కునుంచే వస్తోంది కాబట్టీ మనం అనుమానించొచ్చుకదా?" అన్నాడు ఇన్స్పెక్టర్ శతభిషం.

"వెరీ గుడ్!" అంటూ గట్టిగా అరవబోయిన చిరంజీవి, దీక్షితుల్ని చూసి ఆగిపోయాడు.

దీక్షితులు రెండు క్షణాలు మౌనంగా వుండి అన్నాడు "గండిపేటలో రాత్రి తొమ్మిదిన్నరకి బయలుదేరిన మనిషి పదిన్నరా....తప్పితే 11 గంటలకి ఆఫీసుకు

చేరుకోవచ్చు. పన్నెండున్నరదాకా రాలేదని ఎడిటరు చెప్పేడు. అంటే ఈలోగా సుబ్రమణ్యం ఎక్కడికైనా వెళ్ళేడా? వెళ్ళడానికి అవకాశం వుంది. నిజాయితీ వున్న మనిషని చెబుతున్నారు కాబట్టి తనంత తానుగా విధులని విస్మరించి పోడు.

ఫొటో రీలు పోయిందన్నాడు. దొంగతనం లాంటిది జరిగితే కెమేరా దగ్గిర్నుంచి అన్నీ పోతాయి. కాని ఒక్క రీలు మాత్రమే మిస్సయింది. దీన్నిబట్టి అతడి ఆలస్యానికి, రీలు పోవడానికీ ఏదో సంబంధం వుండి వుండాలి!

ఫొటోరీలు ఎవరైనా చేజిక్కించుకున్నారా? ఆ అవసరం ఎవరికుంటుంది? పార్టీ ఫంక్షను ఫొటోలేగాక అతడు రహస్యంగా ఏవైనా ఫొటోలు తీశాడా? ఇవన్నీ పరిశోధించాలి! సమ్‌థింగ్ ఈజ్ ఫిషీ ఇన్దిస్! దీనికి హత్యకీ కూడా సంబంధం వుండివుంటుందని నా కనిపిస్తోంది! ఏవంటారు?" అన్నాడు దీక్షితులు ముక్కుపొడుం డబ్బా తీసి.

'నిజమే' నవిపించింది శతభిషం చిరంజీవులకి.

"అదలా వుంచుదాం! ఇప్పుడు మన శతభిషం చెప్పిన మారుతీ కారు గురించి కూడా ఎంక్వయిరీ చెయ్యాలి? కారు యజమానినీ, దానిని తరచుగా వుపయోగించే మనుషుల్నీ ఆచూకీ తియ్యాలి. అంతే కాకుండా 11 వ తేదీ రాత్రి వాళ్ళు ఎక్కడ వున్నదీ తెలుసుకుని, సుబ్రమణ్యం నుంచి ఫొటోరీలుగాని వాళ్ళకి చిక్కిందేమో కనుక్కోవాలి! అప్పుడుగాని హత్యకు కారణం దొరకదు."

"రీలు అందుకున్నవాడు ఊరికే వుంచడు కదా! ఏదో ఒక స్టూడియోలో కడిగిస్తాడు. అందులో ఏవైనా రహస్య దృశ్యాలుండే పక్షంలో దానిని ఎక్కడపడితే అక్కడ

డెవలప్ చేయించడు. అందుకు తెలిసున్న స్టూడియో అన్నా వుండాలి లేదా డబ్బులు అధికంగా చెల్లించి గప్ చిప్‌గా ఎక్కడో ప్రింట్లన్నా వేయించుకుంటాడు. కాబట్టి మనం స్టూడియోలనీ వాటికి చెందిన మనుషుల్నీ కూడా వదలిపెట్టకూడదు."

"ఇదంతా ఒక పద్ధతి: మన ఊహకి అతీతంగా ఏదైనా వేరే సంఘటన జరిగివుంటే మరో రకంగా ముందుకెళ్ళాలి. అంతేగాని తొందరపడి మారుతీ కారు యజమానిని నిలదీస్తే సరిపోదు. పైగా అతణ్ణి మనం అనుమానిస్తున్నట్టు తెలిస్తే ఫొటోరీలు మాయం చేసెయ్యగలడు."

డిటెక్టివ్ దీక్షితులు చెప్పిందంతా బుర్రకి పట్టించుకున్నాక అన్నాడు శతభిషం—"ఆ విషయం మా కొదిలెయ్యండి సార్! రెండు రోజుల్లో ఫొటోరీలు గురించి, మారుతీ కారు వాడికి ఇందులో ప్రమేయం వున్నదా లేదా అన్న సంగతీ తెలుసుకుంటాం!"

* * *

నిమిషాల్లో మారుతీ కారు యజమాని అడ్రసు దొరికిపోయింది కారు నెంబరు సహాయంతో. శతభిషం చిరంజీవి రంగంలో కురికి ఒకదానివెంట మరొకటి ఆధారాలు పట్టుకుని కూపీలాగడం ప్రారంభించేరు.

కారు ఓనరు లక్షాధికారి మంచివాడో కాదో తెలియదుగానీ రెండు నెలలనించి ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో వున్నాడు. అతడి కొడుకు సంజీవ్‌మాత్రం చలాకీగా కారు నడుపుతూ కంటబడ్డాడు. అంచేత డిటెక్టివ్‌ల దృష్టి అతడిమీద పడింది.

చదువుధ్యాస అంతగా లేకపోయినా కాలేజీ ఎలక్షన్స్‌లో

చురుగ్గా పాల్గొని ఎన్నికల కొట్లాటలకి నాయకత్వం వహించాడు. అమ్మాయిల్ని ఏడిపించే స్వభావం వుండడం వల్ల వాళ్ళ ఓట్లేవీ పడక ఎలక్షన్‌లో ఓడిపోయాడు.

ఈ పరిశోధనలో అనుమానాలేగాని ఋజువులు దొరక నందున రాత్రి వాచెమెన్‌ని కలిసి అతన్ని మంచి చేసు కున్నారు శతభిషం, చిరంజీవి.

సంజీవ్‌కి కుడిభుజం భూషణం. వీళ్ళిద్దరూ అమ్మాయి లతో రాత్రిళ్ళు కాలేజీ గార్డెన్‌లో అనేకసార్లు తనకి కని పించారనీ, వాళ్ళకి చెడు సహవాసాలన్నీ వున్నాయని సర్టిఫై చేశాడు వాచ్‌మెన్.

అప్పట్నుంచి డిటెక్టివ్‌లకి చేతినిండా పని మొదలైంది. సంజీవ్‌ని, భూషణాన్ని నీడలా వెంటాడ సాగేరు.

*　　　*　　　*

రెండు రోజుల తర్వాత——

దీక్షితులి సమక్షంలో చిరంజీవి వుండగా ఇన్స్పెక్టర్ శతభిషం వచ్చాడు హడావుడిగా.

వస్తూనే "ఇదిగో మనకు కావలసిన ఫొటో స్టూడియో అడ్రసు!" అంటూ జేబులోంచి ఓ కాగితం తీసి దీక్షితులి కందించాడు.

ఆ అడ్రసు రాబట్టడానికి శతభిషం, చిరంజీవులొక పథకం వేశారు. భూషణం క్లాసుమేటు నొకణ్ణి మంచి చేసుకుని "తన ఇంట్లో ఓ ఫంక్షనుందనీ, నీకు తెలిసిన ఓ ఫొటోగ్రాఫర్ ఎవరైనా వుంటే సజెస్ట్ చెయ్యమనీ" అతడిచేత భూషణాన్ని అడిగించారు.

అడ్రసు లభించగానే డిటెక్టివ్‌లు జీపులో బయలేరి స్టూడియోకి వెళ్ళేరు. కౌంటర్‌పద్ద అద్దంకింద ఎన్టీఆర్, పార్టీ కార్యకర్తల ఫొటోలు రెండు వెళ్ళగానే దర్శన

మిచ్చాయి.

రెండు నిమిషాల్లో ఫొటోగ్రాఫర్‌నుంచి విషయాలు రాబట్టేరు. భూషణం ఫొటో రీలొకటి తెచ్చి, దగ్గరుండి డెవలప్ చేయించాడనీ రీలు చూడగానే ఎందుకో నిరుత్సాహపడి, మర్నాడొచ్చి నెగెటివ్ రీలు పట్టుకెళ్ళిపోయాడనీ చెప్పేడు స్టూడియోమనిషి. మిగతా వివరాలేవీ తనకు తెలియవనీ, తను మాత్రం ఎస్టీఆర్ వున్నాడని రెండు ఫొటోలు తీసి పెట్టుకున్నాననీ చెప్పేడు.

తర్వాత డిటెక్టివ్‌ల పని సులభమైపోయింది. వాళ్ళు లాగిన తీగతో డొంకంతా కదిలింది.

* * *

రాత్రి పది కావస్తోంది. రోడ్లన్నీ ఇంచుమించు నిర్మానుష్యమైపోయాయి. అప్పుడప్పుడు వచ్చే మూడు నాలుగు మోటారు వాహనాలు మాత్రం కనిపిస్తున్నాయి.

బస్‌స్టాపులో ఓ యువతి ఆదుర్దాగా బస్‌కోసం ఎదురు చూస్తోంది. తన స్నేహితురాలిని ఆసుపత్రిలో చేర్చారని తెలిసి ఆఫీసు అయ్యేక చూడడానికొచ్చింది. తీరా తనొచ్చేక స్నేహితురాలి పరిస్థితి విషమించేసరికి తను వెంటనే విడిచిపెట్టి రాలేకపోయింది. రోడ్డుమీద పడేసరికి ఈ ఆలస్యమయింది.

ఆమె గుండెల్లో ఒంటరితనం తాలూకు భయం క్షణక్షణం పెరిగిపోతోంది. బస్సుమాత్రం రావడంలేదు.

ఒకటో రెండో ఆటోలు పిలుపుకు అందనంత వేగంగా దూసుకుపోయాయి.

ఇంతలో ఓ మారుతీకారు తనని దాటివెళ్ళి మళ్ళీ వెనక్కివచ్చి ఆమె ప్రక్క ఆగింది.

తెలుసున్నవాళ్ళెవరో తనని చూసి లిఫ్ట్ ఇవ్వడంకోసం

వచ్చారనుకుని రెండడుగులు ముందుకేసి కారుని సమీపించిందా యువతి.

కారు తలుపు తెరుచుకోవడం, బలమైన రెండుచేతులు హఠాత్తుగా ఆమెను లోపలికి గుంజి తలుపు వేసుకోవడం క్షణంలో జరిగిపోయాయి! కారు కదిలిపోయింది!!

ఆమె దురదృష్టమో, వాళ్ళ అదృష్టమోగాని ఆ దుర్ఘటనని ఎవరూ చూసిన పాపాన పోలేదు.

కారులో డ్రైవరుకాక వెనుకసీట్లో కూర్చున్న ఇద్దరు యువకుల కబంధహస్తాల్లో లేడిలాగా గింజుకుంటోంది ఆ యువతి. మాట్లాడే అవకాశం లేకుండా నోరు బలంగా మూసి పట్టుకున్నాడొకడు. వారిద్దరూ ఎవరోకాదు భూషణం, సంజీవ్‌లు!!

పది నిమిషాల్లో కారు నగరం పొలిమేరల్లో ఉన్న బండరాళ్ళపక్క ఆగింది — రోడ్డుకి పదిగజాల దూరంలో. అంతవరకూ ఎనుబోతు కాలిగిట్టల కింద రెక్కలుపడిన సీతాకోక చిలుకలా విలవిల్లాడిన ఆ అబల శక్తిఅంతా కరిగిపోయి నీరసంగా విలపించసాగింది. కారులోంచి మెల్లగా కిందకు దించేరామెను.

దించేక కొద్దిగా స్వేచ్ఛకలిగినట్టు అనిపించి రెండడుగులు వెనక్కివేసి పారిపోవాలని వ్యర్థప్రయత్నంచేసింది. డ్రైవరు ఒక్క అంగలో ఆమెను సమీపించి జుట్టుపట్టుకుని ఈడ్చుకొచ్చేడు.

"అమ్మా!" ప్రాణాలన్నీ గొంతుకలోకి తెచ్చుకుని ఆర్తనాదంచేసింది. "రక్షించండి....ప్లీజ్.... హెల్ప్!!"

పట్టపగలే మనుష్యసంచారం అంతగా వుండని ఆ ప్రాంతంలో అర్ధరాత్రి ఓ ఆడపడుచు వేలగా ఆక్రోశిస్తే ఎవరువింటారు? చుట్టూవున్న బండరాళ్ళు నిశ్చలంగా

చూస్తూ నిలబడ్డాయి!!

భూషణం కసిగా ఆమె మీదకురికి బట్టలు చేతికందినవి అందినట్టు ఊడబీకి ఆమెను నగ్నంగా చేసి స్నేహితుడి వైపు తోశాడు వికటంగా నవ్వి.

"నన్నేం చెయ్యొద్దు.... ప్లీజ్ ....దణ్ణంపెడతా:" ఆమె దీనంగా చేతులు జోడించింది.

అదేక్షణంలో ఎవరూ ఊహించని విధంగా ఓ టార్చి లైటు వెలిగింది!!

అదిరిపడ్డారు దుష్టత్రయం!

క్షణంలో ఆ టార్చి చుట్టూవున్న ప్రదేశాల్నీ, కారు నెంబర్నీ. మనుషుల్నీ పరామర్శ చేసింది!

"కౌన్ హై?" డ్రైవరు ముందుకు వెళ్ళబోయి పోలీసు మనిషేమోనని భయంతో జంకేడు.

"నేనొక న్యూస్‌పేపర్ రిపోర్టర్‌ని. పేరు సుబ్రమణ్యం! గండిపేట పార్టీ ఆఫీసునించొస్తున్నాను. మీ రిక్కాదేదో పాడుపనికి పూనుకున్నట్టు కనిపిస్తోంది....సంగతేవిటి?" విలేఖరి గొంతు నిర్భయంగా పలికింది.

"అన్నా!". దేవుడే తనని రక్షించడానికి ఇలా దిగొచ్చాడని భావించి ఆ యువతి ఒక్క పరుగులో అతడి వెనక్కివచ్చి చేరింది.

రసభంగం అయిపోయింది! కీచకుల ఒళ్ళు ఆవేశంతో రగులుకుపోయింది!

అంతే! మెరుపువేగంతో డ్రైవరుకొట్టిన దెబ్బకి విలేఖరి ఎగిరి రాళ్ళగుట్టమీద పడ్డాడు! వెంటనే కిందపడిన బ్యాటరీ లైటు తీసుకుని విలేఖరిమీద ఫోకస్‌చేశాడు సంజీవ్.

అతడి నోటివెంట రక్తం కారుతోంది. మెడలో కెమేరా, బ్యాగూచూసి 'నిజంగా రిపోర్టరే! పోలీసుకాదు'

అని నిర్ధారణకొచ్చి అతణ్ణి కాలరుపట్టుకుని లేవదీశాడు. అతడి జేబులు వెదికి అయిడెంటిటీకార్డు తీసి పేరూ, అతడు పనిచేస్తున్న పత్రిక, అడ్రసూ చూశాడు.

"దెబ్బలకి భయపడను - సరికదా కంఠంలో ప్రాణం వుండగా మీలాంటి చీడపురుగుల్ని వదలిపెట్టను. కారు నెంబరు నోట్ చేసుకున్నాను. అది చాలు రేపు మిమ్మల్ని పోలీస్‌స్టేషన్లో నిలబెట్టడానికి! అంచేత మర్యాదగా ఈ అమ్మాయిని ఒదిలిపెట్టి నాతో పంపించండి. నే చెప్పినట్టు విడిచిపెడితే నేనూ మిమ్మల్ని విడిచిపెడతాను. కాదని ఈమెమీద చెయ్యివేస్తే సహించను. తలుచుకుంటే ముఖ్య మంత్రికి స్వయంగా వెళ్ళి రిపోర్టివ్వగలను. అప్పుడు మిమ్మల్ని దేవుడుకూడా రక్షించలేడు. ఆలోచించుకోండి!" సుబ్రమణ్యం మొండిగా అన్నాడు.

కీచకులు ఒకరిమొహం ఒకరు చూసుకున్నారు! క్షణ కాలం నిశ్శబ్దం ఆవరించింది. కీచురాళ్ళు పండగ చేసు కుంటున్నట్టు అరుస్తున్నాయి.

ఆ నిశ్శబ్దాన్ని ఆసరాగా తీసుకుని మళ్ళీ అన్నాడు విలే ఖరి. "నా మాట విని ఈమెను వదిలెయ్యండి! ఏ రిపోర్టూ యివ్వను, ఎవరికీ చెప్పను. ఎవరిదారిన వాళ్ళు పోదాం!"

ఓ నిమిషం ఆలోచించి భూషణం అన్నాడు—"గండి పేట నించి వస్తున్నానన్నావు....ఇంతవరకూ ఏం చేశా వక్కడ? ఫోటోలేవన్నా తీశావా?"

"ఆ! చాలా తీశాను పార్టీ ఫంక్షన్‌లో"

"ఇంకా ఎన్ని ఫోటోలు మిగిలాయూ రీల్లో?"

"రెండున్నాయనుకుంటా"

విలేఖరి నుంచి కెమేరా తీసుకుని పరీక్షించాడు

భూషణం. అది లేటెస్ట్ ఫారెన్ మోడల్ కెమేరా కావడం చేత చాలా ఎడ్జెస్టుమెంట్లు వుండటంతో దాన్ని ఎలా ఆపరేట్ చెయ్యాలో బోధపడలేదు.

"సరే....నువ్వు చెప్పినట్టే దీన్ని విడిచిపెడతాం....కానీ ఒక షరతు: ముందు ఆ రెండు ఫోటోలూ లోడ్ చేసియ్యి" అన్నాడు భూషణం తెలివిగా.

ఈ పరిస్థితి ముందే ఊహించాడు విలేఖరి.

ఒక్కొక్క ఫోటో రిపోర్టరు లోడ్ చేసిచ్చాక నగ్నంగా ముడుచుకు కూర్చున్న ఆ యువతిని ప్లాష్ వెలుగులో రెండు ఫోటోలు తీశాడు భూషణం.

"ఆ రీలు తీసి ఇలాగియ్యి! తెల్లారేక నువ్వు కారు నెంబరు యిచ్చి పోలీసు రిపోర్టు ఇవ్వవని మాకు నమ్మకం ఏవిటి? అందుకే ఈ రెండు ఫోటోలూ తీసింది. పిచ్చి పిచ్చి వేషాలు వేసి రిపోర్టు యివ్వడంగానీ, పేపర్లో రాయడం గానీ చేస్తే గుడ్డలేకుండా ఉన్న దీని ఫోటోలు రెండూ బజారు గోడల కెక్కుతాయి. నీవల్ల అది బతికి పోయింది ఫో!" అన్నాడు భూషణం కిందపడ్డా నేనే గెల్చానన్నట్టు.

సంజీవ్ భూషణం తెలివితేటలు మెచ్చుకుంటూ భుజం తట్టేడు.

పార్టీ పంక్షనులో ముఖ్యమంత్రిని తీసిన ఫోటోలు అనేకం వున్నాయా రీల్లో. అవి రేపు పేపర్లో రావాలి. వీటి కోసం ఎడిటరు ఎదురు చూస్తూ వుంటాడీపాటికి. ఫోటో రీలు ఈ దుర్మార్గుల కిచ్చి వుట్టి చేతులతో ఆఫీసు కెళ్ళి ఏం చెప్పుకోవాలి తను?

విలేఖరి ఇవన్నీ ఆలోచించడం లేదు. అతడి కళ్ళె

దుట అన్యాయానికి గురి కాబోతున్న ఓ అబల! ఆమెను రక్షించాలి! అదే అతడి తక్షణ కర్తవ్యం!

రీలు కెమేరా నించి తీసి భూషణం చేతిలో పెట్టాడు సుబ్రమణ్యం.

పులి నోటికి ఆహారం కాబోతూ చివరి క్షణంలో ఇలా రక్షించబడతానని ఎంతమాత్రమూ ఊహించని ఆ అబల నేలమీద చెల్లాచెదురుగా పడివున్న తన బట్టల్ని హడావుడిగా, అస్తవ్యస్తంగా ఒంటికి చుట్టుకుని పట్టలేని ఆనందంతో విలేఖరి చెయ్యి గట్టిగా పట్టుకుని అతణ్ని అనుసరించింది.

ఇల్లు సమీపిస్తోంటే తన భయాన్ని బయట పెట్టింది.

"రేపు పోలీసు రిపోర్టేమీ యివ్వకండి. నే నెవర్నో ఎక్కడుంటానో వాళ్ళకి తెలియకపోయినా ఆ ఫోటోలు బయట పెడితే నేనింక తలెత్తుకు తిరగలేను! ఆత్మ హత్య చేసుకోవాలంతే!"

సుబ్రమణ్యం మెల్లగా నవ్వేడు.

"నీకా భయమేమీ అక్కర్లేదమ్మా! అసలా రీల్లో ఫోటోలంటూ మిగిలుంటే కదా నీ ఫోటోలు రావడానికి! ఊరికే ఫ్లాష్ ఎరేంజ్ చేసిచ్చాను. ఫూల్స్ తేలుసుకోలేక పోయారు!" అన్నాడు తాపీగా.

ఆమె కళ్లు అశ్రుపూరితాలయ్యాయి. ఆనందం పట్ట లేక తనపాలిటి భగవంతుడయి వచ్చిన ఆ విలేఖరి కాళ్ళ మీద పడి ఏడ్చింది కృతజ్ఞత ఎలా చెప్పుకోవాలో తెలియక.

ఆమెను ఇంటివద్ద దిగ విడిచి తేలికపడ్డ మనసుతో ఆఫీసు వయిపు సాగిపోయాడు విలేఖరి.

మర్నాడు ఫోటోలు కడిగించిన భూషణం ఖంగు తిన్నాడు. ఆ రీల్లో అన్నీ గండిపేట ఫోటోలే.

సంజీవ్‌ని కలిసి తాము ఫూల్స్ అయిన సంగతి చెప్పేడు భూషణం. తమని పరాభవం చేసి, రసభంగం చేసిన విలేఖర్ని వదలిపెట్టకూడదని నిర్ణయించుకుని అతడు ఆఫీసునించి ఏ సమయానికి బయటి కొస్తాడో రెండు రాత్రుళ్ళు గమనించేరు.

మూడో రోజు ఆఫీసునించి బయటి కొస్తున్న రిపోర్టర్ని నోరు నొక్కి బలవంతంగా కారులో పడేసి తీసికెళ్ళి సయికిల్ చైన్‌తో ఇష్టం వచ్చినట్టు కొట్టారు. ఫలితం అతడి దుర్మరణం!

దుష్టత్రయానికి సంకెళ్ళు తగిలించేడు ఇన్‌స్పెక్టర్ శతభిషం! ఇన్‌స్పెక్టర్‌తోబాటు డిటెక్టివ్‌లకి రాష్ట్రం నలు మూలలనించీ అభినందనల పరంపరలు!! □

లాకప్ పిశాచాలు!



"హల్లో, వాసు అండ్ శేష డిటెక్టివ్ ఏజెన్సీ, ఎవరండీ మీరు?" అడిగాడు శేష.

"డార్లింగ్, ఐ లవ్ యూ!" మత్తుగా వినిపించింది ఓ కోమలి కంఠం అవతల్నుంచి.

శేష విస్తుపోయి రిసీవర్ వంక ఓసారి భయంగా చూసి మళ్ళీ చెవిదగ్గర పెట్టుకుని "హల్లో, దిసీజ్ డిటెక్టివ్ ఏజెన్సీ మేడమ్!" అన్నాడు.

"డార్లింగ్, ఎప్పుడొస్తున్నావు? నీకోసం ఎదురుచూస్తు

ఉంటాను పబ్లిక్ గార్డెన్సులో."

"హూఁ! చూడమ్మా, మీరెవరోగాని ఇది డిటెక్టివ్ ఆఫీసు. రాంగ్ నంబరయి వుంటుంది. ఫోన్ పెట్టేసి మళ్ళీ ట్రైచెయ్యండి" అంటూ టక్కున ఫోన్ పెట్టేశాడు శేషు.

ఓ నిమిషమైనా కాలేదు. మళ్ళీ ఫోన్ రింగయింది.

"హల్లో, ఎవరు మాట్లాడేది?" భయంగానే అడిగాడు శేషు.

"డార్లింగ్, ఏమీ చెప్పకుండా ఫోన్ పెట్టేశావేమిటి! సాయంత్రం గార్డెన్స్ కొస్తున్నావా?"

"మళ్ళీ అదే మాటా? రాంగ్ నంబర్ తల్లీ, ఫోన్ పెట్టెయ్యి" ట్రంక్ టెలిఫోన్‌లో మాట్లాడినంత వాల్యూములో చెప్పాడు శేషు.

"డార్లింగ్, ఐ లవ్ యూ!"

నీ లవ్వు పాడుగాను, చంపేస్తున్నావు అనుకుంటూ, "ఫోన్ పెట్టెయ్యమ్మా" అంటూ రిసీవర్ క్రెడిల్ చేశాడు శేషు విసుగ్గా.

ఈసారి అరనిమిషంలో మళ్ళీ రింగయింది ఫోన్.

చాలా కోపంగా ఎత్తాడు శేషు.

"డార్లింగ్... ఐ లవ్‌యూ సోమచ్! మై స్వీట్ హార్ట్, ఇదిగో అడ్వాన్స్‌గా ఓ ముద్దు" శేషు చెవిలో చాలా గాఢంగా వినిపించింది "ప్చ్".

హతవిధీ, ఫోన్‌లోనే ముద్దులు పెట్టేస్తోంది. ఆ అర్భకుడు ఎదురుగా వుంటే వాడ్ని నలిపి నల్లేరు పెట్టేస్తుందేమో!

"డార్లింగ్, సాయంత్రం వస్తున్నట్టే కదూ! నీ కోసం

ఎదురు చూస్తుంటాను."

శేషుకి విపరీతమైన ఆగ్రహావేశాలు తన్నుకుంటూ వచ్చేశాయి. అయితే వాటి నడుమలో పెట్టుకుని ఆ అమ్మాయిని ఓ పట్టుపట్టాలనే చిలిపి ఊహ వచ్చింది.

"హాయ్ స్వీటీ. ఎన్నిగంటలకు రమ్మంటావు" అనడిగాడు మృదువుగా.

"దొంగా, ఇంతసేపూ రాంగ్‌నంబరని నన్ను మభ్య పెట్టాలని చూశావుకదూ! నాకు తెలుసు! నా చెవులు నన్ను మోసం చెయ్యవు."

"నీ మొహం, ఇలా అయితే నిన్నెవడో మోసంచేసి వదిలెయ్యటం ఖాయం!" లోపల అనుకోబోయి పైకే అనేశాడు శేషు.

"ఆఁ ...ఏమిటి, నువ్వనేది?" ఆమె గొంతులో కంగారు, ఆశ్చర్యం జమిలిగా పలికాయి.

"ఆ, ఏం లేదు డార్లింగ్. నీ ప్రేమ చాలా స్ట్రాంగ్ అయిన కాఫీలాంటిది. ఇంతకీ టైం చెప్పావుకాదు....!"

"మామూలుగా మనం కల్సుకునే టైమే! నీతో చాలా సంగతులు చెప్పాలి. మనిద్దరి ప్రేమగురించి మా యింట్లో తెలిసిపోయింది. నామీద ఆంక్షలు ఎక్కువైపోయాయి. త్వరలోనే మన పెళ్ళి విషయం సెటిల్ చేసుకుంటే బావుంటుంది."

"కాని మా ఇంట్లో ఒప్పుకోవటంలేదు."

"ఆఁ! ఒప్పుకోవటంలేదా? నిన్ననేగదా, మీవాళ్ళు మన పెళ్ళికి సుముఖంగా వున్నారని చెప్పావ్...."

"మరచిపోయాను రమా...."

"రమా? అదెవరు?"

"సారీ....లలితా!"

"లలితా?"

"ఊఁ, ఉహూ, నిర్మలా...."

"ఇదెవ_త్తి?"

"ఛ. ఛ....క్షమించు విజ్జీ...."

"మళ్ళీ ఇంకొక_త్తె?!"

"ఉష్, వెధవ మతిమరుపు. ఏమనుకోకు లావణ్యా!"

"నీకు నిజంగానే మతిపోయింది."

"వెరీవెరీ సారీ శ్యామలా!"

"ఏమిటి మనోహర్, యీ ప్రేలాపన?"

"ఎక్స్‌క్యూజ్‌మీ రాణీ డాళింగ్!"

"నా పేరుకూడా మర్చిపోయావన్న మాట! చూడు మహాశయా, నేను దీపను మాటాడ్తుంట."

"దీపా డాళింగ్, నువ్వా? ఎవరో అనుకున్నాను."

"అంటే....నేనుకాక, నువ్వు పైన చెప్పిన లిస్టులోని అమ్మాయి లందరితోనూ నీకు పరిచయాలున్నాయన్న మాట....!?"

"ఆ....అమ్మబాబోయ్....అదంతా ఉత్తదే! వాళ్ళెవరో నాకు తెలీదు"

"నేనంత అమాయకురాలనుకున్నావా? ఖచ్చితంగా నీకు ఆ లలిత, నిర్మల, శైలజ, విజ్జి, బుజ్జి—వీళ్ళందరి తోనూ చాలా గాఢమైన పరిచయాలే వున్నాయి. నాతో ప్రేమాయణం సాగిస్తున్నట్టే వాళ్ళతోను సాగిస్తున్నావని నాకర్థమైపోయింది. నీ మొహం ఈ జన్మలో చూడను. నీ కసలు పొరపాటునకూడా ఫోన్ చెయ్యను. నువ్వు కూడా నాకు ఫోన్ చెయ్యాలనిగాని, నన్ను కలవాలనిగాని ప్రయత్నించవద్దు. నిన్ను నే నీ జన్మకి క్షమించలేను గుడ్‌బై

ఫరెవర్!" టపీమని రిసీవర్ క్రెడిల్ చేసిన శబ్దం శేషు కర్ణభేరిని బద్దలు చేసేసింది.

"హబ్బా!" అని చెవి గట్టిగా మూసుకుని ఫోన్ పెట్టేశాడు.

'పీడాపోయింది, నువ్వింక నా ఫోన్ ఖరాబుచెయ్యక పోవటమే నా క్కావాలి!' అనుకుంటూ "పాపం, మనోహర్! ఐ పిటీయూ బ్రదర్, నీ ప్రేమ ఫెయిలపోయినందుకు చాలా విచారిస్తున్నాను. మై హార్ట్‌ఫెల్ట్ కండొలెన్సెస్ టు యూ!' అనుకున్నాడు ఆనందంగా.

"రాంగ్ నంబరని మర్యాదగా చెప్పినా వినకుండా నన్ను రెస్ట్‌లెస్‌గా ఏడాపెడా వాయించేసినందుకు నీ కీ శిక్ష పడాల్సిందే డీపాడాళింగ్!" అనుకుని నాలిక గట్టిగా కరిచేసుకున్నాడు శేషు.

"ఏమిటి, నేనుకూడా ప్రేయసిని పిలిచినట్టు డాళింగ్ అనేస్తున్నాను. హతోస్మి!" అనుకుంటూ మనసులోనే లెంపలు వేసుకున్నాడు.

సరిగ్గా అప్పుడే వాసు ఆఫీలో అడుగుపెట్టాడు.

గోడ గడియారం ఒకేగంట కొట్టింది. అప్రయత్నంగా గడియారం వైపు చూశాడు శేషు.

ఒంటిగంటన్నర! "గురువు, ఇలాంటి విషయాల్లో గొప్ప 'పంక్చువల్'"— అనుకున్నాడు.

శేషుని చూసి చిర్నవ్వు నవ్వి "వెళ్ళి భోంచేసి రా శేషూ!" అన్నాడు వాసు.

శేషు బదులుగా నవ్వి లేచాడు సీట్లోంచి.

2

"చెప్పండి!" కుర్చీలో ముందుకు వాలి అన్నాడు వాసు, ఎదురుగా కూర్చున్న పెద్దమనిషితో.

"నా కూతురు ఓ ప్రబుద్ధుడి ప్రేమిలో పడి, వాడే సర్వస్వమనుకుంటోంది. ఎలాగైనా ఆమె మనసు మార్చి వాడ్ని మర్చిపోయేలా చెయ్యాలి" అన్నాడాయన సూటిగా.

వాసు విస్మయంగా చూశాడాయనవంక. "ఇలాంటి విషయాల్లో డిటెక్టివ్‌లు చెయ్యగలదేమీ వుండదు. మీరు స్వయంగా పరిష్కరించుకోవలసిన సమస్య ఇది. మీ అమ్మాయి మీ మాట వింటుందా? బయటివాళ్ళ మాటకు కట్టుబడ్తుందా? ప్లీజ్, ఆమెకి మీరే నచ్చచెప్పండి" అన్నాడు.

"అదంతా అయిపోయిందండి. అమ్మాయి నా మాట వినే స్థితిలో లేదు. పూర్తిగా వాడిప్రలోభంలో, వాడి ప్రభావంలో పడిపోయింది. ఎవర్నీ ఖాతరుచేసే స్థితిలో లేదు."

"కాని యిందులో మేము చెయ్యగలిగే దేమీ వుండదు."

"లేకపోవట మేమిటి? తప్పకుండా ఇది మీ వల్లనే అవుంది."

వాసు ప్రశ్నార్థకంగా చూశాడాయనవంక.

"అవును సార్, మీరు చెయ్యవలసిందల్లా అమ్మాయి ప్రేమించినవాడు ఉత్త లోఫర్ అని, మోసగాడని, గతంలో చాలామంది అమ్మాయిలతో చాలారకాల సంబంధాలు పెట్టుకున్నాడని అమ్మాయిని నమ్మించాలి. అందు కవసరమైన సాక్ష్యాలు సృష్టించాలి మీరు."

"సారీ, మీరెవరైనా మంచి లాయర్ని సంప్రదిస్తే బావుంటుం దీ విషయంలో."

"అలా కొట్టిపారెయ్యకండి. లాయర్‌కన్నా డిటెక్టివే

యీ విషయంలో సరైన వ్యక్తి. అందుకే మిమ్మల్ని కలుసుకున్నాను ”

“చూడండి....”

“నా పేరు సోమసుందరం” చెప్పాడాయన.

“చూడండి సోమసుందరంగారూ. మీకు నేనిచ్చే సిన్సియర్ సలహా ఏమిటంటే, మీ అమ్మాయి నిజంగా మనస్ఫూర్తిగా ఆ అబ్బాయిని జీవిత భాగస్వామిగా కోరుకుంటుంటే అడ్డుచెప్పకండి. వాళ్ళిద్దరికీ దగ్గిరుండి పెళ్ళి జరిపించండి. అమ్మాయి సుఖంకన్నా మీరు కోరుకునేదేముంటుంది?”

“కాని, ఆ అబ్బాయికి ఉద్యోగం, సదుద్యోగం లేదండీ. తండ్రి కూడా సామాన్య గుమాస్తా. అతని తర్వాత నలుగురు పెళ్ళికావలసిన ఆడపిల్లలున్నారు. అలాంటివాడ్ని చేసుకుని అమ్మాయి యేం సుఖపడుతుంది చెప్పండి....”

“పోనీ మీరు సంపన్నులే కదా....!” ఆయన ధరించిన ఖరీదైన పెద్దాపురం సిల్కు లాల్చీవంక చూస్తూ అన్నాడు వాసు.

“అఫ్‌కోర్స్....కాని, నాది కూడా పెద్ద సంసారం. నాక్కూడా ముగ్గురు పెళ్ళికావలసిన అమ్మాయిలున్నారు, ఈ పాపతో కలిపి. పైగా నా కూతురు ఆత్మాభిమాని. తన సంసారం సుఖమయం చేసుకోవటానికి నా నుంచి ఏమీ ఆశించదు.”

“అదీ మంచిదేననుకోండి. అబ్బాయి బుద్ధింతుడయి గుణవంతుడయివుంటే ఏమీ ఆలోచించకుండా అతనితో అమ్మాయి పెళ్ళి జరిపించండి. తను కోరుకున్న మగాడితో జీవితం ఆడదానికి స్వర్గంకన్నా ఎక్కువ. మీ అమ్మాయి సుఖపడ్తుంది.”

"సుఖం?....అది జరిగే పనికాదు. లెండి....మీరు ఈ కేసు తప్పక టేకప్ చేస్తారని ఎంతో నమ్మకంతో వచ్చాను. నన్ను నిరాశపరిచారు."

"సారీ, ప్రేమించిన రెండు హృదయాల్ని విడదీయ బోవటం చాలా పాపం సార్? నేనా పాపాన్ని మూట కట్టుకోలేను సోమసుందరంగారూ!" చెప్పాడు వాసు.

సోమసుందరం కుర్చీలోంచి లేచాడు

"ఇంతకీ అమ్మాయి పేరేమిటన్నారు?" అడిగాడు వాసు.

సోమసుందరం ముఖంలో ఆశారేఖ తొంగి చూసింది. "దీప" అన్నాడు.

"మంచి పేరు. వెళ్ళిరండి సార్?" అన్నాడు వాసు తాపీగా.

సోమసుందరం ముఖం చిన్నబోయింది. ఏమీ చెప్ప కుండానే వెళ్ళిపోయాడు

3

"నా పేరు కన్నదాసు. సిటీలోని రెండు పెద్ద ఫర్మ్ లలో అర్ధరూపాయ వాటాలున్నాయి. రెండు సిటీబస్సుల్లో అరవై పైసల వాటాలున్నాయి. రెండు బట్టలషాపుల్లో ముప్పావలా వాటాలున్నాయి. రెండు అద్దె ఇళ్ళు స్వంతా నికి వున్నాయి."

వాసు తలూపాడు. ఎదురుగా కూచున్న భారీ విగ్ర హాన్ని కన్నార్పకుండా చూశాడు. చాలా ఖరీదైన వ్యక్తి అని చూడగానే తెలిసిపోతోంది. అతని చేతి పదివేళ్ళకి పది ఉంగరాలున్నాయి. కాళ్ళ వేళ్ళకి యెందుకు ధరించ లేదో మరి—అనుకున్నాడు వాసు.

"ఇంతకీ మీ క్కావలసిన పనేమిటో చెప్పారుకాదు"

అన్నాడు వాసు.

కన్నదాసు ఖరీదైన నవ్వు నవ్వాడు. అలా నవ్వినపుడు అతని లావుపాటి బుగ్గలు మరింత విశాలంగా పొంగాయి. కోరమీసాన్ని ఉంగరాల చేత్తో సవరించుకున్నాడు

"సోమసుందరం అనబడే పారిశ్రామికవేత్త కూతుర్ని నా కొడుక్కు చేసుకోవాలనుకొంటున్నాను" కన్నదాసు ఓ క్షణం ఆగాడు.

వాసు ఉలిక్కిపడి చూశాడు....యింత క్రితమే వచ్చి వెళ్ళిన సోమసుందరం గురించేనా యితను చెప్పేది?

"ఆయన కుమార్తె పేరేమి టన్నారు? ..." అనడిగాడు.

"ఏమీ అనలేదే:........ఆ పిల్ల పేరు దీప. చిదిపి దీపం పెట్టుకోవచ్చు. చక్కని చుక్క........కాని యేం లాభం? ఆ పిల్ల ఎవడో అణా కాణీగాడితో ప్రేమో ఏదో అంటారే, అందులో పడింది."

వాసు తలూపాడు.

"ఆ అణాకాణీగాడి పేరు మనోహర్. ఓ సాదాసీదా గుమాస్తాగాడి కొడుకు. వాడ్ని శాశ్వతంగా యీ లోకం నుంచి తప్పించెయ్యటం నాకు ఓ లెక్కలేది కాదు. కాని, అలా చెయ్యటంవల్ల ఆ పిల్ల మనసు నా కొడుకు వేపు మళ్ళించలేను. ఆ కుర్రాడిపట్ల ఆమెకు అసహ్యం పుట్టి వాడ్ని దూరంగా తనే నెట్టివేసేలా చెయ్యగలిగిన వాడు ఆ పిల్లని మా వాడివయిపు సునాయాసంగా తిప్పుకోగలను. అందుకు మీ సహాయం కావాలి."

వాసు తల అడ్డంగా తిప్పి, "సారీ, ఇలాంటి

కేసులు మేం టేకప్ చెయ్యం" అనేశాడు ఖచ్చితంగా.

కన్నదాసు చిద్విలాసంగా నవ్వాడు.

"మీరు గతంలో ఇలాంటి కేసులు టేకప్ చేశారని, పరిశోధించి విజయం సాధించారని నాకు తెలుసు."

"వాటికీ దీనికీ తేడా వుంది. ఓ పెద్దమనిషి తన కూతురుకి వరుడ్ని కుదుర్చుకోబోయే ముందు వరుడి గుణగణాలను గురించి ఇన్ఫర్మేషన్ కావాలని కోరితే పరిశోధించి వివరాలు అందచేశాం. అలాగే వధువు గురించి మరో పార్టీ ఆరా తియ్యమంటే అది కూడా ఇన్వెస్టిగేట్ చేసి నిజానిజాలు తెలియజేశాం. కాని ఇది అలాంటి కేసు కాదు. ఓ కన్నెపిల్ల మనసారా ప్రేమించిన అబ్బాయిని ఆమె నుంచి బలవంతంగా కృత్రిమోపాయాలతో దూరం చెయ్యటం అన్యాయం, పాపం. తను ప్రేమించిన వ్యక్తి ఎంత పేదవాడయినా ఆమెకు కోటీశ్వరుడి కన్న ఎక్కువే! ఒన్స్ ఎగెయిన్ సారీ...." చెప్పాడు వాసు.

"చూడండి డిటెక్టివ్‌గారూ! నేను శాసించిన పనులు చేయించుకోవడమేగాని ఎవర్నీ ప్రాధేయపడను. నేను తిరస్కరించటమే ఎరుగుదును గాని తిరస్కరింపబడటం ఎరగను. నేను చెప్పేది పూర్తిగా వినకుండా కాదనేస్తారేమిటి? సలహా కూడా నేనే చెప్తానన్నానుగా!" కన్నదాసు గొంతులో చిరాకు ధ్వనించింది.

"మీరు చెప్పే సలహా నాకు తెలుసు. ఆ కుర్రాడు తిరుగుబోతుగానో, తాగుబోతుగానో, దొంగగానో, హంతకుడుగానో, జూదరిగానో చిత్రించి ఆ పిల్ల మనసు విరిచెయ్యాలి. అందుక్కావల్సిన పరిస్థితుల్ని మీరు సృష్టించమంటారు. అలాంటి హేయమైన అవస్థలో అతను ఆ పిల్ల కంటపడే ఏర్పాటు మేం చెయ్యాలి. ప్రత్యక్షంగా

చూశాక, ఆమె మనసు విరిగిపోయి, అతన్ని ద్వేషించి దూరమైపోతుంది.

అప్పుడు మీ అబ్బాయి గురించి ఆమె తండ్రి దగ్గర ప్రస్తావిస్తారు. ప్రేమించి మోసపోయాననే దిగులుతో అతని మీది ద్వేషంతో కసితో ఆ అమ్మాయి ఎవరినైనా సరే పెళ్ళాడటానికి సిద్ధపడిపోతుంది. ఆ ఎవరో మీ అబ్బాయే అయ్యేలా అటునుంచి నరుక్కుని వస్తారు— అంతేనా?" గడగడ అప్పచెప్పినట్టు చెప్పేశాడు వాసు.

"పూర్తిగా అదే కాకపోయినా, కొంతవరకు అలాగే నడుస్తుంది కథ....ఇంకా ఆ పిల్ల మనసు మార్చుకోకపోతే తప్పుడు కేసేదో బనాయించి ఆ మనోహరుడ్ని శ్రీకృష్ణ జన్మస్థానానికి పంపించే ఏర్పాట్లు నే జూసుకుంటాను...." కన్నదాసు కోరమీసంమీద ఉంగరాలవేళ్లు మళ్ళీ వర్తించాయి.

"దయచేసి ఈ విషయంలో నన్ను బలవంతం చెయ్యకండి కన్నదాసుగారూ:...."

"ఒక్కమాట...."

"ఈ కేసు విషయమే అయితే నేనిక మాట్లాడవలసిందేమీ లేదు. మరో విషయమైనా అయితే చెప్పండి, న్యాయబద్ధమైన దేదైనా సరే, టేకప్ చెయ్యటానికి సిద్ధంగా వున్నాను...."

వాసు మాటలు పూర్తి కాకుండానే కన్నదాసు కోపంగా లేచి నిల్చున్నాడు.

"సిటీలో సీలా బోర్డు కట్టుకున్న వాళ్ళింకా ఇద్దరు ముగ్గురున్నారు. నగరం గొడ్డుపోలేదు. చివరిసారిగా అడుగుతున్నాను. మీకు కావలసినంత ఫీజుకూడా ముట్టచెపుతాను." జేబునించి వందరూపాయిలనోట్ల కట్ట పైకి

తీశాడు కన్నదాసు.

"చూడండి సార్ ....డబ్బుకోసం ప్రిన్సిపుల్స్ బలిపెట్టే మనిషిని కాదు నేను. నా అసిస్టెంటు శేషకూడా నా అడుగు జాడల్లోనే నడిచే వ్యక్తి. అతనిప్పు డిక్కడుంటే మీ మాటలకి చాలా ఆవేశపడిపోయుండేవాడు...."

వాసు మాటలు పూర్తి కాకుండానే కన్నదాసు 'ఛాత్' అంటూ నేలని కాలితో బలంగా తన్ని చరచర బయటకు వెళ్ళిపోయాడు.

సరిగ్గా అప్పుడే శేష ఆఫీసు గదిలోకి అడుగుపెట్టాడు.

4

"ఎవరో ఖరీదైన పార్టీలా వున్నాడు. ఏమిటి గిరాకీ?" అన్నాడు శేష వాసు వైపు ప్రశ్నార్థకగా చూస్తూ.

"పార్టీ ఖరీదైనదే! కాని బుద్ధి బురదగుంట స్టేజిలోనే వుంది. ప్రేమికుల జంటను విడదియ్యమని కోరటానికి వచ్చాడు. కుదర్దు పొమ్మన్నాను."

"బాగా చెప్పావు గురూ! అయినా ప్రేమికుల్ని విడదీసే హక్కెవరికీ లేదు. ఆఖరికా సృష్టికర్తకి కూడా."

వాసు ఆశ్చర్యంగా చూశాడు! "ఇదివరలో పెళ్ళికి ముందు ప్రేమించుకునే వాళ్ళని చూస్తే మండిపడిపోయే వాడివి. యథాశక్తి వాళ్ళని తిట్టుండేవాడివి. ఈ రోజేమిటి. వాళ్ళని సపోర్టు చేస్తున్నావు!?" అన్నాడు.

శేష చిద్విలాసంగా నవ్వి, "ఇందాకా నువ్వొచ్చే ముందో ప్రేమజంటను శాశ్వతంగా విడదీసేశాను ఫోన్ ద్వారా" అన్నాడు.

"విడదియ్యటమేమిటి? ఆ జంటెవరో నీకు తెలుసా?"

"తెలీదు. ఫోన్‌లో 'డార్లింగ్ అయ్ లవ్ యూ....!' అంటూ వూదరగొట్టేస్తూందా అమ్మాయి. ఫోన్ పెట్టేస్తే

మళ్ళీ రింగ్ చేసింది. పిచ్చెత్తిపోయిందనుకో. ఈసారి ఫోన్ పెట్టెయ్యకుండా నా శాయశక్తులా ఆ అమ్మాయికి తన ప్రియుడిమీద తిరుగులేని అనుమానాన్ని రేకెత్తించాను. అంతే, మళ్ళీ ఫోన్ చెయ్యలేదామె. బతికిపోయాను" అన్నాడు శేషు.

"సరే, ఆ సంగతి వదిలెయ్యి. ఈ ఖరీదైన కేసుకి ముందు మరో కేసొచ్చింది. అదీ ఇలాంటిదే! సోమసుందరం అనబడే పెద్దమనిషి తన కూతురు దీప మనోహర్ అనబడే ఓ గుమస్తా కొడుకుతో ప్రేమలో పడిందని, ఆమె నతని ప్రభావం నించి దూరం చెయ్యమని...."

వాసింకా చెప్తుండగానే, "ఏమిటి, దీప అనబడే అమ్మాయా? ఆమె ప్రియుడి పేరు మనోహరా?.... ఆగాగు.... కేసు కాంప్లికేటెడ్ అయిపోయింది....దీప అనబడే అమ్మాయే నాకు ఫోన్‌లో ప్రేమపాఠాలు వల్లించిన అమ్మాయి అసలు కథేమిటి, ఇప్పుడు చెప్పు" అన్నాడు శేషు.

వాసు చెప్పాడు.

శేషు నాలిక్కరచుకుని, "కేసు ఒప్పేసుకోవలసింది! ఇక ఎప్పటికీ ఆ పిల్ల ఆ మనోహర్ ముఖం చూడకుండా చెయ్యటమే కదా, ఆమె తండ్రి కోరింది! ఆ పనేదో నేను కేసు ఒప్పుకోకముందే చేసేశాను. ఆమె యీ జన్మలో మళ్ళీ మనోహర్ ముఖం చూడదు....మనం ఏమాత్రం శ్రమ పడకుండానే ఫీజు దక్కివుండేది...." అన్నాడు దిగులుగా.

"ఇంతకీ ఏం చెప్పావామెతో?" వాసు అనుమానంగా అడిగాడు.

శేషు ఫోన్‌కాల్ గురించి చెప్పాడు.

వాసు ముఖంలో బాధ స్పష్టంగా కనిపించింది. "చాలా పాపం చేశావు. అంతస్తుల్ని ఆస్తిపాస్తుల్ని లెక్కచెయ్యకుండా నిర్మలంగా గాఢంగా ప్రేమించుకున్న జంటను చేతులారా విడదీసేశావు. నా ప్రియశిష్యుడికి పాపం అంటకూడదు. దానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. అందుకిప్పుడే బయల్దేర్తున్నాను" అన్నాడు లేస్తూ.

"ఆగాగు. ఎక్కడికి గురూ, ఆ పరుగు? నాకు చెప్పగూడదా ఏం?"

"ఇంకెక్కడికి? ఆ దీపదగ్గరకి. ఆమె ప్రియుడు చాలా మంచివాడని, ఎలాంటి దురలవాట్లు లేనివాడని, యధేచ్ఛగా ప్రేమించుకోమనీ చెప్పివస్తాను—ఓ పక్క ఆమె తండ్రి, మరోపక్క కన్నదాసు—ఆమె ప్రియుడ్ని ఆమె నుంచి దూరం చేయటానికి పొంచి కూచున్నారనీ తెలియజేసి వస్తాను."

శేషు నిట్టూర్చి, "పద గురూ. నేనూ వస్తాను. ఆ ఫోన్‌లో అవాకులు చవాకులు వాగింది నేనేనని చెప్తాను. నా గొంతు వింటే గుర్తుపడ్తుంది. తప్పక నమ్మకం కుదుర్తుంది." అన్నాడు.

"ముందుగానే సోమసుందరంగారి అడ్రసు నోట్ చెయ్యటం మంచిదయింది. చూశావా? కేసు వివరాలు రాసుకోవటం మన అలవాటు కదా!...." అన్నాడు వాసు నోట్‌బుక్‌లో రాసిన చిరునామా వేరే కాగితంమీద రాసుకుంటూ.

ఇద్దరూ ఆటోలో చిక్కడపల్లి వెళ్ళారు. సోమసుందరం యిల్లు అశోక్‌నగర్‌లో వుంది. తేలిగ్గానే దొరికింది.

అయితే సమయానికి దీప ఇంట్లో దొరకలేదు. ఎక్కడికో వెళ్ళిందని మాత్రం ఆమె ఇంట్లోవాళ్ళు చెప్పారు. సమయానికి సోమసుందరం లేకపోవటం మంచిదే అయిందనుకున్నాడు శేషు.

"బహుశా పబ్లిక్‌గార్డన్స్‌కి వెళ్ళిందేమో!" అన్నాడు శేషు—దీప ఉదయం ఫోన్‌లో చెప్పిన సంకేత స్థలం గుర్తు తెచ్చుకుని.

"ఆమె వచ్చేవరకు సెంట్రల్ లైబ్రరీలో కాసేపు గడిపి, మళ్ళీ ఓసారి వచ్చిచూద్దాం. అటు ఇటు వూరికే వెతుకులాడటం ఆటో ఖర్చులు దండగ....అదీగాక మనోహర్‌మీద కోపంగా వున్న అమ్మాయి మళ్ళీ అతన్ని వెతుక్కుంటూ పబ్లిక్ గార్డెన్‌కి కెందుకు వెళ్తుంది?" అన్నాడు వాసు.

"ఏం చెప్పగలం గురూ, ప్రేమ గుడ్డిదంటారు కదా!"

"నో, నో. నైన్‌టీనైన్ పర్సెంట్ ఆమె మనోహర్ని కల్సుకోదు. బహుశా ఎప్పటికీ కూడా! పద, లైబ్రరీలో కూచుందాం" సెంట్రల్ లైబ్రరీవైపు అడుగులువేశాడు వాసు. శేషు అనుసరించాడు.

అయితే అదే సమయానికి దీప యాదృచ్ఛికంగా తమ ఆఫీసుకి వెళ్ళిందనీ, ఆఫీసు మూసి వుండటం చూసి మళ్ళీ వెనుతిరిగిపోయిందనీ ఆ డిటెక్టివ్‌లకి తెలియదు.

అయితే వాళ్ళ ఊహకి కూడా అందని మరో విచిత్రం ఆ రాత్రే జరిగింది.

రాత్రి ఏడున్నర గంటలవరకు లైబ్రరీలో గడిపి, అప్పటికీ దీప రాలేదని తెలుసుకుని నిరాశపడి యిద్దరూ తమ ఆఫీసుకు తిరిగివచ్చారు. అప్పుడు పక్కనున్న

సిమెంటు స్టాకిస్టు చెప్పాడు—ఇద్దరు కస్టమర్లు వచ్చి వెళ్లారని, ఇద్దర్లో ఒకరు అమ్మాయనీ!

డిటెక్టివ్‌లకి అది పజిలయింది.

"అనవసరంగా నువ్వు కూడా నా వెంట బయల్దేరావు. రెండు కేసులు పోయాయి...." అన్నాడు వాసు నిష్ఠూరంగా.

"ఏం చేద్దాం? నిజంగా మనమే కావాలనుకుంటే ఆ కేసులు మళ్ళీ ఇప్పుడో, రేపో తప్పకుండా వస్తాయి లేదూ, మనకి ప్రాప్తం లేదనుకుందాం."

"ఆ అమ్మాయి దీప కాదుగదా—!?" సాలోచనగా అన్నాడు వాసు.

"దీపా?—ఆమెందుకొస్తుంది. నీ పిచ్చిగాని! మనతో ఆమెకేం పని?"

"ఏమో....మనోహర్ గురించి ఆమెలో విషబీజం నాటావుకదా! ఎలాగూ ప్రేమించిన హృదయం అంత త్వరగా మారిపోతుందా? అతని గురించి రహస్యంగా వివరాలు సేకరించటానికి మన సాయం కోరటానికి వచ్చిందేమో!?"

"అదే నిజమైతే ఆమె రేపు మళ్ళీ వస్తుంది. అప్పుడు కేసు టేకప్ చేసేసి ఆ తర్వాత ఇరవై నాలుగ్గంటల్లోనే అతను నూటికి నూరు శాతం కల్తీలేని వీర ప్రేమికుడని సర్టిఫికెటిచ్చేద్దాం ఫైండింగ్స్‌తోబాటు...."

అతని మాటలింకా పూర్తి కానేలేదు. ఓ ఫియట్ కారొచ్చి ఆఫీసు ముందాగింది. అందులో నుంచి ఓ అందమైన యువతి కిందికి దిగింది.

సిమెంటు స్టాకిస్టు కళ్ళతోనే డిటెక్టివ్‌లకి సైగ చేశాడు—ఇందాకా వచ్చి వెళ్ళిన అమ్మాయి ఆమేనని.

డిటెక్టివ్ లిద్దరు సర్దుకుని కూచున్నారు.

అప్పుడు సమయం ఎనిమిది గంటలయింది.

ఆమె సరాసరి వారి ఆఫీసులోకే వచ్చింది.

"రండి, కూచోండి" ఆహ్వానించాడు వాసు.

ఆమె కూచుంటూనే అలసటగా వాళ్ళిద్దరి వైపు చూసింది.

ఆమె వయసు ఇరవైలోపే వుంటుంది. చాలా అందమైనదేగాక, చాలా ఖరీదైనదని కూడా చూడగానే తెలిసిపోతోంది.

"నా పేరు దీప" చెప్పిందామె.

ఇద్దరికీ గుండె ఓ క్షణం ఆగి కొట్టుకుంది.

వాసు భావయుక్తంగా చూశాడు శేషు వంక.

"నేనో అబ్బాయిని ప్రేమించాను. అతని గురించి కొన్ని అనుమానాస్పదమైన విషయాలు తెలిశాయి. అవి నిజమో కాదో మీరు ఆచూకీ తియ్యాలి" అన్నదామె సూటిగా.

శేషుకి చాలా ఆనందంగా ఉంది. వుదయం కాకతాళీయంగా తను అట పట్టించటానికి చెప్పిన అబద్ధం నిజమేనని నమ్మేసిందీమె. అనుకోకుండా తమ దగ్గరకే వచ్చింది. అయాచితంగా ఓ మంచి కేసు దొరికింది. మనోహర్ గురించి ప్రత్యేకంగా పరిశోధించాల్సిన పని కూడా లేదు. రేపీపాటికి కేసు ముగించి ఫైలు మూసెయ్యవచ్చు.

"మీ వివరాలు, ఆ అబ్బాయి వివరాలు చెప్పండి" అన్నాడు వాసు.

శేషు నోట్ బుక్ తెచ్చి సిద్ధంగా వుంచాడు.

ఆమె చెప్పింది. మనోహర్ ఇంటి అడ్రసు, అతని గురించిన వివరాలు చెప్పి, ఓ పాస్‌పోర్టు సయిజు ఫోటో

కూడా ఇచ్చింది.

దాంతోబాటు ఓ వెయ్యి రూపాయలు అడ్వాన్స్ కూడా ఇచ్చింది. "పని పూర్తయ్యాక మీ ఫీజు మొత్తం ఎంతో చెపితే చెల్లిస్తాను" అన్నది.

"దాందేముందండీ, అలాగే చెల్లిద్దురుగాని. రేపే మీ పని మీదుంటాం" అన్నాడు వాసు.

శేషు నోరు మెదపలేదు. పొరపాటున తన గొంతు నామె గుర్తించేస్తుందేమోనని!

"థాంక్యూ! బై దిబై ....అతన్నిప్పుడే కావాలంటే మీరు చూడొచ్చు. పబ్లిక్ గార్డెన్స్‌లో నెహ్రూ బాలభవన్‌కి దగ్గరలో డిజైన్డు సిమెంట్ ఆర్చి దగ్గర కూచునివుంటాడు. ఫోటోనిబట్టి తేలికగా గుర్తు పట్టవచ్చు. అతన్ని ఫాలో అయి అన్ని సంగతులు క్షుణ్ణంగా తెలుసుకోవచ్చు."

"కాని, ఆతనింకా యిప్పటివరకు అక్కడే వుంటాడా? ఇంటికి వెళ్ళడా?"

"వెళ్ళడు. నేను కలుసుకునేవరకు అక్కడ్నుంచి కదలడు. నేనతనిమీద కోపంగా వున్నానని అతనికి తెలుసు. అందుకే నేను వెళ్ళేవరకు ఎదురు చూస్తూనే వుంటాడు."

"చాలా కాన్ఫిడెంట్‌గా చెప్తున్నారే! మీరు అతన్నింతకు కొద్దినిమిషాల క్రితమే చూసి వస్తున్నారు.... అవునా?" వాసు ఆమె ముఖంలోకి సూటిగా చూస్తూ అన్నాడు.

దీప తల దించుకుని, "అవును....అతన్ని చూడకుండా నేనుండలేను. ఇక్కడికి వచ్చే ముందు దూరంనించి చూసి వచ్చేశాను. అతను ఆర్చిపిల్లర్‌కి వీపు ఆనించి కూచుని ఎదురుచూస్తున్నాడు నా కోసం" అన్నది.

వాసు భావయుక్తంగా చూశాడు శేషు వంక.

"నేను చెప్పలేదా?" అన్నట్టు చూశాడు శేషతనివంక.

"గుడ్....నిజమైన ప్రేమికుల లక్షణం అది. అతను స్వచ్ఛమైన కల్తీలేని ప్రేమికుడు కావాలని మనసారా కోరుకుంటున్నాం. ఎనీ హౌ, రేపు సాయంత్రం ఓసారి రండి....ప్రోగ్రెస్ తెల్సుకుందురుగాని!" అన్నాడు వాసు.

"శ్రమనుకోకపోతే ఫోన్ చెయ్యండి. నా కెందుకో బయటికొస్తే అతన్ని చూడకుండా, అతన్ని కల్సుకో కుండా వుండలేననిపిస్తోంది" చెప్పింది దీప.

"మీరు వర్రీ కాకండి. మీది మంచి మనసు. స్వచ్ఛ మైన హృదయం. మీరెన్నుకున్న వ్యక్తి కూడా మంచి వాడే అవుతాడు....మీరు నిశ్చింతగా వుండండి. రేపు మా నుంచి మంచి కబురు వింటారు" అన్నాడు వాసు.

దీప లేచి నిలుచుని. "మీకు వేరే పనులేమీ లేకపోతే నాతో రండి - పబ్లిక్‌గార్డెన్స్ వద్ద దింపి వెళతాను" అన్నది.

'ఎంత పిచ్చిగా ప్రేమించేస్తున్నావు బిడ్డా ఆ మనోహ రుడ్ని! ఈ వంకనయినా మరోసారి అతన్ని చూడాలని తహతహలాడిపోతున్నావ్ - ఓహో, ప్రేమ యింత మత్తుగా వుంటుందా?' అనుకుంటున్నాడు శేషు మనసులో.

"విత్ ప్లజర్!" అంటూ లేచాడు వాసు.

శేషు మౌనంగా ఆఫీను సర్దేసి, షట్టర్స్ మూసేసి తాళం పెట్టేశాడు.

ముగ్గురు ఫియట్‌లో పబ్లిక్‌గార్డెన్స్ చేరారు.

దీప దూరం నించే ఆర్చివైపు చూసింది కారు దిగ కుండానే.

వాసు, శేషు తలలూపారు.

ఆమె కారును భారంగా ముందుకు దొర్లించింది.

"ప్రేమ ఎంతటి వాళ్ళనయినా తన జబ్బులోకి లాక్కొని ఆడుకుంటుంది. అందుకే నే నెవర్నీ ప్రేమిం చను" అన్నాడు శేషు.

వాసు చిర్నవ్వు నవ్వి "ఇలాంటి కబుర్లు చెప్పినవాళ్ళే అకస్మాత్‌గా ప్రేమలోపడి ప్రపంచాన్ని, పరిసరాల్ని పూర్తిగా విస్మరిస్తారు. చూస్తాను కదా!" అన్నాడు.

5

ఇద్దరు ఆర్చి దగ్గరకు కబుర్లు చెప్పుకుంటూ నడుస్తూ వెళ్ళారు.

దూరం నించే క్రీగంట మనోహర్ వయిపు చూశారు. ఎర్రగా బుర్రగా చాలా అందంగా వున్నాడతను. దీప అతనికోస మెందుకంతగా వెంపర్లాడిపోతున్నదో వాళ్ళకి తేలికగానే అర్థమయిపోయింది. మగాళ్ళకే మత్తెక్కించే టంతటి సౌకుమార్యంతో ముద్దుగా వున్నాడు.

అతనేదో దీర్ఘాలోచనలో వున్నాడు. మాటి మాటికీ గేటువయిపు చూస్తున్నాడు. కారు శబ్దం కోసం చెవులు రిక్కించుకుని వింటున్నాడు.

మనోహర్ దృష్టిలో పడకుండా అతని వెనక వయిపుగా కొంచెం దూరంలో కూచుని క్రికెట్ గురించి మాట్లాడు కుంటున్నారు వాసు, శేషు. రిలియన్స్ కప్‌ని భారతజట్టు ఎందుకు పోగొట్టుకున్నదో, అందులో గవాస్కర్ పాత్ర ఎంతవరకూ వుందో చర్చించుకుంటున్నారు. మధ్య మధ్య మనోహర్ వంక చూస్తున్నారు.

అతన్ని ఫాలో కావలసిన అవసరమేమీ లేదని వాళ్ళి ద్దరికీ తెలుసు. మనోహర్ దీపను చాలా తీవ్రంగా ప్రేమి స్తున్నాడు. అందుకే జనవరి చలిని కూడా లెక్క చేయ

కుండా తొమ్మిది గంటల రాత్రివరకు ఆమె కోసం ఎదురు తెన్నులు చూస్తున్నాడు.

"అనవసరంగా ఈ ప్రేమికుల మధ్య చిచ్చు రగిలించానే!" అనుకుంటున్నాడు శేషు.

వాసు చాలా సీరియస్‌గా మద్రాసు టెస్ట్ మ్యాచ్‌లో పదహారు వికెట్లు తీసుకున్న భారత్ లెగ్ స్పిన్నర్ హీర్వాణి గురించి అనర్గళంగా ఉపన్యసిస్తున్నాడు. "నరేంద్రకు మంచి భవిష్యత్తుంది...." అని అతనంటూండగానే మనోహర్ దగ్గరకు చకచక నడచుకుంటూ ఓ వ్యక్తి వచ్చాడు. చూడటానికి చాలా పెద్దమనిషిలా, హుందాగా సూటు బూటు వేసుకుని వున్నాడు.

"ఇంకా రాలేదా?" అనడిగాడు గుసగుసగా.

"లేదు-నేనూ ఆమెకోసమే చూస్తున్నాను. ఖచ్చితంగా వస్తుంది." అన్నాడు మనోహర్.

వాసు, శేషు నవ్వుకున్నారు.

"అవతల పార్టీ సిద్ధంగా వున్నాడు. హోటల్లో వుంచి వచ్చాను. మూడో అమ్మాయిలేందే కదిలేది లేదని గొడవ చేస్తున్నాడు. అడ్వాన్స్ రెండు లక్షలు తిరిగి ఇచ్చెయ్యమంటున్నాడు." అన్నాడు సూట్‌వాలా.

"ఎక్కడుంచావు ఆ అమ్మాయిలిద్దర్ని?" గొంతు తగ్గించి అడిగాడు మనోహర్.

"హోటల్ సిటీ లైట్సు రూం నెంబర్ పెవంటీ. పార్టీని కూడా అదే హోటల్లో వుంచాను. పెవెంటీ టూ రూంలో. పెవెంటీవన్ రిజర్వుచేసి వుంచాను దీప కోసం...."

వింటున్న శేషు, వాసు ఉలిక్కిపడ్డారు. అప్పటివరకు వాళ్ళిద్దరి సంభాషణ వాళ్ళకు కొరుకుడు పడలేదు. కాని, హోటల్ రూం నంబరు చెప్పుకోవటంతో అనుమానం

తలెత్తి క్షణాల్లో బలపడింది.

మనోహర్ చాలా పెద్ద ప్లాన్‌లో వున్నాడని, దీపని మాయోపాయంతో హోటల్‌కి తీసుకుపోయి ఏదో విదేశీ ఏజెంటుకి అమ్మెయ్యబోతున్నాడని, అందుకోసం అడ్వాన్స్ రెండు లక్షలు ముట్టిందని, దీపని అప్పగించగానే తక్కిన మొత్తం చేతికొస్తుందని, ఆ సూట్‌వాలా అతని పార్ట్‌నర్ అనీ—అర్థమైపోయింది.

కావాలనే వాళ్ళిద్దరు గుబురుగా పెరిగిన క్రోటన్స్ బుష్ వెనకాల కూచున్నారు. అప్పటికే వాచ్‌మన్ లైట్సు తీసెయ్యటంవల్ల అక్కడ చీకటి ఆవరించుకున్నది. తామిద్దరు వాళ్ళకి కనిపించే అవకాశాలు చాలా తక్కువ.

మనోహర్ గొంతు వినిపించింది. "ఇక ఈ రోజెందుకో దీప రాలేదు. రేపెలాగైనా ఆమెని రప్పిస్తాను. ఇరవై నాలుగ్గంటలు టైం అడుగుదాం అలీఖాన్‌ని. నేనొచ్చి నచ్చచెపుతాను, పద. ఈరోజు కిక ఆమెరానట్టే!"

"రా, నువ్వు చెప్పినా వినడేమో! చాలా కోపంమీదున్నాడు. రాత్రికి రాత్రి బొంబే వెళ్ళిపోవటాని కన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు అలీఖాన్."

"ఆ యిద్దరమ్మాయిలు ఏమైనా గొడవచేస్తూన్నారా?"

"ఎందు చేస్తారు? ఒకత్తె నిన్ను, రెండోది నన్నూ వరించి వచ్చిన కన్యలు కదా!" అతను గర్వంగా నవ్వాడు.

వాళ్ళు దూరంగా కదిలి వెళ్తున్నట్టు కన్ఫర్మ్ చేసుకున్నాక వాసు, శేషు వేగంగా గార్డెన్ బయటి కొచ్చారు.

"శేషూ, నువ్వు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌ని బలగంతో హోటల్ సిటీలైట్సు రూం నెంబర్ సెవెంటీమీద రైడ్ చెయ్యమను. అమ్మాయిలు దొరుకుతారు. వాళ్ళతోబాటు మనోహర్, అతని సహచరుడు, విదేశీపార్టీ అలీఖాన్

అందరు దొరుకుతారు. ఈలోపల నేను హోటల్‌దగ్గిర మాటువేసి పిట్టలు ఎగిరిపోకుండా జాగ్రత్త తీసుకుంటాను" అన్నాడు వాసు.

శేషు పోతున్న ఆటో నాపి ఎక్కికూచున్నాడు.

వాసు మరో ఆటోలో హోటల్ సిటీలైట్స్ వైపు దూసుకుపోయాడు.

6

"మీరాఃరాత్రివేళ పనికట్టుకొని వచ్చారేమిటిః" అన్నాడు సోమసుందరం ఆశ్చర్యంగా వాసు, శేషులవంక చూసి.

"ఓసారి మిస్ దీపగార్ని పిలుస్తారాః" అన్నాడు వాసు.

సోమసుందరం మరింత ఆశ్చర్యంగా "ఎందుకుః" అనడిగాడు.

"మీ కో శుభవార్త, ఆమెకో దుర్వార్త చెప్పాలిః" తాపీగా అన్నాడు వాసు.

"నాకు శుభవార్తాః ఏమిటదిః" ఆత్రంగా అడిగాడు సోమసుందరం.

"మనోహర్‌ని, అతడి ముఠాని పోలీసులు అరెస్టు చేశారు అమ్మాయిల్ని విదేశాలకి అమ్ముతున్న నేరం మీదః అది మీకు శుభవార్త, మిస్ దీపకి దుర్వార్త."

సరిగ్గా అదే సమయానికి హాల్లోకి వచ్చిన దీప ఆ మాటలు విన్నది.

"ఏమిటి మీ రంటున్నదిః" హిస్టీరికల్‌గా అరిచింది.

"వీయాఁ సారీ మిస్ దీపాః మీకు ఫోన్‌లో చెప్పాలనుకుని, అప్‌సెట్ అవుతారేమోనని పర్సనల్‌గా చెప్పాలని వచ్చాం. మనోహర్ నంబర్ వన్ ఇంటర్నేషనల్ స్మగ్లర్. అమ్మాయిల్ని తన అందంతో, మాయ మాటలతో మోసపుచ్చి విదేశీ పార్టీలకు అమ్మేస్తున్నాడు. మీతో

కూడా ఆ ఉద్దేశంతోనే పరిచయం పెంచుకుని, దాన్ని ప్రేమ ముసుగులో వృద్ధిచేసుకుని, యీ రాత్రి మిమ్మల్ని విదేశీయుడి కమ్మటానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. మీ రతన్ని రోజు కల్సుకోకపోవటం నిజంగా మీ అదృష్టం!" అన్నాడు వాసు గంభీరంగా.

"ఇదిగో మీ రిచ్చిన వెయ్యి రూపాయలు అడ్వాన్స్! మీ ప్రేమ విఫలమైనందుకు చింతిస్తున్నా, మీరు క్షేమంగా వున్నందుకు సంతోషిస్తున్నాం" అన్నాడు శేషు.

దీప శూన్యంలోకి చూస్తూంది.

సోమసుందరం ముందుగా తేరుకుని లోపలకు వెళ్ళి నోట్ల కట్టలతో తిరిగొచ్చి, "ఆ వెయ్యి, యీ నాలుగు వేలు కూడా స్వీకరించండి. మీ ఋణం ఈ కొద్ది మొత్తంతో తీర్చుకోలేనిది-కాదనకండి!" అంటూ వాసు చేతుల్లో పెట్టాడు. □

కనిపించని పంచె?



సీరియల్



వసుంధర

(గత సంచిక తరువాయి)

కమల పారిపోవడానికి నిరాకరిస్తే-"నీ కూతుర్ని పెంచి పెద్దచేసి నామీద కుసిగొలుపు. అప్పటికి నేను నాతోపాటు నా వ్యవస్థను నాశనంచేసే ఉపాయ మాలోచించే స్థాయి కెదుగుతాను" అని చెప్పాడతడామెకు.

మొత్తంమీద కమల అంగీకరించింది.

భార్య స్థానంలో నాయుడు లక్ష్మిని బలిపెట్టి—తన భార్యాబిడ్డలు పోయినట్లు లోకాన్నీ, చందననూకూడా నమ్మించాడు. లక్ష్మి బిడ్డను కమల కప్పగించాడు.

"ఇదీ నిజంగా జరిగిన కథ. నిన్ను నమ్మించడంకోస మిప్పుడిది బైటపెట్టక తప్పలేదు. నా కూతురు బ్రతికున్నట్లు నాకు మొదట్నించీ తెలుసు. లక్ష్మి కొడుకును నేనే తల్లి లేనివాణ్ణి చేశాను. వాడిపట్ల క్రూరంగా వ్యవహరిస్తే— నన్ను నేను క్షమించుకోగలిగినా కమల నన్ను క్షమించదు. అందుకే వాడి నేమీ చేయలేకపోతున్నాను...."

"మీరు సామాన్యులు కారు...." అంది చందన చటుక్కున.

"నువ్వు నా గురించి గొప్పగా ఊహించుకుంటే అది గొప్పతనానికే అవమానం. నేను శ్రావణ్ కన్యాయం తల పెట్టనని నువ్వు నమ్మితే చాలు..."

"నమ్ముతాను. కానీ వాడినెలా రక్షిస్తారు?"

"అది మాత్రం యిప్పుడు చెప్పకూడదు. ముందు ముందు తెలుస్తుంది...."

"శ్రావణ్ సంగతి సరే—ఇప్పుడు మిస్‌మిస్టరీకి ప్రపంచ ప్రఖ్యాతి వచ్చింది. ఆమె నెలా రక్షిస్తారు? ఏ అంతర్జాతీయ ముఠాయో ఆమె ప్రాణాలు తీస్తుంది...." అంది చందన.

"చందనా! నా వినాశనానికై నేను పది సంవత్సరాలుగా పథకం తయారుచేస్తున్నాను! నా కూతు రా పథకంలో భాగం. ఆమె విషయంలో నేనన్ని జాగ్రత్తలూ తీసుకుం టూనే ఉన్నాను. ఆమెను మనిషిగా చూసినవారు బహు కొద్దిమంది. ఆమె ఫొటోలు కొందరి చేతులకు చిక్కాయి. వాటి నెప్పటికప్పుడు నేను నాశనం చేయిస్తూ వచ్చాను. అందుకే ఇంతవరకూ ఎక్కడా ఆమె ఫొటోల ప్రచురణ జరుగలేదు. అటుపైన ఆమె రహస్యాలను కుమారస్వామి, ఛోటేలాల్ వంటి వారి ద్వారా తెలుసుకుంటోందన్న భ్రమ నా అనుచరులలో కలిగించాను. నిజానికి నా ద్వారా ఆమె ఏ రహస్యాన్నైనా తెలుసుకోగలదు. అనుచరుల్లో అనుమానం సృష్టించడాని కామెచేత కొంత నాటక మాడించాను. ముత్యాలమూర్తి దగ్గిర్నుంచి నా ఫైల్సు సంగ్రహించబడ డంతో - ఆమె పగ నామీదున్నదని చాలామంది అను కున్నారు....ఇప్పుడు నా కథ ముగిసేక మిస్‌మిస్టరీ ఎప్పటికీ మిస్టరీగానే మిగిలిపోతుంది ..."

"మీ కథ ముగియడ మేమిటి?" అంది చందన కంగా రుగా.

"అంటే—పాత కథ ముగిసి కొత్త కథ ప్రారంభించా లని...."

"మీరేదో దాస్తున్నారు...." అంది చందన అనుమానంగా.

"చెప్పవలసినదంతా నీకు చెప్పాను...." అన్నాడు నాయుడు.

"అయితే—ఇప్పుడేం జరుగుతుంది!"

"నేనిప్పుడు పార్కుకి బయల్దేరుతున్నాను. వచ్చేక మరికొన్ని విశేషాలు చెబుతాను" అన్నాడు నాయుడు.

"పార్కులో వాడికెవరూ ఏ ప్రమాదమూ తలపెట్టరు కదా!"

"ఆ విషయంలో నాది హామీ...."

ఉన్నట్లుండి "నేనూ వస్తానండీ" అంది చందన. అనుమానం, కలవరం, భయం ధ్వనిస్తున్నాయా గొంతులో.

నాయుడదోలా నవ్వి—తన జేబులోంచి ఓ చాక్లెట్ తీసి ఆమెకిచ్చి— "నీలో కలవరం ఎక్కువగా ఉంది. ముందిది తీసుకో. అప్పుడింకో విశేషం చెబుతాను—" అన్నాడు.

చందన చాక్లెట్ నోట్లో వేసుకుని చప్పరిస్తూ— "చెప్పండి!" అంది.

"చాక్లెట్ తినడమయ్యాక చెబుతాను" అన్నాడు నాయుడు.

ఆమెకలా అప్పుడప్పుడు చాక్లెట్లిస్తూండడం నాయుడికలవాటే! అందుకే సందేహించకుండా వెంటనే తినేసిందామె.

"ఇప్పుడు చెప్పండి...."

"కొద్దిక్షణాల్లో నిన్ను మత్తావహిస్తుంది. కనీసం నాలుగు గంటలపాటు నిన్నెనుగులు తొక్కినా మెలకువ

రాదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నీకిది చాలా అవసరం_" అన్నాడు నాయుడు.

"మోసం ...మీరు నన్ను మోసంచేశారు...."

"అంతా నీ మంచికే...." అన్నాడు నాయుడు.

చందనను మత్తావహింపచడానికెంతోసేపు పట్టలేదు. ఆమె పక్కమీద వాలిపోగానే నాయుడామె చేతిలోని ట్రాన్స్‌మీటర్ తీసుకున్నాడు.

32

చాలా చిన్న పార్కది.

ఆ సమయంలో అక్కడ జనసంచారం లేదు.

నాయుడు నెమ్మదిగా నడుస్తూ ఆ పార్కులో ప్రవేశించి ఓ గులాబి మొక్క పక్కన కూర్చున్నాడు.

కాసేపటి కక్కడికో వృద్ధుడు ప్రవేశించాడు. అతడు ఎర్రని పంచకట్టుకున్నాడు. నీలం చొక్కా ధరించాడు. నెరసిన జుట్టు, తెల్లటి గెడ్డం, చేతిలో కర్ర....

అతడు వణుకుతూ నడుస్తున్నాడు.

నాయుడతణ్ణి చూసి కూడా చూడనట్లే నటించాడు.

వృద్ధుడు నాయుణ్ణి సమీపించి—"ఎంపీగారా—నమస్కారం...." అన్నాడు.

నాయుడులికిపాటు నటించి అతడివంకచూసి—"ఎవరున్నవ్వు...." అన్నాడు.

"శ్రావణ్...."

నాయుడు తన లాల్చీ జేబులోంచీ ఓ ట్రాన్స్‌మీటర్ తీసి—"సీతో మాట్లాడాలి. దీన్ని పలికించగలవా?" అన్నాడు.

వృద్ధుడది అందుకుని క్షణాలమీద ఏవో మీటలునొక్కి నాయుడి కందించి—తన జేబులోంచి కూడా అలాంటిదే

మరొకటి తీశాడు.

అప్పుడు నాయుడి మాటలు వృద్ధుడి ట్రాన్స్‌మీటర్లో రాసాగాయి.

"శ్రావణ్!" అన్నాడు నాయుడు.

వృద్ధుడు నాయుడి కళ్ళలోకి సూటిగా చూశాడు.

"శ్రావణ్ — మైసన్!" అన్నాడు నాయుడు. అప్పుడు నాయుడి గొంతు గాద్గదికమైంది. కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

వృద్ధుడు తన గెడ్డం పీకేశాడు. విగ్గు తీసేశాడు.

"డాడీ!" అన్నా డతడు.

ఆ గొంతు నాయుణ్ణెన్నో సంవత్సరాలు వెనక్కు తీసుకుపోయింది.

"డాడీ....డాడీ ..."

అయిదేళ్ళ శ్రావణ్ పిలుపది.

నాయుడు లేచి నిలబడ్డాడు. ఆయన కప్పుడు శ్రావణ్ ఎన్నో ఏళ్ళ చిన్నవాడిలా కనపడ్డాడు.

"డాడీ...." అంటూ శ్రావణ్ నాయుడికి దగ్గర య్యాడు.

ఇద్దరూ ఒకరినొకరు బలంగా కౌగలించుకున్నారు.

అప్పుడు శ్రావణ్ భూమిలో పాతుకుపోయిన మహా వృక్షంలా ఉన్నాడు. వారిద్దర్నీ విడదీయడం ఏ మహా శక్తికీ సాధ్యపడదనిపిస్తుంది.

శ్రావణ్ ఏడుస్తున్నాడు.

నాయు డేడుస్తున్నాడు.

ఏడుస్తూ ఇద్దరూ ఒకరి భుజాలొకరు తడుపుకుంటున్నారు. ఆ తడి వారి శరీరాలపై ఎంతోసేపు నిలవకుండా ఇట్టిట్టే ఆరిపోతోంది.

అలా కొంతసేపు గడిచింది.

ఇద్దరూ తమాయించుకుని నెమ్మదిగా కూర్చున్నారు.

ఇద్దరి చేతుల్లోనూ రుమాళ్ళున్నాయి.

"డాడీ! నా జీవితమంతా వృధా అయిపోయింది—" అన్నాడు శ్రావణ్.

"మనం శాపగ్రస్థులం...." అన్నాడు నాయుడు.

"ఎన్నోసార్లు నిన్ను దూరాన్నుంచి చూశాను. కానీ దగ్గరగా రాలేకపోయాను. ఈరోజు నీ కింత దగ్గరగా ఉంటే ఎంత బాగుంది? అమ్మ దగ్గరైతే ఇంకా బాగుం టుందేమో—" అన్నాడు శ్రావణ్.

నాయుడి కళ్ళలో మళ్ళీ నీళ్ళు తిరిగాయి.

ఇద్దరూ కాసేపు తమ గురించి మాట్లాడుకున్నారు. ఒకరి కష్టాలొకరికి చెప్పుకున్నారు. ఒకరికొకరు సాను భూతి చూపుకున్నారు.

"థాంక్స్ టు మిస్‌మిస్టరీ - లేకుంటే మన మెప్పటికీ యిలా కలుసుకోలేం—" అన్నాడు శ్రావణ్.

"థాంక్స్ టు మిస్‌మిస్టరీ—ఇదే మన మాఖరిసారిగా కలుసుకోవడం—" అన్నాడు నాయుడు.

"డాడీ! నా కిప్పుడు ప్రపంచాన్ని మరిచి అమ్మదగ్గర కెళ్ళిపోవాలనుంది. ఎందుకంటే నన్నిప్పుడాపగల వాళ్ళు కూడా ఎవ్వరూ లేరు. రెండురోజుల క్రితం మున్నాముఖర్జీ విషం తిని చనిపోయాడు. చనిపోయే ముందు నా కతడు నా గురించిన పూర్తి నిజాలు చెప్పాడు. అప్పట్నుంచీ నా మనసు మనసులో లేదు. మీ దగ్గిరా, అమ్మ దగ్గిరా కొంత కాలం గడపాలని ఉంది డాడీ! ఇప్పుడు నేను నా తప్పు వొప్పుకుని ప్రభుత్వానికి లొంగిపోతే ఏం జరుగుతుంది? నాకు మళ్ళీ కొత్త జీవితం లభిస్తుందా? ఆ జీవితంలో

అమ్మ, నాన్న—అంతా ఉంటారా....?" అన్నాడు శ్రావణ్.

నాయుడు నిట్టూర్చి—"నీకిక కొత్త జీవితం లభించే అవకాశం లేదనుకో — అప్పుడేం చేస్తావో?...." అన్నాడు.

"అర్జంటుగా ఒక్కసారి అమ్మను కలుసుకుని— ఆమె ఒడిలో వాలిపోతాను...."

"మరి నీ సంధ్యనేం చేస్తావ్?"

"డాడీ! సంధ్యంటూ ఎవరూ లేరు. నా వృత్తికి సరిపడదని గ్రహించి నేను పెళ్ళి చేసుకోదల్చుకోలేదు. అమ్మకు తృప్తి కలిగించడం కోసం సంధ్యను సృష్టించాను నేను. ఇప్పుడు నాకు అమ్మ కావాలి. అమ్మ తప్ప ఎవరూ వద్దు!"

"కానీ...." అన్నాడు నాయుడు—"ఇప్పుడు నువ్వమ్మను కలుకుంటే ఆమె నిన్ను వదలదు ఇన్నేళ్ళుగా దాచుకున్న ప్రేమ ఒక్కసారిగా పొంగిపొరలి పోతుంది. ఆమె నిన్ను క్షణంపాటు కూడా వదలనంటుంది. అందుకే అమ్మను కలుసుకుందుకు నీ కిది సమయంకాదు...."

"మరెప్పుడు?" అసహనంగా అడిగాడు శ్రావణ్.

"ఆ సమయం కూడా త్వరలోనే రానుంది. అందుకు నాకు నీ సహకారం అవసరం ...." అన్నాడు నాయుడు.

"చెప్పు డాడీ!"

"నేను మర్యాదగా బయటపడక తప్పదు. లేకుంటే మిస్ మిస్టరీ నన్ను బైటపెడుతుంది. నా వ్యవస్థ దెబ్బ తిన్నదని అంతర్జాతీయ ప్రముఖులందరూ గ్రహించారు. వారికి నా పరిస్థితి తెలియబర్చుకుని సలహా అడిగాను. తమ

రహస్యాలు బయటపడతాయని వారి భయం. అందుకని కొంతకాలంపాటు అంతర్జాతీయ నేరాలకు స్వస్తి. దేశంలో శాంతి. నేను ప్రభుత్వానికి లొంగిపోవడం మంచిదని వారి సలహా."

"నా విషయంలోనూ అంతా అలాగే సలహా యిచ్చారు...."

"ఒక విధంగా యిదే మంచిది. నేను పోయినా మళ్ళీ ఈ వ్యవస్థను పునర్నిర్మించి ప్రారంభించడానికి చాలా ఏళ్ళు పడుతుంది. నేను బ్రతికి ప్రయోజనం లేదు. అయితే నేను చావడానికింత కంటే మంచి సమయం దొరకదు...." అన్నాడు నాయుడు.

"అంటే?"

"రేపే ఒక బహిరంగ సమావేశ మేర్పాటు చేస్తాను. అందులో శ్రావణ్ గురించిన నిజాలు కొన్ని బైట పెడుతున్నట్లుగా ముందే ప్రకటిస్తాను. ఆ సభలో మాటల మధ్య నేనే శ్రావణ్‌నని చెబుతాను. అందుకు కొన్ని ఆధారాలు కూడా సూచిస్తాను. ఇంకా నేను మాట్లాడుతూండగానే నువ్వు నన్ను రివాల్వరుతో కాల్చిచంపు. శ్రావణ్ కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తూన్నాననీ—శ్రావణ్ చనిపోయినట్లే అంతా భావిస్తారు. నువ్వు సామాన్యుడిగా కొత్త జీవితం ప్రారంభించవచ్చు—...."

"అంటే—నిన్ను నా చేతులతో చంపుకోవాలన్న మాట...."

"అవును—మనం చేసిన అపరాధాలకీ శిక్ష తప్పదు. నువ్వు నన్ను చంపకపోతే — ఉపన్యాసానంతరం ఏ విషమో మింగి నన్ను నేనే చంపుకోవాలి. నా చావెలాగూ తప్పనప్పుడు నా చావు నీకు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తే.

అదో తృప్తి నాకు...." అన్నాడు నాయుడు.

"అసలు నా చేతులతో ఏన్నెందుకు చంపాలి?"

నాయుడు నిట్టూర్చి—"దేశమాత కన్నబిడ్డను నేను. ఒక వ్యవస్థకు సాయపడి ఆ మాత శరీరంలో తూట్లు చేశాను. నావంటివాడు కన్నబిడ్డ చేతిలో మరణించకపోతే ప్రాయశ్చిత్తముండదు...." అన్నాడు. ఈ విషయమై యిద్దరికీ కాసేపు వాగ్వివాదం జరిగింది. అయిష్టంగానే శ్రావణ్ అంగీకరించాడు.

"ఇక నీ వద్దనున్న ట్రాన్స్మిటర్ నా కివ్వు...." అన్నాడు నాయుడు.

"ఇది అమ్మకోసం ప్రత్యేకంగా తయారుచేశాను. అమ్మతో మాట్లాడాలంటే...." అని ఆగాడు శ్రావణ్.

"ఇక నీవు అమ్మతో మాట్లాడ్డానికి ట్రాన్స్మిటర్ అవసరంలేదు....నన్ను చంపేక స్వయంగా కలుసుకుని మాట్లాడొచ్చు— అందుకే ఆ ట్రాన్స్మిటర్ అడుగుతున్నాను...."

శ్రావణ్ తండ్రికి ట్రాన్స్మిటర్ ఇచ్చాడు. ఆయన రెండు ట్రాన్స్మిటర్లనూ జేబులో వేసుకున్నాడు.

"సెలవు డాడీ!" అన్నాడు శ్రావణ్.

"మై సన్!" అంటూ నాయుడతణ్ణి బలంగా కౌగలించుకున్నాడు.

ఇద్దరి భుజాలూ తడిశాయి. ఆ తడి ఆరేటంత వేడిప్పుడా శరీరాల్లో లేదు.

33

నాయుడు పార్కు నుంచి తిన్నగా ముత్యాలమూర్తింటికి వెళ్ళాడు.

"కమీషనర్ గారూ—రేపే ఒక బహిరంగ సభలో

శ్రావణ్ ఎవరో ప్రకటించబోతున్నాను. శ్రావణ్ పేరు బయటపడితే మనమందరం బయటపడక తప్పదు. ముందు మీరు మనకు సంబంధించిన అన్ని ఫైల్సునూ నాశనం చేయండి. బహిరంగసభకు శ్రావణ్ వస్తాడు. నేను శ్రావణ్ గురించి చెప్పేలోగా నన్ను కాల్చి చంపాలని ప్రయత్నిస్తాడు. అతణ్ణి మీరు వెంటనే కాల్చిపారేయాలి. అతడు బ్రతికుండడం అటు దేశానికీ, యిటు మనకూ కూడా చాలా చాలా ప్రమాదం....కాబట్టి అతడిలో ప్రాణం మిగలని విధంగా కాల్చి చంపేయాలి మీరు...." అన్నాడు నాయుడు.

ముత్యాలమూర్తి ఆశ్చర్యంగా—"మీరు నిజంగా శ్రావణ్ని కనుగొన్నారా? యెలాగుంటా డతడు?" అన్నాడు.

"నా పోలికే అనుకోండి—" అన్నాడు నాయుడు.

"బహిరంగ సభ కెందరో వస్తారు. అంతమందిలో అతడి నెలా గుర్తుపట్టడం?" అన్నాడు ముత్యాలమూర్తి.

"నన్నతడు రివాల్వరుతో కాల్చి చంపాలి కాబట్టి—నేనున్న వేదికకు దగ్గర్లోనే ఉంటాడు. అతణ్ణి కనుక్కోవడం సులభమే...."

"అతడు మిమ్మల్ని కాల్చి చంపుతాడని మీ నమ్మకమా?"

"అవును...."

"ఎలా తెలుసు మీకు?"

నాయుడు నవ్వి - "అన్నీ వివరంగా చెబుతాను—శ్రావణ్ ఈ లోకం విడిచిపెట్టేక...." అన్నాడు.

* * *

ముత్యాలమూర్తి యింటినుంచి నాయు డాంజనేయు

లింటికి వెళ్ళి అక్కడ శ్రావణ్ పేరుతో ఉన్న వ్యక్తిని కలుసుకున్నాడు.

"ఇక మీ రొచ్చిన పనైపోయింది. ఎక్కడికెక్కావా లంటే అక్కడికి వెళ్ళిపోవచ్చు..." అన్నాడాయన నకిలీ శ్రావణ్‌తో.

"కానీ శ్రావణ్ యింకా పట్టుబడలేదు...." అన్నాడతడు.

"పట్టుబడడమే కాదు. ప్రాణాలే కోల్పోతాడు. అందుకు రేపే ముహూర్తం!"

"ఎలా?"

"అదంతా నేను చెప్పకపోయినా రేపటికి నీకే తెలుస్తుంది కానీ అప్పటికి నువ్వింకా శ్రావణ్ పేరుతో ఇక్కడుండడం మంచిదికాదు. ఆంజనేయులు అలజడి సృష్టించవచ్చు. ఈ రాత్రికి రాత్రి నువ్విక్కణ్ణించి మాయమైపోవాలి...." అన్నాడు నాయుడు.

నకిలీ శ్రావణ్ ఆయనకు వంగి నమస్కరించాడు.

"నా స్వార్థంకోసం నీ తల్లిని హత్య చేయించిన పాపాత్ముణ్ణి. నాకు నీవు నమస్కరించ కూడదు...." అంటూ నాయు డతణ్ణి లేవనెత్తాడు.

"సర్—నాకు తల్లి లేదన్న విషయం తెలియకుండానే పెరిగాను. అందువల్ల నాకు మీపై కోపం లేదు—" అన్నాడు నకిలీ శ్రావణ్.

"అదంతా కమల గొప్పతనం. ఆ గొప్పతనమే నాలో పరివర్తన తెచ్చింది. నన్ను మామూలు మనిషిలా ఆలోచింపజేసింది, ఆమెకు నా అభినందనలు తెలియజేయి...."

నకిలీ శ్రావణ్ మాట్లాడలేదు.

"విధవగా ఇంత కాలం జీవితం కొనసాగించింది. ఇక

మీదట కూడా అలాగే జీవితం కొనసాగించమని చెప్పు. నా పాపాలకు నిష్కృతి కావాలంటే - ఆమె నన్నాశీర్వదించాలి. భార్యగా ఆమె నాకంటే చిన్నదయినా మనిషిగా నాకంటే పెద్దది....''

నకిలీ శ్రావణ్ ఆ మాటలు పట్టించుకోకుండా - "రేపే మవుతుంది సార్... శ్రావణ్ ఎలా పట్టుబడతాడు?'' అన్నాడు.

"సీ మిస్ మిస్టరీ కాసేపట్లో యిక్కడ కొస్తుంది. శ్రావణ్ నామె కళ్ళారా చూసింది. కర్తవ్యబోధ నీకామె ద్వారా జరుగుతుంది....''

"సర్ - ఆమె శ్రావణ్ నెలా చూసింది?''

"కొద్దిసేపటి క్రితం నేను శ్రావణ్ ని కలుసుకున్నాను. కలుసుకునే ముందామెకు తెలియబర్చాను.''

"నాకు తెలియకుండానా?''

"అవును. శ్రావణ్ ను ముందుగా చూసే అవకాశ మామెకు తప్ప ఎవ్వరికీ యివ్వదల్చుకోలేదు....''

"అయితే కాసేపటి క్రితం మీ సెక్రటరీ ద్వారా ఓ కాగిత మందుకుని వెంటనే వెళ్ళిపోయిందామె....అది మీ కబురన్న మాట....'' అన్నాడు నకిలీ శ్రావణ్.

"అవును. ఇంత వరకూ అంతా నేననుకున్నట్లే జరిగింది....'' అంటూ ఓ ట్రాన్స్మిటర తడి కందించాడు.

"ఏమిటిది సర్!'' అన్నాడు నకిలీ శ్రావణ్.

"ఇది శ్రావణ్ ది....'' అన్నాడు నాయుడు.

34

"అబ్బాయిని చూసేరా?''

"ఊఁ''

"ఎలాగున్నాడు?''

"అచ్చం నాకులాగే ఉన్నాడు...."

చందన కళ్ళు మెరిశాయి - "వాడు నా గురించడగ లేదా?"

"వచ్చినప్పట్నించీ వాడి ధ్యాసంతా నీ మీదే - నిన్ను కలుసుకుంటానంటే నేనే వారించాను. అందు కింకా సమయం రాలేదు...."

"సమయం ఎప్పుడొస్తుంది?"

"చందనా! శ్రావణ్ మన కొడుకన్న రహస్యం పోలీస్ అధికారుల్లో కొందరికి తెలుసు. వాడిప్పుడు మనింటికొస్తే అది చాలా అనుమానాలకి దారి తీస్తుంది. రేపు నేను శ్రావణ్ కోసం పెద్ద ఏర్పాటు చేశాను. ఒక బహిరంగ సభ....అందులో నేను శ్రావణ్ వివరాలు బయట పెడతాను....అప్పుడు జనంలోంచి శ్రావణ్ నాపై హత్యా ప్రయత్నం చేస్తాడు. పోలీసులు వాడ్ని కాల్చి చంపేస్తారు. ఆ విధంగా శ్రావణ్ చచ్చిపోయాడని అంతా అనుకుంటారు. కానీ మన శ్రావణ్ బ్రతికే ఉంటాడు. ఇదంతా నా ఏర్పాటు...."

"ఏమిటండీ యిదంతా?" అంది చందన భయంగా.

"భయపడకు. అంతా మన మేలుకే...." అన్నాడు నాయుడు.

తర్వాత ఆయన బహిరంగ సభ గురించి పుర ప్రముఖులకు తెలియజేశాడు ఫోన్ ద్వారా. ఏర్పాట్లు చేయించమని సెక్రటరీకి పురమాయించాడు.

రాత్రికి రాత్రే అన్ని పత్రికల కార్యాలయాలకూ ఫోన్లు వెళ్ళాయి.

ఆ రాత్రే నాయుడు లాయర్ని పిలిపించి తన ఆస్తిపాస్తుల విషయమై విల్లు రాసేశాడు.

35

బహిరంగ సభలో ఎంపీనాయుడు వీరావేశంతో వూగిపోతూ ఉపన్యాసం ప్రారంభించాడు. శ్రావణ్ ఎలాంటి కిరాతకుడో, అతడు చేసిన ఘాతుకాలెలాంటివో కళ్ళకు కట్టినట్లు వివరిస్తున్నాడు.

"చాలామంది అభిప్రాయంలో శ్రావణ్ చాలా చిన్నవాడు. యుకుకుడు. కానీ అతడి చుట్టు ఏర్పడి బలపడిన వ్యవస్థ చిన్నది కాదు. దానికి మున్నాముఖర్జీ పాలుపోసి పెంచాడు. కొన్ని దశాబ్దాలుగా ఆ వ్యవస్థనెవరూ ఏమీ చేయలేకపోతున్నారు. అందుకు చాలా కారణాలున్నప్పటికీ పదవుల్లో వున్న మాబోంట్లలో అవినీతి పెరిగిపోవడం కూడా ఒక ముఖ్యకారణమని ఒప్పుకోక తప్పదు.

ఇప్పుడు మిస్ మిస్టరీ నంటూ ఒకామె బయలుదేరింది. ఆమె ఎవరో తెలియదు కానీ అద్భుత శక్తులు ప్రదర్శిస్తూ ఈ వ్యవస్థను పెద్దదెబ్బ తీసింది. పునాదులతో సహా పెకలించి వేసింది. ఇలాంటి సమయంలో శ్రావణ్ అనుచరులొకొక్కరే దెబ్బ తిన్నారు. బలహీనపడ్డ శ్రావణ్ క్రమంగా ఒంటరి అయ్యాడు. ఆ శ్రావణ్ ఎవరో నాకిప్పుడు తెలుసు.

కొన్ని పరిస్థితుల కారణంగా ఇంతకాలం ఆ శ్రావణ్ ఎవరో బయటపెట్టే సాహసం చేయలేకపోయాను. ఇక జాప్యం చేయను. నాకు తెలిసిన శ్రావణ్ ఎవరంటే ... అతడు మీ అందరికీ తెలుసు. ఇంత కాలం మరో పేరుతో మీ కళ్ళ ముందు మసలుతున్నాడు. ఇప్పుడు కూడా అతడు మీ ముందే ఉన్నాడు. అతడెవరంటే....?"

నాయుడు ఆగాడు.

జనం ఊపిరి పీల్చటం కూడా మరిచి ఆయన మాటలు వింటున్నారు.

నాయుడికి పేరు చెప్పడానికి ధైర్యం చాలడంలేదేమో ఒకసారి ఊపిరి గట్టిగా పీల్చాడు.

"శ్రావణ్ ఎవరంటే?"

నాయుడి వాక్యం పూర్తి కాలేదు. ఢాం మన్న చప్పుడు-వరుసగా మూడుసార్లు.

వేదికపై నాయుడు కుప్పలా కూలిపోయాడు.

జనంలో కలకలం....

అంతలోనే మరోసారి ఢాం మన్న చప్పుడు....వరుసగా మూడుసార్లు.

వేదిక ముందు జనంలో నిలబడ్డ యువకుడొకడు కుప్పలా కూలిపోయాడు. అతణ్ణి పోలీసులు చుట్టుముట్టారు.

"డాడీ! శ్రావణ్ ఎవరో చెప్పా లనుకున్నావు. నీ పేరుకు కళంకం రాకూడదని పేరు చెప్పేలోగానే విన్ను పేల్చేశాను. నా గురించి పోలీసులేమూహిస్తారో తెలుసు కోకుండానే నీ వద్దకు వచ్చేస్తున్నాను. ప్రజలు నన్నే శ్రావణ్ అనుకుంటే - అనామకుడినైన నా హోదాకు వచ్చే భంగం లేదు. ఇంతకాలం నన్ను రక్షించినందుకు జీవించే అర్హత నీవు కోల్పోతే - నీ రక్షణలో అవధులు మీరి ప్రవర్తించినందుకు నాకూ జీవించే అర్హత లేదు. కన్నకొడుకుగా మీకు కళంకం రాకుండా నేను చేయగలిగింది చేశాను...." అన్నాడు శ్రావణ్ కొనప్రాణంతో.

36

అతడు కార్లో ఉన్నాడు.

ఆమె కారు దిగి గుడిసె ముందుకు నడిచి - "మరి దయ్యా!" అని పిలిచింది.

లోపల్నుంచి మరిడయ్య వచ్చాడు.

"నువ్వు చేసిన సాయం మరిచిపోలేను. నేను తల పెట్టిన కార్యక్రమం సక్రమంగా నెరవేరింది. నీకు వెయ్యి న్నూట పదహార్లిచ్చుకుందామని వచ్చాను ..."

మరిడయ్య ఆమెకు నమస్కరించి - "వద్దు తల్లీ! గోతిలోంచి శవాన్నెలా తేపాలో ఆ విద్య నాకు చెప్పు. వేలకు వేలు సంపాదించుకుంటాను" అన్నాడు.

ఆమె అతడికో కవరందించి - "శక్తికి మించిన కోర్కెలు కోరకు" అని వెనక్కు తిరిగి కారెక్కింది.

కారక్కణ్నుంచి కాసేపట్లో వీరపాలెం మర్రిచెట్టుదగ్గ రాగింది.

చెట్టుకింద బిచ్చగా డున్నాడు.

"మున్నాముఖర్జీతో వ్యాపించిన ఒక మహా వ్యవస్థ - ఈ పల్లెటూరిదాకా సాగి - ఒక సామాన్య రైతుకూలీని బిచ్చగాడిగా మార్చింది. ఈ బిచ్చగాడి కొడుకు మన యజ్ఞంలో సమిధగా మారి ఉండొచ్చు. ఈ బిచ్చగాడికో అయిదు వేలివ్వు. ఏ కిరాణా దుకాణమో ప్రారంభించుకో మను. మనం మళ్ళీ వచ్చినపుడు బిచ్చమెత్తుకుంటూ కన పడితే ఊరుకోమని చెప్పు...." అందామె అతడితో.

అతడు బిచ్చగాణ్ణి సమీపించి - ఒక కవరందించాడు. విషయం విని బిచ్చగాడు పరుగున వచ్చి ఆమె కాళ్ళమీద పడ్డాడు.

"మా కాళ్ళమీద పడితే ఎలా? దీవించవూ?" అం దామె.

"దేవతామూర్తివి. నిన్ను నేనేం దీవించనూ?" అన్నాడు వాడు.

"మా యింట్లో కొత్త దీపం వెలగాలని."

బిచ్చగాడికి అర్థమైంది-"మీరు పెళ్ళి చేసుకున్నారా?" అనడిగాడు.

ఆమె నవ్వింది. సమాధానం ఆ నవ్వులో ఉంది.

"ఒకటి కాదు - వేలకొద్దీ...." అని ఆగిపోయి - "ఇది కొత్తతం కదమ్మా - రెండు కొత్తదీపాలు వెలగాలని దీవిస్తున్నాను...." అన్నాడు బిచ్చగాడు

"నాంచారయ్యగారు కులాసాగా ఉన్నారా?" అందామె.

"నిన్ననే వారి పెద్దకర్మయింది ..." అన్నాడు బిచ్చగాడు.

ఆమె అతడి కేసి చూసి నవ్వింది.

"సుకుమార్ బా బెలాగున్నాడు?" అన్నా డతడు.

"నిన్ననే ఊరికెళ్ళారమ్మా-పెళ్ళిచూపులకని... "

ఇద్దరూ వెనక్కి తిరిగారు.

బిచ్చగా డాశ్చర్యంగా-"నిజంగా ఈ డబ్బు నాదేనా?" అన్నాడు. అపనమ్మకం వాడి చూపుల్లో కనిపిస్తూంది.

ఇద్దరూ కారెక్కారు.

అతడు కారు స్టార్టుచేశాడు.

బిచ్చగాడి మాటలాశబ్దంలో కలిసిపోయాయి.

కారు కదిలింది. వేగం పుంజుకుని ఎన్నో ఊళ్ళుదాటి ఓ నగరంలో ప్రవేశించింది. నగరంలో ఎన్నో సందులు తిరిగి ఓ యింటిముం దాగింది.

చిన్నబంగళా అది!

ఇద్దరూ కారు దిగారు.

అతడు డిక్కీ తెరిచాడు. అందులో ఓ నల్లటి తోలు పెట్టె ఉంది.

అతడు. ఆమె ఆ పెట్టెను మోసుకుంటూ ఇంటి గుమ్మం ముందుకు చేరవేశారు. అతడు కాలింగ్ బెల్

నొక్కాడు.

"మర్చిపోయావా? అమ్మ తీర్థయాత్రలో ఉంది...." అందామె.

"మర్చిపోయాను-" అంటూ అతడు జేబులోంచి తాళం చెవుల గుత్తి తీశాడు.

కాసేపట్లో కారు షెడ్లోకీ, పెట్టె యింట్లోకీ, వారు యింటిలో కుర్చీల్లోకీ చేరుకున్నారు.

"అలసటగా ఉంది కదూ!" అందామె.

"కానీ ఎంతో ఆనందంగా కూడా ఉంది-" అన్నాడతడు.

"ఆనందం అలసటను పోగొట్టడంలేదు...." అందామె.

"అయితే మిస్ మిస్టరీని పిలుస్తాను. కానీ ఒక్క నిముషం...." అన్నాడతడు.

"ఏమయింది?"

"అమ్మ పిలుస్తూంది."

ఆమె ఏదో అనేలోగా అతడు జేబులోంచి ట్రాన్సిస్టర్ తీసి- "అమ్మా!" అన్నాడు.

"బాబూ-శ్రావణ్ నువ్వేనా?" అందవతల గొంతు.

"అవునమ్మా?" అన్నాడతడు.

"నన్నెప్పుడు కలుసుకుంటావురా?"

"నిన్ను కలుసుకున్న రోజున నా కథ ముగిసిపోతుందమ్మా-ఈ జన్మకు నాకా అదృష్టంలేదు...." అన్నాడతడు.

"ఇంతకాలం నేను పిలుస్తే పలకలేదేం?"

"ఇప్పుడేనమ్మా నేను ట్రాన్సిస్టర్ రేంజిలోకి వచ్చింది. చాలా అలసటగా ఉంది. పెద్ద ప్రయాణంచేసి వస్తున్నాను...."

"అయితే మరోసారి మాట్లాడుకుందాంలే—ఊరికే నీ క్షేమం తెలుసుకుందామని పలకరించా నంతే...." అందవతల గొంతు.

అతడు ట్రాన్స్మిటర్ ఆఫ్‌చేసి జేబులో వేసుకొన్నాడు.

"నాన్న నిన్ను శ్రావణ్‌గా తన రెండో భార్యకు పరిచయం చేద్దామనుకున్నాడు. ఆ విధంగా ఆమెను సంతోష పెట్టాలనుకున్నాడు. అందుకే నిన్ను శ్రావణ్ పేరుతో ఆంజనేయులింట్లో ప్రవేశపెట్టి కొన్ని ఆధారాలు, ఋజువులు తయారుచేశాడు. కానీ చివర్లో ఆ పద్ధతివల్ల చాలా కష్టనష్టాలున్నాయనిపించి—ఈ పద్ధతి ఎన్నుకున్నాడు. పాపం-ఆమెకు జీవితాంతం కొడుకుతో ట్రాన్స్మిటరు కబుర్లే గతి!" అందామె నిట్టూర్చి

"కుమారస్వామి, ఛోటేలాల్, శంకరనారాయణ వగైరాలకులాగే ఆమె కూడా ఏదో విధంగా మరణించి ఉంటే...."

అతణ్ని మధ్యలో ఆపి—"చావు మనిషికి శిక్షకాదు. శిక్షకు అంతం. శిక్షకు అంతం లభించే వరకూ కొందరు జీవించక తప్పదు." అందామె.

అతడు నిట్టూర్చి—"దారి తప్పి - కోరుకున్న జీవితానికి దూరం కావడం మినహా-జీవితంలో ఎంపీ నాయుడు గారేమి సాధించారో నా కర్థంకావడంలేదు" అన్నాడు.

"నాన్నలాంటి ఎంపీ లింకా చాలామందుంటారు. వారికి గుణపాఠంగా, హెచ్చరికగా - నాన్న కథను మనం నవలగా రాద్దాం-" అందామె.

"నవలకు పేరేం పెడదాం?"

"మిస్ మిస్టరీ —" అందామె.

"అరే - మిస్ మిస్టరీ విషయం మరిచేపోయాం...."

అంటూ అతడు జేబులోంచి ఓ వస్తువు తీశాడు. అది పాకెట్ కాల్క్యులేటర్లా, టెలివిజన్ రిమోట్‌కంట్రోల్లా ఉంది చూడ్డానికి.

అతడు రిమోట్ కంట్రోల్లో ఓ మీట నొక్కాడు.

వారి ఎదురుగా ఉన్న నల్లపెట్టిలో—అటూ యిటూ తీయబడి ఉన్న రెండు సొరుగులూ బయటకు రాగా-ఉన్న సైజుకు మూడింతలయిందది.

"మిస్ మిస్టరీ తనంతట తనే బైటకు రాగలదంటావా?" అన్నా డతడు.

వారు చూస్తూండగా పెట్టె మూత తెరుచుకుంది.

మిస్ మిస్టరీ లేచి నిలబడింది.

"నాకోసారి వందనను చూడాలనుంది." అందా యువతి అతడితో.

రిమోట్ కంట్రోల్లో అతడో మీట నొక్కాడు. ఉన్నట్లుండి మిస్ మిస్టరీ ముఖంలో రకరకాల మార్పులు నచ్చి క్రమంగా ఓ రూపం స్థిరపడింది.

ఆమె యిప్పుడు అచ్చం వందనలాగే ఉంది.

అతడు సరదాగా మీటమీద మీట నొక్కుతున్నాడు.

ఒకసారి ఆమె చేయి గాలిలోకి విడిపోతోంది. ఒకసారి ఆమె తల పైకిలేచి నవ్వుతోంది.

"మీట నొక్కితే మన భావతరంగాలు ప్రసారమై-మనం కోరిన మాటలు కోరిన గొంతుతో పలుకగల ఈ బంగారు బొమ్మ-బొమ్మకాక మనిషైతే ఎంత బాగుండేది?" అన్నాడతడు నిట్టూర్చుతూ.

"నిజమే-దగ్గిర్లో రిమోట్‌కంట్రోల్ అవసరం లేకుండా ఈ బొమ్మ తనకు తానే మసలగలిగితే ఎంతో బాగుండేది. కుమారస్వామి వద్దకు వందన రూపంలో వెళ్ళినపుడు

నాన్న నియమించిన మనిషిని కూడా పంపాల్సి వచ్చింది - కంట్రోల్ చేయడానికి! నాన్న నియమించిన మనిషి కాబట్టి కుమారస్వామి అతణ్ని నమ్మాడు. తర్వాత కుమార స్వామి బారినుంచి అతణ్ని మనం రక్షించలేకపోయాం."

"ఛోటేలాల్‌కి నీవు దొరికిపోయినపుడు — నిన్ను రక్షించడానికి నాయుడుగారే రిమోట్ కంట్రోల్ చేశారు. ఆయన తన కారు డిక్కీలో మిస్ మిస్టరీనుంచి తెచ్చారు. అప్పుడు మనందరికీ ఎంత టెన్షన్! అదే—రిమోట్ కంట్రోల్ అవసరం లేకపోతే-ఇంకా బాగుండేది...."

"ఇది నాన్న-తన పతనం కోసం తనే చేయించుకున్న అద్భుత విశేషం....ఇది మనిషి చేతిలో మర బొమ్మ కాకుండా నిజంగానే అద్భుత శక్తులున్న మిస్ మిస్టరీ అయుంటే-దేశంలో ఎక్కడెక్కడి నేరస్థుల్నీ - ఏరి పారే యొచ్చుగదా!" అందామె.

"జరగనివాటి గురించి ఆలోచనెందుకు? ప్రస్తుతం మనకు అలసటగా ఉంది కాబట్టి మిస్ మిస్టరీచేత మనం అవసరమైన పనులు చేయించుకుందాం" అన్నాడతడు.

"అవసరమైన పనులంటే?"

"చూడు .." అంటూ అతడు రిమోట్ కంట్రోల్ మీటర్లో ఒకటి నొక్కాడు.

అప్పుడు మిస్ మిస్టరీ - తోలుపెట్టెను దగ్గరగా తోసి చిన్నది చేసి గదిలో ఓ మూలగా పెట్టింది. ఆ తర్వాత యిల్లంతా ఊడ్చి శుభ్రం చేసింది. మంచాలు దులిపి పక్కలు వేసింది. తర్వాత వంటింటిలోకి వెళ్ళి వంట ప్రారంభించింది.

"పచ్చికూరలేం ఉన్నట్లు లేవు...." అందా యువతి.

"ఉప్మా చేస్తుందిలే.... ఉల్లిపాయల్లేకుండా...." అన్నా డతడు.

వంటింటిలోంచి ఉప్మాపోపువాసన ప్రారంభమయింది.

అతడు ముక్కు పుటా లెగరేస్తూ—"అబ్బా! ఇది సామాన్యపు వంటకాదు. కంప్యూటర్ వంట. ఎన్నిసార్లు చేసినా ఒకే రుచి వస్తుంది." అన్నా డతడు.

"అదెలా సాధ్యం?" అందామె.

"అది మనం కమాండివ్వడంలో ఉంటుంది. ఉప్మా చేయమని కమాండిచ్చే ముందు మన మామెకు ఉప్మా ఎలా చేయాలో ప్రోగ్రాం యివ్వాలి. ఒకసారి ప్రోగ్రాం యిస్తే మనం కావాలనుకున్నంతకాలం అది మెమరీలో ఉండిపోతుంది. కంప్యూటర్ మనకులా ఏ ఉప్పో, పప్పో మర్చిపోవడం జరుగదు....చూశావుగా ఆమె ముఖంలో కుమారస్వామి కూతురు, వందన, నీవు వగైరా నాలుగు రూపాలు ప్రవేశపెట్టాం. మనం కమాండిచ్చినప్పుడల్లా కోరిన రూపం ఎంత పెర్ఫెక్టుగా వచ్చిందో నీకూ తెలుసు."

"నువ్వెంత చెప్పినా నాకిది సైన్సుచేసిన బొమ్మ అని పించదు. మానాన్న మాటలే నిజమనిపిస్తుంది. ఆయన తన రెండో భార్య కీ బొమ్మ గురించి—చనిపోయిన నీ తల్లి లక్ష్మి ఆత్మ అని చెబుతానన్నాడు. అదే నిజ మేమో!" అందామె.

"విచిత్రా! అదే నిజమైతే—ఈ రిమోట్ కంట్రోలుతో తంటాలుపడే బదులు మన మింకా గొప్ప విజయాలు సాధించి ఉండేవాళ్ళం...." అన్నా డతడు.

ఈలోగా మిస్‌మిస్టరీ వాళ్ళిద్దరికీ ప్లేట్లలో ఉప్మాలు సర్ది తెచ్చింది. ఇద్దరూ ఉప్మాతిని — "సుపర్బ్" అన్నారు.

సమాప్తం

నేరస్థుల దీవెనలు

ఎస్.డి.వి. అజీజ్

"ఏమిటీ ఆలోచిస్తున్నావు?"

నా పూర్వీకుల నుంచి నాకు స్థిరాస్థిగా సంక్రమించిన కొయ్య మంచంపై వెల్లకిలా పడుకొని తలగడగా అర చేతులు తలక్రింద ఆన్చి నా గురించి ఆలోచించుకొంటున్న నేను సుపరిచితమైన ఆ పిలుపు విని, లేచి కూర్చొని దృష్టి ముందుకు సారించాను.

ఎదురుగా ఏకపాదం!

సిగిరెట్లు విపరీతంగా తాగడంవల్ల నల్లబారిన అతని పెదాలపై చెరగని చిర్నవ్వు!

"ఏం బ్రదర్? ఏంటికథ? చాల సీరియస్‌గా ఆలోచిస్తున్నట్టున్నావు?" మందహాసం చేస్తూ వచ్చి నాపక్కన కూర్చున్నాడు ఏకపాదం.

"ఏంలేదు ఏకపాదం! రెండ్రోజులనుంచి ఈ మెదడుకు పనిలేదు కదా! ఏమీ తోచక.... వూరికే ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాను" అతని పైకి సన్నని చిర్నవ్వు రువ్వుతూ చెప్పాను. ఏకపాదం నాకంటే అయిదారేళ్ళు పెద్ద. అయినా అతణ్ణి నే పేరుతోనే పిలుస్తాను. అలా పిలువడంలోనే తనకు ఆనందముంది అంటాడు అతను.

"నీ మెదడుకు పని కల్గించే కేసొకటి పట్టుకొచ్చాను" సిగిరెట్ వెలిగిస్తూ అన్నాడు ఏకపాదం.

"ఏం కేసు? మర్డరా!?" కుతూహలంగా అడిగాను.

"మర్డర్ కాదు. కిడ్నాపింగ్ కేసు."

"ఎవర్ని కిడ్నాప్ చెయ్యాలి?" నా కనుబొమలు పైకెగదోసి అతడివంక పరీక్షగా చూస్తూ అడిగాను.

"ఈ వూర్లో రాజశేఖరమనే పెద్ద బిజినెస్ మాగ్నట్‌కు ఒక్కగానొక్క కొడుకున్నాడు. పేరు రోహిత్. బాగుంది కదూ పేరు?"

"ఊఁ—తర్వాతది చెప్పు!" నేకూడ ఓ సిగరెట్ ముట్టిస్తూ చెప్పాను.

"అతను ఓ అమ్మాయిని ప్రేమించాడు. పేదింటి అమ్మాయే. పేరు విశాలి: ఆ అమ్మాయికూడ ఇతన్ని ప్రేమించిందట! అయితే ఈ విషయం తెలిసిన ఆమె తల్లిదండ్రులు అతన్ని కాదని, 'కులం సంప్రదాయం'

అంటూ వేరొక సంబంధం నిశ్చయం చేశారట! ఆ అమ్మాయిని బయటికి వెళ్ళనీయకుండా కట్టుదిట్టాల్లో వుంచారట. రేపే పెళ్ళట!

"ఆ అమ్మాయిని ఎలాగయినా సరే, ఆ చెరనుంచి విడిపించండి! అంటూ శతవిధాల బ్రతిమలాడాడు. ఒప్పేసుకున్నాను. మనం ఎంతడిగినా ఇవ్వడానికి సిద్ధంగా వున్నాడు. బేరం పదివేలకు సెటిల్ చెయ్యాలనుకొంటున్నాను. నువ్వు 'ఊఁ' అంటే వెళ్ళి అడ్వాన్సు పుచ్చుకొచ్చేస్తాను. రేపెళ్ళి మన పని పూర్తి చేద్దాం! ఏమంటావు?"

ఆలోచనలో పడుతూ అడిగాను.

"ఆ అమ్మాయి ఏమాత్రం చదువుకుంది?"

"బి.ఎ. దాకట. ఆ అమ్మాయి ఇతను క్లాస్‌మేట్స్ కూడట."

"ఊహుఁ. అలాగా! ఇంతకు ఎక్కడ వుంటుంది ఆ అమ్మాయి?"

"ఇక్కడికి 30 కిలోమీటర్ల దూరంలో వున్న నంది కొట్కూరులో...."

"చిరునామా"

"సంగయ్య పేటలోని మూడవ వీధిలో మూడవ ఇల్లు. ఒప్పేసుకోమంటావా?"

అంగీకారంగా తలూపి నా మస్తిష్కానికి పని కలిగించాను.

2

నేను ఏ నేరం చేసినా, ఆ నేరానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతే రంగంలోకి దిగుతాను, పకడ్బందీగా ప్లాన్ సిద్ధంచేసుకుని. అందుకే నేనూ

ఏకపాదం టేకప్ చేసిన ఏ కేసు కూడ ఫెయిలవలేదు. పోలీసులకు మా ఆనవాళ్ళు దొరకలేదు.

'ఇదికూడా అంతే!'

ముందుగా ఆ వూరు వెళ్ళి అక్కడి వాతావరణం ఓ మారు పరిశీలించి రావాలనిపించింది. ఆదే విషయం ఏకపాదంతో చెప్పాను. అతను ఒప్పుకొన్నాడు.

ఇద్దరం ప్రయాణమయ్యాం!

మేము చేరుకోవలసిన వూరు 30 కిలోమీటర్ల దూరం కంటే ఎక్కువ లేదు కాబట్టి, మా ప్రయాణం అరగంట కంటే ఎక్కువసేపు పట్టలేదు. ఏకపాదం చెప్పిన వివరాలన్నీ గుర్తుకు తెచ్చుకొన్నాను. సంగయ్యపేట మూడవ వీథిలోని మూడవ ఇంటిముందు ఓ రెండుసార్లు పచార్లు చేశాము.

మర్నాదేకద పెళ్ళి! పెళ్ళి సందడితో కోలాహలంగా వుంది ఆ ఇల్లు. అక్కడ్నుంచి కొద్దిదూరం నడిచి నాలుగు రోడ్ల కూడలి చేరుకుని అక్కడున్న మిడిల్‌క్లాస్ 'టీ' హోటల్‌లోకి వెళ్ళి కాసేపు కూర్చొని 'చా సేవిస్తూ మా ముందు కూర్చొని 'టీ' తాగుతున్న ఒకతన్ని ఉద్దేశించి అడిగాము.

"ఈ వూర్లో ఎన్ని పేట లున్నాయండి?"

ఆ వ్యక్తి మా ఇద్దరిపంక ఎగాదిగా చూసి దేనికన్నట్టు కళ్ళెగరేసాడు.

"మేము జర్నలిస్టులం....ఇక్కడి రోడ్ల పరిస్థితి ఏం బాగోలేదని విని వచ్చాము. మేము విన్నట్టు నిజంగా ఇక్కడి రోడ్లు యేమాత్రం బాగోలేవు. అంతా మెటల్ రూట్. గోతులు....గతుకులు....మేము వచ్చిన రూట్ తప్ప...." అంటూ ఏదో కుంటిసాకు చెప్పాను.

పాపం! అతను నమ్మినట్టున్నాడు. ఆ ఊరి గురించి అన్నీ వివరంగా చెప్పుకొచ్చాడు.

"ఇట్నుంచి స్ట్రెయిటుగా వెళితే పాత బస్టాండ్ వస్తుంది. ఇదిగో అక్కడ అగుపిస్తుందే అదంతా సంగయ్య పేట అంటారు. ఇట్నుంచి లెఫ్ట్‌కు వెళితే కాలేజీ రోడ్ వస్తుంది. రైట్‌కు వెళితే సాయిబాబా పేట వస్తుంది. అట్నుంచే నంద్యాల రూట్ కూడ వుంది...." ఇలా మొదలుపెట్టి ఆ వూరిగురించి చాలా చెప్పాడు. ప్రస్తుతం అవన్నీ అప్రస్తుతం. అతను మొదట చెప్పిన వివరాలల్లో నా ప్లాన్‌కో ప్లస్‌పాయింట్ దొరికింది. అంతే చాలు!

సాయంకాలానికే తిరిగి మా స్వస్థలం చేరుకొన్నాము. ఆ రోజు రాత్రి నన్ను రాజశేఖరం సుపుత్రుడు రోహిత్ దగ్గిరికి తీసుకెళ్ళాడు.

రోహిత్ వయసు పాతిక ముప్పై మధ్య వుండొచ్చు. మనిషి హుందాగా అందంగా వున్నాడు.

ఇంత ధనవంతుడ్ని, అందగాణ్ణి కాదనుకొని విశాలి తలిదండ్రులు తమ తాహతుకు తగ్గ సంబంధాన్నే కుదిర్చి పెళ్ళిచేయడం మూర్ఖత్వ మనిపించింది. ఆ విషయమే రోహిత్‌తో చెప్పాను. అతనుకూడ అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

నా పథకం అతనికి వివరించాను.

అతని కళ్ళు మిలమిల మెరిశాయి!!

3

మర్నాడుదయం....

పథకం ప్రకారం ఇద్దరం మా రూపురేఖలు మార్చుకుని, రాజశేఖరంతో ఏర్పాటు చేయించుకొన్న జీపులో తొమ్మిదింటికి నందికొట్కూర్ చేరుకొన్నాము.

తొమ్మిది-పదికి పెళ్ళి.

జీపు నేరుగా పోనిచ్చి ఆ ఇంటిముందు ఆపాము.

లోపల పెళ్ళి వాయిద్యాలు మ్రోగుతున్నాయి....

పెళ్ళిజనం ఆనందోత్సాహంతో అటు ఇటు పరుగులు తీస్తున్నారు.

జీపునుంచి క్రిందికి దిగాము.

పెళ్ళి జనం మావైపే దృష్టి మళ్ళించారు. వారిలో నుంచి ఒకరు హడావుడి పడుతూ మా ముందుకొచ్చి సాదరంగా లోపలికి ఆహ్వానించాడు "రండి....రండి" అంటూ. పెళ్ళి పందిరి ముందు వేసున్న కుర్చీలోలలో మమ్మల్ని ఆశీనుల్ని చేసి అడిగాడు అతను "మీరు....!"

"విశాలి స్నేహితురాలు లీనజ అన్నయ్యలం" మాకు తోచిన సమాధానం చెప్పాము.

అతని కళ్ళు సంతృప్తితో మెరిశాయి.

"లీనజ రాలేదేం?" అని అడుగుతా దనుకొన్నాను. కాని అడగలేదు.

"మీరు?" అతన్ని ఉద్దేశించి అడిగాను.

"ఆమె మావయ్యను. నా పేరు గుర్నాధం" మా పక్కనే కూర్చొంటూ అన్నాడు. పెళ్ళి పందిరి వయిపు చూశాము. వరుడు పీటలమీద కూర్చొని 'తాళి' కట్టడానికి సిద్ధంగా వున్నాడు. పురోహితుడు వేదకాలంనాటి పెళ్ళి మంత్రాలు బిగ్గరగా వల్లిస్తున్నాడు.

కొద్దిసేపు గడిచింది....

పెళ్ళిముహూర్తం సమీపించింది.

"పెళ్ళిముహూర్తం దాటిపోతోంది. అమ్మాయిని తీసుకు రండి!" గట్టిగా కేకేసి చెప్పాడు పూజారి.

మేలిముసుగు మాటున సిగ్గుదొంతరలు కమ్ముకోగా,

చిన్నగా నడక సాగిస్తూ వచ్చింది నవవధువు అయిన విశాలి. ఆమెను నడిపించి తెచ్చిన ఆమె స్నేహితురాళ్ళు పెళ్ళిపీటలపై కూర్చోబెడుతుండగా, 'ఇదే మంచి అవకాశం' అన్నట్టుగా ఏకపాదం వైపు చూశాను.

ఏకపాదం లేచి నిలబడ్డాడు. జేబులోనుంచి క్లోరోఫాంతో నింపిన కర్చీఫ్ అది. ఓమారు చుట్టూ కలియజూసి ఇంకేమాత్రం ఆలస్యం చెయ్యక ఒక్క ఉదుటున వెళ్ళి విశాలి ముఖంపై కర్చీఫ్ అదిమి పట్టాడు.

అక్కడున్నవారు కల్లో సైతం ఊహించని పరిణామం!

అదే సమయానికి నేను కోటు జేబులో నుంచి పిస్టల్ తీసి గాలిలో పేల్చాను.

పెళ్ళి పందిరిలో కలకలం!

జనం చెల్లాచెదు రయ్యారు - గావు కేకలు! పెడబొబ్బలు!!

విశాలి చుట్టూ చేరివున్న ఆమె స్నేహితురాళ్ళు ప్రాణభయంతో గట్టిగా కేకలు వేస్తూ ఎటుతోస్తే అటు పారిపోయారు. స్పృహ తప్పిన విశాలని భుజాన వేసుకొని నన్ను సమీపిస్తుండగా కొంతమంది యువకులు అతన్ని కమ్ముకోబోయారు.

నేను మరొకమారు తుపాకి గాల్లో పేల్చాను. వారూ చెల్లాచెదురయ్యారు. 'ఇంకేమాత్రం ఆలస్యం చేసినా పరిస్థితి విషమిస్తుంది పద' అంటూ జీపు దగ్గరికి పరుగు తీశాను ఏకపాదం వెంట. ఏకపాదం విశాలిని జీపులోకి తోసి జీపు స్టార్టు చేశాడు. జీపు చుట్టూ మళ్ళీ జనం చుట్టుముట్టారు.

"ఎవరు మీరు? ఏమిటీ ఘోరం?" గొంతు చించుకుని

అరిచారు.

ఈమారు గాలిలో పేలిస్తే లాభం లేదనుకొని "జీపుకు అడ్డంగా నిలబడ్డారో మీ ప్రాణాలు తీస్తాను, ఖబడ్దార్!" అంటూ హెచ్చరించాను.

నా హెచ్చరిక అంతగా పనిచేసినట్టు లేదు. ముందుకు రాబోయారు. ఇక కాల్పులు గావించక తప్పదనిపించింది. వారి ప్రాణాలు పోకుండా శరీరం మాత్రం గాయపడేలా కాల్పులు సాగించాను.

భయవిహ్వాలులై ఆక్రందనలు చేస్తూ చెదిరిపోయారు. మార్గం ఏర్పడింది. ఏకపాదం ఇంకేమాత్రం ఉపేక్షించక జీపును రేసుగుర్రంలా ముందుకు పోనిచ్చాడు. కొన్ని సెకెన్ల వ్యవధిలోనే సంగయ్యపేట దాటిన మా జీపు నా సూచన మేరకు సాయిబాబా పేటగుండా నంద్యాల రోడ్డు వయిపు పరుగులు తీసింది. ఇదంతా కేవలం కొన్ని నిముషాల వ్యవధిలోనే జరిగిపోయింది.

నంద్యాల చేరుకొన్న మా జీపు తిరిగి మా గమ్యస్థానం చేరుకోవడానికి అట్టేసేపు పట్టలేదు. పదకొండు గంటల ప్రాంతాన మా జీపు రాజశేఖర గెస్టుహౌస్ పోర్టికో ముందు ఆగింది. స్పృహ తప్పిన విశాలిని తీసుకెళ్ళి ముందున్న హాల్లో సోఫాపై పడుకోబెట్టాము. రోహిత్ బయటికొచ్చి మేము చేసిన పనికి కృతజ్ఞతలు తెలుపుతూ మా ఒప్పందం ప్రకారం కుదుర్చుకున్న పది వేలు కాక పదిహేను వేలు చేతికిచ్చాడు.

"మీ ఈ సహాయం నా జన్మలో మరచిపోలేను" అంటూ, అతన్నుంచి శెలవు తీసుకుంటూ అడిగాను నవ్వుతూ—

"పెళ్ళెప్పుడు?"

"రేపు....వస్తారా?"

"రాము."

"దేనికి?" ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ అన్నాడు రోహిత్.

"నూరేళ్ళపాటు జీవించబోయే జంట మీది. మాలాంటి నేరస్థుల దీవెన మీకు అశుభమే అవుతుంది...." అనేసి ఏకపాదాన్ని తీసుకుని ఆ గెస్ట్‌హౌస్ దాటి బయటకి వచ్చేశాను.

4

ఏదైనా నేరం చేస్తే, అందులో విజయం సాధిస్తే, ఆ రోజంతా దానికి సంబంధించిన ఆలోచనలే నా మస్తిష్కాన్ని వేలుపురుగులా తొలుస్తూ వుంటాయి. అందుకే ఆ ఆలోచనల బారి నుంచి తప్పించుకోవడానికి తాగుడు అలవాటు చేసుకున్నాను. ఫుల్‌గా తాగేసి పడుకుంటే, మళ్ళా ఉదయానికి - ఫ్రెష్ అవుతాను.

బాగా పొద్దెక్కాక తర్వాత నిద్ర లేవడం అలవాటు నాకు. కాని ఆ రోజు ఉదయాన్నే వచ్చి నిద్రలేపాడు ఏకపాదం.

"కొంప మునిగింది బ్రదర్....లే!" అంటూ.

"ఏమయ్యింది?" దిగ్గున లేచి కూర్చున్నాను.

ఎట్నుంచి పరుగెత్తుకొచ్చాడో ఏమో! ఆయాసంతో రొప్పుతూ చెప్పుకొచ్చాడు. "వాడు—ఆ రోహిత్....ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోలేదు. రేప్‌చేసి చంపేశాడు."

"ఆఁ...." ఒక్కసారిగా నా గుండెలు గుభిల్లుమన్నాయి. నా శరీరాన ప్రకంపన. ఏకపాదం మళ్ళా చెప్పడం మొదలుపెట్టాడు.

"అసలు ఆ అమ్మాయి వాడిని ప్రేమించలేదట. ఆ

అమ్మాయిపై మోజుతో, వాడుకొని వొదిలేసే తలంపుతో వెంట పడ్డాడు. ఆ అమ్మాయి నాడి ఉద్దేశాన్ని గ్రహించి 'ప్రేమలేదు దోమలేదు' అని తిట్టేసి దూరంగా వుంటూ.... చదువై పోగానే తన వూరు వెళ్ళిపోయింది. తను తిరస్కరించినందుకు, తన కోరిక తీర్చనందుకు వాడు ఆ అమ్మాయిపై పగబట్టాడు.

ఆ అమ్మాయికి పెళ్ళవుతుందడం తెలుసుకుని ఉపాయంగా మనకు కల్లబొల్లి కబుర్లు చెప్పి మాయమాటలతో నమ్మించి మనతో పని పూర్తి చేయించుకున్నాడు. తన కోరిక తీర్చుకున్నాడు. ఆ అమ్మాయిని చంపేసి తిరిగి ఆమె ఇంటికే పార్శిల్‌గా పంపించాడు. ఇలా వీడిచేతిలో ఎంతోమంది అమ్మాయిల జీవితాలు నాశనమయ్యాయి" ఉద్వేగంతో చెప్పసాగాడు ఏకపాదం.

"ఇదంతా నీ కెవరు చెప్పారు?" నొసలు చిట్లించి అడిగాను.

"గెస్ట్‌హౌస్ వాచ్‌మెన్ రాజయ్య వచ్చి చెప్పాడు.... ఆ దుర్మార్గుని ఆగడాలకు అంతులేకుండా పోతూంది" కన్నీరుపెట్టి వగచాడు.

ఏకపాదం చెప్పింది విన్న నాకు రక్తం కుత కుత వుడికిపోయింది. మావల్ల ఓ నిండుప్రాణం, మానం ఓ కిరాతకుడి చేతిలో నాశనమైనందుకు మనసులో ఓ మూల సన్నని బాధ కూడా మొదలయ్యింది.

* * *

రెండ్రోజుల తర్వాత ....

"బ్రదర్ ఈ వార్త చదివావా!" అంటూ పరుగెత్తుకొచ్చి నా ముందు వాలాడు ఏకపాదం!

"ఏ వార్త?" నింపాదిగా ప్రశ్నించాను నవ్వి.

"ఈ వార్త!" అంటూ స్థానిక దినపత్రిక 'చాకిరేవు' ఫ్రంట్ పేజి నా ముందుంచాడు. ఆ పేజివైపు దృష్టి మళ్ళించాను.

"ప్రముఖ బిజినెస్ మాగ్నెట్ రాజశేఖరం ఏకైక కుమారుడు శ్రీ రోషిత్‌కుమార్ దారుణ హత్య!"

ఆ హెడ్‌లైన్ చదివిన నాకు నవ్వొచ్చింది. నవ్వేశాను గట్టిగా "హ్హ....హ్హ....హ్హ....హ్హ...."

నా నవ్వును చూసి విస్తుపోతూ అడిగాడు ఏకపాదం.

"ఎందుకలా నవ్వావు?"

"ఇన్నేళ్ళ తర్వాత తొలిసారిగా మన వృత్తికి న్యాయం చేకూర్చినందుకు." నా జవాబు అర్థంకాలేదు కాబోలు. ఏకపాదం ముఖం కొశ్చెన్‌మార్క్ అయ్యింది. □

కానికాలం?

ఇంటరాగేషన్

బొమ్మిడి అచ్చారావు

రాత్రి పదకొండున్నర గంటలయింది.

సెకండ్ షో సినిమాకి వెళ్ళిన సుధాకర్ సినిమా బోర్ కొట్టడంతో మధ్యలోనే లేచి వచ్చేశాడు. సాధారణంగా సినిమా మధ్యలో ఎప్పుడూ బయటికి రావటం అతని కిష్ట ముండదు. కాని, మరీ దారుణమైన, అసహజమైన, అసం దర్భమైన ఇతివృత్తంతో పేలవమైన నటీనటుల నటనతో

అతని సహనానికి పెద్ద అగ్నిపరీక్షలా నిలబడిందా చిత్రం.

భరించలేక బయటికొచ్చి స్కూటర్ స్టాండునించి బయటకు తీసి ఇంటికి బయలుదేరాడు.

డిసెంబరునెల చలిగాలి రివ్వున చెవుల్లోనించి దూసుకు పోయి శరీరాన్ని ఒణికిస్తోంది. స్కూటర్ వేగానికి చలి మరింత ఉధృతంగా, శరీరాన్ని కత్తితో కోస్తున్నట్లుగా వుంది. సుధాకర్ వుంటున్నది దిల్‌షుక్‌నగర్‌లో. అతను ఆబిడ్స్‌లోని థియేటర్‌లో పిక్చర్ చూసి వస్తున్నాడు.

కోఠీ మీదుగా బాదర్‌ఘాట్ బ్రిడ్జికి పోతున్న సమయంలో బ్రిడ్జి దిగువ ఓ అందమైన అమ్మాయి అతని స్కూటర్‌ముందు నిల్చుని చేయి అడ్డుపెట్టింది.

సడన్‌బ్రేక్‌తో స్కూటరాపుజేశాడు సుధాకర్.

అర్ధరాత్రి. అసలే జనసంచారం అంతంత మాత్రంగా వుండే ఆ ప్రాంతంలో క్రీనీడలో నిల్చుని ఓ అందమైన అమ్మాయి అంత ధైర్యంగా ఒంటరిగా వుండటం చాలా అరుదైన విషయం.

హెడ్‌లైట్ వెలుగులో పరిశీలనగా చూసిన సుధాకర్ ఆశ్చర్యంగా, అబ్బురంగా ఆమెనే చూస్తూ వుండి పోయాడు కాసేపు.

"ప్లీజ్........కాస్త దిల్‌షుక్ నగర్ వరకు లిఫ్ట్ యిస్తారా?" అనడిగిందామె యెంతో తియ్యటి కోకిల కంఠంతో.

సుధాకర్ వెంటనే "విత్ ప్లజర్!" అన్నాడు ఉత్సాహంగా.

ఆమె ఛెంగున యెగిరి కూచుంది వెనుక సీటుమీద.

సుధాకర్ మనసు ఆనందంగా ఉరకలు వేస్తోంది. అర్ధరాత్రి అందమైన అమ్మాయి ఒంటరిగా ఎదురుకావటం,

తన స్కూటరు వెనుక కూచుని సుతారంగా తన వీపుకి మెత్తగా తగుల్తూ, స్పర్శా సుఖాన్నందించటం అతను ఎదురుచూడని మధురానుభవం!

ఆమె ఒంటిమీది నుంచి ఖరీదైన స్ప్రే పరిమళం అతని నాసికాపుటాల్ని సోకి అతనిలో ఏవేవో ఆలోచనల్ని రేకెత్తిస్తోంది. కొత్త లోకాల్లో విహరింపజేస్తోంది.

భార్య వారంరోజుల క్రితమే మొదటి కాన్పుకి పుట్టింటికి వెళ్ళింది. వారంరోజులపాటు విరహంతో వేగిపోతూ, పిచ్చెత్తినట్టుంటే యీ రోజే పిక్చరుకి వెళ్ళాడు. అది తన సహనాన్ని పరీక్షించటంతో భరించలేక బయటికొచ్చేశాడు.

అయితే, అదే తనకి మధురమైన యీ అనుభవాన్ని రుచి చూపించింది. ఈమె యెవరో మెల్లగా ఎంక్వయిరీ చేసి .. వీలైతే మాటల్లో పెట్టి తన యింటికి తీసుకువెళ్తే....!?

ఛ, ఛ....తను చాలా ఘోరంగా ఆలోచిస్తున్నాడు. ఆమె చూడబోతే పెద్దింటిపిల్లలా, మర్యాదస్తురాలిలా బాగా చదువుకున్నదానిలా వుంది. తన ఆలోచనల్ని పసిగట్టిందంటే నడిరోడ్డుమీదే ఘనసన్మానం చేసేస్తుంది. గస్తీపోలీసుకి అప్పగించేయగలదు.

స్కూటర్ మలక్‌పేట కాలనీ మీదుగా దూసుకుపోతోంది. ఆమె నేమీ ప్రశ్నించే సాహసం చెయ్యలేకపోతున్నాడు సుధాకర్. ఆమె మెత్తని అందాలు అప్పటికి చాలాసార్లు తన వీపును ముద్దుపెట్టుకుని తన మనసుని తన కంట్రోల్లో లేకుండా చేస్తున్నాయి.

"ఎక్కడ ఆపమంటారు?" అనడిగాడు చివరికి గొంతు పెగల్చుకుని సుధాకర్. అలా అడగటం కోసం అతడు

కుడభుజంమీదుగా ఓరగా చూశాడు. అప్పుడామె ముఖం అతనికి చాలా దగ్గిరగా దాదాపు తాకుతున్నంత సమీపంలో తళుక్కున మెరిసింది.

ఆమె చిన్నగా నవ్వి "ఏం, నన్ను భరించటం కష్టంగా వుందంటోందా మీ స్కూటరు?" అంది.

"అబ్బే. అదేం లేదండి....ముందుగా తెల్సుకుంటే సరాసరి మీ యింటికి చేర్చవచ్చునని...."

"ఇక్కడ ఆపెయ్యండి" అందామె చటుక్కున.

సడన్‌గా బ్రేక్ మీదికి కాలుపోయింది. కీచుమని శబ్దం చేశాయి చక్రాలు. ఆ అదురుకు ఆమె అతన్ని దాదాపు కౌగలించుకున్నంత పని చేసింది. ఇంజన్ ఆగిపోయింది.

సుధాకర్ గుండె లయతప్పి కొట్టుకున్నది. ఆమె చిరునవ్వుతో గిలిగింతలు పెడుతున్నట్టుగా అతని కళ్ళలోకి చూసి. మెరుపులా మాయమైపోయింది క్షణాల్లో.

వెచ్చటి నిట్టూర్పు అతని గుండెల్లోంచి తన్నుకొని వచ్చింది. యాంత్రికంగా స్కూటర్ స్టార్టు చేశాడు. పది గజాలు ముందుకు వెళ్ళాడో లేదో వేగంగా అతన్ని దూసుకుంటూ పోలీస్ జీప్ ముందుకువెళ్ళి అతని కడ్డుగా రోడ్డు మీద ఆగిపోయింది.

బిలబిలమంటూ ఇద్దరు కానిస్టేబిల్స్, ఓ ఇనస్పెక్టరు దానిలోనించి దిగి రోడ్డుమీద నిల్చున్నారు.

సుధాకర్ సడన్ బ్రేక్‌తో స్కూటర్ నాపాడు, ఆశ్చర్యంతో తలమునకలవుతూ.

ఇనస్పెక్టర్ సూటిగా సుధాకర్ ముఖంలోకి చూస్తూ, "ఇంతదాకా నీ వెనకనున్న అమ్మాయి ఏదీ?" అన్నారు.

పిడుగుపాటులా ధ్వనించా యా మాటలు. విభ్రాంత

పోయి అతనివంక చూశాడు సుధాకర్.

"ఏ అమ్మాయి....!?" అన్నాడు గొంతు పొడారి పోగా.

"ఇంతదాకా నిన్ను కరిచిపెట్టుకుని నీ నడుము కతుక్కు పోయిన సుందరాంగి...."

"సారీ ఇనస్పెక్టర్ ... ఆమె ఎవరో నాకు తెలీదు. లిఫ్ట్ అడిగితే ఇచ్చాను. అదిగో ఎలక్ట్రిక్ పోల్ దగ్గిర దిగి పోయింది కుడిపక్కనున్న సందులోకి వెళ్ళటం చూశాను" తడబాటును కప్పిపుచ్చుకుంటూ చెప్పాడు సుధాకర్.

"ఉహూ, ఆ అమ్మాయెవరో తెలియకుండానే నీ వెనక ఎక్కించుకుని ఇక్కడిదాకా తీసుకువచ్చావన్న మాట! మీ రిద్దరు తోడుదొంగలు. ఆమె హత్యచేసి బయటికొచ్చే సరికి స్కూటర్‌తో సిద్ధంగా బయట నిల్చున్నావు. రాగానే వెనక ఎక్కించుకుని ఉడాయించావు. మేం ఫాలో అవు తున్నామని గ్రహించగానే అర్జంటుగా ఆమెను మాయం చేసేసి, ఏం ఎరగనట్టు ఒక్కడివీ స్కూటర్ రైడ్ చేసు కుంటూ పోతున్నావ్...."

ఇనస్పెక్టర్ ఏదో చెప్తున్నాడు కాని సుధాకర్‌కి 'హత్య' అన్నమాట తర్వాత ఇంకేమాటలూ వినిపించ లేదు. అప్పటికే అతని మస్తిష్కం మొద్దుబారిపోయింది.

"ఇనస్పెక్టర్, నాకేం తెలియదు. ఆమె ఎవరో ఎలాంటిదో నాకు తెలీదు. లిఫ్ట్ అడగ్గానే అంగీకరించాను. దిల్‌షుక్ నగర్ వెళ్తున్నానని కాస్త డ్రాప్ చెయ్యమని కోరింది. నేనుండేదీ దిల్‌షుక్ నగరే కాబట్టి అభ్యం తరం చెప్పాల్సిన అవసరం కనిపించలేదు."

"ఓహో....మరి దిల్‌షుక్ నగర్ ఇంకా అర కిలో

మీటరు దూరముండగానే దిగిపోయిందేం మరి!?—"

ఇనస్పెక్టర్ సూటిగా అడిగిన ప్రశ్నకు సుధాకర్ వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు.

"సార్ ... నామాట నమ్మండి.... నాకేం తెలియదు...." చేతులు జోడించాడు సుధాకర్.

"ఉహూ, అలాగేం? మామూలుగా మాటలతో చెప్పని వాళ్ళచేత విషయాల నెలా రాబట్టాలో మా పోలీసులకి ఎవరూ చెప్పనక్కర్లేదు. స్కూటర్ నలా వదిలేసి జీపెక్కు-కమాన్" బలవంతంగా రెక్కపట్టి గుంజాడు ఇనస్పెక్టర్.

ముందుకు తూలి రోడ్డును ముద్దెట్టుకోబోయి అదుపు చేసుకున్నాడు సుధాకర్. అతనికి నిస్సహాయతతో, అవమానంతో దుఃఖం తన్నుకొచ్చేస్తోంది. ఎదురుచూడని షాక్ తనకి!

మారు మాటాడకుండా రోడ్డుప్రక్క స్కూటర్ని లాక్ చేసి అలాగే వదిలేసి జీపెక్కాడు సుధాకర్.

జీప్ వెనుతిరిగి మలక్ పేట్ వైపు దూసుకుపోయింది.

2

"ఇనస్పెక్టరుగారూ, దయచేసి నేను చెప్పేది వినండి. మీరు చెప్పే హత్య గురించి నా కేమాత్రం తెలియదు. నే నలాంటివాణ్ని కాదు ...ప్లీజ్, నన్ను వదలిపెట్టండి."

సుధాకర్ పిచ్చివాడిలా అలా రాత్రంతా వాగుతూనే వున్నాడు. కాని అతని మాటలు పట్టించుకున్నవాళ్ళుగాని, జాలిపడినవాళ్ళుగాని ఎవరూ లేరు.

అవమానంతో, బెంగతో, భయంతో, అసహనంతో, నిస్సహాయతతో అతను సగానికి సగం తగ్గిపోయాడు ఒక్క రాత్రికే. ఇదంతా నిజమా లేక పీడకలా అని పదే

పదే మనసులో తలపోస్తూ, కలైతే బావుండునని గాఢంగా కోరుకుంటున్నాడు? కాని నిజం కల ఎలా అవుతుంది?

అసలా అందగత్తె ఎవరు? అందగత్తె కాదు, అందగత్తె రూపంలో వున్న నరహంతకి! తనని జాగ్రత్తగా ట్రాప్‌చేసి హత్యకేసులో ఇరికించేసి తను తెలివిగా దాటిపోయింది. ఈ పోలీసులు కాస్తా తన మీదికే నేరాన్ని నెట్టేసి కేసు కోర్టులో ఫైల్ చెయ్యబోతున్నా రీ రోజు

కనీసం తనెవరినైనా వకీలుని పెట్టుకోవటానికి గాని, తన భార్యకు, కావలసిన వాళ్ళకు చెప్పుకోవటానికిగాని అవకాశమివ్వటం లేదు. తనది అరణ్యరోదనేనా?

తనని అరెస్టు చేసినంత వేగంగాను, కోర్టులో విచారించి, హంతకుడిగా నిరూపించి, ఉరిశిక్ష వేయించి అమలు జరిపేసేలా వున్నారు.

తనకిప్పుడేది దారి?

సుధాకర్ అసహనంగా తల విదిలించాడు. ఆలోచనలతో తల పగిలిపోతోంది. టెన్షన్‌తో మెదడు నరాలు ఏ క్షణాన్నైనా చిట్లిపోయి సెరిబ్రల్ హెమరేజ్‌తో తన గుండె కొట్టుకోవటం ఆగిపోయేలా వుంది.

సమయానికి తన భార్య సుమిత్ర ఇంట్లో వుండివుంటే యీపాటికి తను కొంప చేరకపోవటంతో ఏదోక విధంగా తనని ట్రేస్‌చేసి వుండేది. కాని, ఆమె పుట్టింటికి వెళ్ళటం తన దురదృష్టం. పోనీ తన ఆఫీసు కోలీగ్స్ ఎవరైనా తన దుస్థితి తెల్సుకుని సహాయానికి రాకపోతారా? ఈ వార్త స్థానిక దినపత్రికల్లో ఈ రోజు వచ్చేసే వుంటుంది. అది చదివి తప్పక వస్తా రెవరోకరు.

ఈ ఆలోచన రాగానే సుధాకర్‌కి కొంత రిలీఫ్ అనిపించింది. ఆశారేఖ తళుక్కున మెరిసింది. మనసు తేలిక

య్యింది.

వాచీ చూసుకోబోయాడు అలవాటుగా. కాని చేతికి రిస్ట్ వాచ్ లేదు. ఏమయింది? ఏమో....ఎక్కడో పోయింది. ఉస్సురన్నాడు సుధాకర్. సీకో లేటెస్ట్ మోడల్ ఆటో మాటిక్ వాచ్ అది. ఎనిమిది వందలు పెట్టి సేఠ్ దగ్గిర కొన్నాడు. ఎలా పోయింది?

అప్రయత్నంగా జేబు తడుముకున్నాడు. గుండె ఝల్లు మన్నది. పర్సులేదు. దాంట్లో పదకొండు వందల రూపా యల చిల్లరుండాలి. పర్సేమయింది? పడిపోయిందా? ఉహూ, స్టేషన్ కొచ్చేవరకు జేబులో పర్సున్నట్టు తనకి బాగా గుర్తుంది. వాచీకూడా లోపలి కొచ్చేవరకు చేతిన వున్నట్టే గుర్తుంది.

అయితే ఏమయినట్టు? తనని దురదృష్టం వెన్నాడు తూనే వుందనటానికిదో నిదర్శనం!

స్టేషన్‌లోని గడియారం టంగ్ టంగ్‌న గంటల కొడు తోంది. లెక్కపెట్టాడు.

పదకొండు!

సరిగ్గా అప్పుడే ఇన్‌స్పెక్టర్‌తో ఏదో పరిచితమైన గొంతు మాట్లాడుతున్నట్టు పసికట్టాడు సుధాకర్.

మరో రెండు నిమిషాల తర్వాత ఆ గొంతు తాలూకు వ్యక్తి సుధాకర్ ముందున్నాడు.

అతన్ని చూస్తూనే ఎగిరి గంతేసినంత పనిచేశాడు సుధాకర్!

"జైరాజ్, నువ్వా?" అన్నాడు సంభ్రమంగా.

జైరాజ్ గుంభనంగా నవ్వబోయి, అంతలోనే సుధా కర్ పరిస్థితి గుర్తొచ్చి, జాలిగా సానుభూతిగా చూశాడతని వంక.

ఆమాత్రానికే కలిగి పీరై పోయాడు సుధాకర్. అప్రయత్నంగా అతని కంట గిర్రున తిరిగింది నీరు.

"ఛ, ఛ, ఎందుకా బేలతనం? నీకేం ఫరవాలేదు, నేనొచ్చానుగా!....అవునూ, ఇంతకీ నువ్వు చేసిన నేరమేమిటి? ఎందుకు నిన్ను రిమాండు చేశారు?" అడిగాడు జైరాజ్.

"బహుశా పేపర్లో చదివే వుంటావు....!?" తనని హంతకుడిగా అప్పుడే పత్రికలు ముద్రవేసేసి వుంటాయని గ్రహించగానే దుఃఖం తన్నుకొచ్చింది సుధాకర్‌కి. తనిప్పుడు లోకం దృష్టిలో నేరస్థుడు. తలెత్తుకుని ఎలా తిరగగలడు?

"అది చదివే పరుగెత్తుకుని వచ్చాను. మా సుధా ఏమిటి, హత్యచెయ్యటమేమిటి? ఇదంతా చాలా వింతగా, నమ్మలేనిదిగా వుంది. అసలేం జరిగింది?" అనునయంగా అడిగాడు జైరాజ్.

సుధాకర్ జరిగిందంతా చెప్పాడు.

జైరాజ్ ముఖంలో సానుభూతి వెల్లువలా పొంగింది. విచారరేఖలు అలుముకున్నాయి మబ్బుల్లా.

"కనీసం మనవాళ్ళకి ఫోన్ చేసుకోవటానిక్కూడా పోలీసు లంగీకరించలేదు. వకీలుని పెట్టుకుందామన్నా, బెయిలు ఏర్పాటు చేసుకుందామన్నా అవకాశమివ్వలేదు. నువ్వు నాపాలిట దేవుళ్ళా సరైన సమయానికొచ్చావు. లేకుంటే నా గతేమయ్యేదో!?"

"డోంట్ బి అఫ్రైడ్ మై ఫ్రెండ్! ఆ ఏర్పాట్లన్నీ నే చూస్తాను. నిశ్చింతగా వుండు" అన్నాడు జైరాజ్.

రాత్రి నుంచీ పడిన ఆవేదనంతా క్షణంలో మటుమాయమైపోయింది. సుధాకర్ మనసిప్పు డెంతో తేలిగ్గా

వుంది. జైరాజ్ తన పాలిట నిజంగా దేవుడే!

జైరాజ్ తన ఆఫీసు కొలీగ్. పైగా తమ వీధిలోనే తమ ఇంటికి నాలుగిళ్ళవతల కాపురముంటున్నాడు. అందుకే తనగురించి తెలిసిన మరుక్షణం తన నాదుకోవటానికి పరుగెత్తుకొని వచ్చాడు. ఏమిచ్చి అతని ఋణం తీర్చుకోగలడు తను?

అప్రయత్నంగా మళ్ళీ కంటనీరు తిరిగింది సుధాకర్‌కి.

"నీకు చాలా కృతజ్ఞుడ్ని జైరాజ్! రాత్రినుంచి యీ సెల్‌లో మగ్గిపోతున్నాను. నన్ను తక్షణం విడిపించి తీసుకువెళ్ళు. నీ మేలు ఆజన్మాంతం మరచిపోను."

"ఛ, ఛ! అంత పెద్దమాట లెందుకు? ఇప్పుడే ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి వస్తాను...." అంటూ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ ఇన్‌స్పెక్టర్ గదివైపు నడిచాడు జైరాజ్.

సుధాకర్ మనసు మేఘాల్లో తేలిపోతోంది. ఇక ఫరవాలేదు, జైరాజ్ తనకి బెయిలు ఏర్పాటు చేస్తాడు. ఆ తర్వాత తను నేరస్థుడు కాదని రుజువు చేసుకోవటం పెద్ద కష్టం కాదు. ఎంత డబ్బయినా ఖర్చుపెట్టి పేరున్న వకీలుని పెట్టుకుని వాదించుకుంటాడు. తనకి పరువుకన్నా డబ్బు విలువైనది కాదు. తల తాకట్టుపెట్టుకొని అయినా డబ్బు తెచ్చుకుని ఈ గండంనించి బయటపడతాడు.

వెళ్ళినంత వేగంగాను మళ్ళీ సెల్ దగ్గరకొచ్చేశాడు జైరాజ్. ఆశగా అతనివైపు చూశాడు సుధాకర్.

"ఈ ఇన్‌స్పెక్టర్ మరీ మొండివాడిలా వున్నాడు. హెడ్ స్ట్రాంగ్! ఏం చెప్పినా వినిపించుకోవటంలేదు. బెయిలు వీలుకాదంటున్నాడు...." అన్నాడు జైరాజ్. ఇందాకటి స్థిరత్వం లేదతని గొంతులో.

ఒక్కసారిగా దిగాలుపడిపోయాడు సుధాకర్.

జైరాజ్ బలవంతాన చిరునవ్వు తెచ్చుకుని "ఇతను కాదంటే ఆగిపోతుందా? ఇతని మీద చాలామంది అధికారు లున్నారు. ఎస్.పి. నాకు పర్సనల్‌గా తెలుసు. నువ్వు వర్రీ కావొద్దు, నే వస్తాను. సాయంత్రం లోపల నీకు బెయిలు ఏర్పాటు చేస్తాను." జైరాజ్ గొంతులో మళ్ళీ స్థిరత్వం చోటు చేసుకున్నది.

సుధాకర్ ఆశానిరాశల మధ్య కొట్టుమిట్టాడుతుండగానే జైరాజ్ వెళ్ళిపోయాడు.

సుధాకర్ ఉస్సురంటూ వెల్లో కూలబడిపోయాడు.

3

సాయంత్రం ఆరుగంటలయింది.

ఇన్‌స్పెక్టర్ దయతలచి సుధాకర్‌కి అన్నం సాంబారు పంపించాడు ఆకలితో నకనకలాడిపోతున్నా సుధాకర్‌కి ఆ తిండి సహించలేదు.

ఒక్క మెతుకుకూడా ముట్టలేదు సుధాకర్.

ఇన్‌స్పెక్టరు బూట్లు టకటకలాడించుకుంటూ అక్కడి కొచ్చాడు. అతని వెంట ఇద్దరు కానిస్టేబుల్స్ కూడా వున్నారు.

ఇన్‌స్పెక్టరు సూటిగా సుధాకర్ కళ్ళలోకి తీక్షణంగా చూశాడు. సుధాకర్‌కి భయంవేసింది.

"ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఆ అమ్మాయి గురించి పూర్తి వివరాలు చెప్పెయ్యి. అంతేకాదు, ఆమె నీకేమవుతుందో, ఆమెకు హత్యలో ఎందుకు సాయం చేశావో, నిజాయితీగా ఒప్పుకో. లేకుంటే నీమీద థర్డ్ డిగ్రీ ఉపయోగించాల్సి వుంటుంది. థర్డ్ డిగ్రీ అంటే తెలుసా....?" ఇనస్పెక్టర్ ఎఫెక్టు కోసం ఓ క్షణం

ఆగాడు.

సుధాకర్ ఒళ్ళు జలదరించింది. వెన్నున చలిపుట్టింది. తనమీద థర్డ్ డిగ్రీ ప్రయోగించబోతున్నారా పోలీసులు? ప్రత్యక్ష నరకం వేరే ఎక్కడో వుండబోదు. దాని కన్న ఒకేసారి ప్రాణాలు తీసేస్తే హాయిగా వుంటుంది.

పక్కనున్న కానిస్టేబిల్స్ చేతుల్లో చిత్రవధ చెయ్యటాని కుపయోగించే పరికరాలు సిద్ధంగా వున్నాయి. మైగాడ్. ఇంత బతుకు బతికి....

"వద్దు....వద్దు. నన్నేం చెయ్యొద్దు. ప్లీజ్. ఇన్స్పెక్టర్, మీకు మొక్కుతాను. నేను నిర్దోషిని. ఆమె నా స్కూటర్ వెనక కూచోవటం చాలా కాకతాళీయంగా జరిగిపోయింది. కేవలం లిఫ్ట్ అడిగితే ఇచ్చాను. ఆమె ముక్కు మొహం నేనెరగను. నన్ను నమ్మండి...." సుధాకర్ చేతులు జోడించాడు.

ఈపాటికి జై రాజ్ రావలసిందే, ఎందుకోమరి రాలేదు. ఈ ఇనస్పెక్టరు చూడబోతే తన అంతు చూసేలా వున్నాడు. ఎలా ఇప్పుడు?

సుధాకర్ మనసు నిండా జోరీగల్లాంటి ఆలోచనలు ముసురుకుంటున్నాయి.

ఇన్స్పెక్టర్ సైగ చేశాడు. సెంట్రీ సెల్ తాళం తీశాడు ఇనస్పెక్టర్ లోనికి అడుగు పెట్టాడు. పెడ్తూనే గూబ అదిరిపోయేలా కొట్టాడు సుధాకర్ చెంప మీద.

తూలి గోడకుపోయి కొట్టుకున్నాడు సుధాకర్. అతని కళ్ళ ముందు చుక్కలు మెరిశాయి. కాసేపటివరకు చూపానలేదు. అంతా అలికేసినట్టు కనిపించింది. తర్వాత.

"వీడ్ని ఇంటరాగేషన్ రూంకి తీసుకురండి...." అని చెప్పి హుందాగా అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు ఇన్

స్పెక్టర్.

సుధాకర్ ప్రాణాలు పైనేపోయాయి. ఇక తన చరిత్ర ఈరోజుతో ముగిసిపోతున్నది. తను లాకప్‌లోనే చావాలని రాసిపెట్టి వున్నట్టుంది. దేశంలో జరుగుతున్న వేలాది లాకప్ చావుల్లో తనది కూడా జమ కాబోతోంది.

జైరాజ్ ఎందుకని ఇంకా రాలేదు? కనీసం ఏదోక విషయం చెప్పటానికయినా రావాలి కదా!

అంతా తన దురదృష్టం! జైరాజ్ ఏదైనా ఏక్సిడెంట్ లాంటి దాంట్లో చిక్కుకుని వుండిపోలేదు కదా!? ఏమో ఈ మహానగరంలో రోజుకి కొన్ని పదుల రోడ్ ప్రమాదాలు. సమయానికి సెక్యూరిటీ ఇవ్వటానికి సరైనపార్టీ దొరకలేదేమో! ఎస్. పి. నగరంలో వున్నారో లేదో!

సుధాకర్ ఆలోచనలు ఇలా కొనసాగుతుండగానే కానిస్టేబిల్స్ అతన్ని చెరో రెక్కా పట్టుకుని పైకిలేపారు. వాళ్ళ వంక భయం భయంగా చూశాడు సుధాకర్. యమ భటులు ఇంతకన్న భయంకరంగా వుండరేమో ననిపించింది.

ఆ తర్వాత అతను పడ్డ నరకయాతన ఇంతింతని చెప్పటానికి వీలుకానిది: అతని గోళ్ళు పట్టకారతో పీకేశారు. కారం అద్దారు. బాధతో పైకప్పు ఎగిరిపోయేలా పెడబొబ్బలు పెట్టాడు సుధాకర్. కాలి గోళ్ళ సందున సూదులతో పొడిచారు. మోకాళ్ళమీద, కాలి మడమ మీద లాఠీతో బాదారు.

సుధాకర్ నేరం తనే చేశానని, హంతకుడు తానేనని గొంతెత్తి అరిచి చెప్పాలనుకున్నాడు. అలా చేస్తే తనకా చిత్రహింసలు తప్పిపోతాయనిపించింది. ఉరికంబ మెక్కటం దీనికన్న వేలరెట్లు నయం. ఒకేసారి ప్రాణం

పోతుంది.

కాని. తను హంతకుడినని ఒప్పుకోవటం తన ఆత్మని తను వంచించుకోవటమే అవుతుంది. అది ఆత్మహత్యతో సమానం. అయినా సరే, తనీ బాధ భరించలేడు.

సుధాకర్ ఒక్కసారిగా గొంతు చించుకుని చెప్పాడు. "నేనే హత్య చేశాను!" అని.

అతని శరీరం మీద నాట్యం చేస్తున్న లాఠీలు శాంతిం చాయి. అతన్ని మంచుగడ్డ మీదినుంచి కిందికి దించారు. ఐస్‌కన్న చల్లగా మారిపోయి కొయ్యబారిపోయిన శరీరం ఓ పట్టున తన వశంలోకి రాలే దతనికి.

"అయితే ఆ ఆడదాని గురించి చెప్పు వెంటనే. అదె వత్తి? దాంతో నీకేమిటి సంబంధం? మీ రిద్దరు కలిసే చంపారా, లేక అది చంపుతుంటే నువ్వో, నువ్వు చంపు తుంటే అదో సాయం చేసుకున్నారా? చెప్పు...." ఇన స్పెక్టర్ మాటలు సరిగా అర్థం కాలేదు సుధాకర్‌కి.

ఏం చెప్పాలి! ఆ స్త్రీ ఎవరో తనకి నిజంగానే తెలి యదు. అయినా ఈ ఇనస్పెక్టర్ నమ్మడు. పయిగా తను నేరం ఒప్పుకున్నాడు. తెలీదంటే తనని మళ్ళ కుళ్ళబొడి చేస్తారు. అప్పటికే శరీరంలోని సర్వశక్తులు ఉడిగి పోయాయి. దాహంతో నాలుక పిడచకట్టుకుని పోతోంది. కాలివేళ్ళు, చేతివేళ్ళు రక్తపు ముద్దల్లా వున్నాయి. నరాలు పట్లు తప్పాయి. కాలి చీలమండలు వాచిపోయాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే తన శరీరం తన అధీ నంలో లేదు. ఒళ్ళంతా మొద్దుబారిపోయింది. నిస్త్రాణ, నీరసం కమ్ముకుంటున్నాయి. కళ్ళు వాలిపోతున్నాయి భారంగా.

ఇన్‌స్పెక్టర్ కేదో చెప్పాలనుకున్నాడు. కాని అప్ప టికే అతనికి స్పృహ తప్పిపోయింది.

4

ఎవరో తట్టి లేపుతుంటే మెలకువ వచ్చింది సుధా కర్‌కి.

భారంగా కళ్ళు తెరిచి చూశాడు.

ఎదురుగా జైరాజ్!

పోయిన ప్రాణం లేచి వచ్చింది సుధాకర్‌కి. బావురు మని ఏడవాలనిపించింది. కాని ఏడవటానికక్కూడా ఓపిక లేని నిస్సహాయ స్థితి.

"ఎస్. పి. గారు కేంద్రమంత్రి ఎవరో నగరానికి విచ్చేసిన సందర్భంలో బందోబస్తు పనిమీద బిజీగా వుండటంవల్ల ఆలస్యమయింది. నీకు బెయిలు కాదు, ఏకంగా విడుదలే లభించింది. నీమీద కేసు రిజిష్టరు కాకుండా ఏర్పాటు చేశాను. నువ్విప్పుడు స్వేచ్ఛాజీవివి!" అన్నాడు జైరాజ్.

సుధాకర్‌కి ఆనందంతో నోట మాట రాలేదు.

"నిజమా! నేను నేరస్థుణ్ని కాదని నిరూపించ బడిందా? నేను.... నేను.... విడుదల చేయబడ్డానా?" ఆ సంతోషంతో గుండె ఆగిపోతుందేమో ననిపిస్తోందతనికి.

"అవును.... నిన్ను ఇంటికి తీసుకు వెళదామని వచ్చాను. నీ స్కూటర్ కూడా ఇంత క్రితమే మీ ఇంటికి చేర్చాను. ఆటోలో వెళదాం" అన్నాడు జైరాజ్.

సుధాకర్ లేచి కూచోబోయి తూలిపడ్డాడు. తనని ఇందాక దేహశుద్ధి చేసిన కానిస్టేబుల్స్ సాయంతోనే బయట నిలబెట్టిన ఆటోలోకి చేర్చబడ్డాడు తను.

మరో అరగంటలో ఇంటికి చేరా రిద్దరు.

రాత్రి పదకొండు గంటల సమయం. సరిగ్గా ఇరవయి నాలుగు గంటలు తను నరకాన్ని చవిచూశాక యిప్పుడు విడుదలయ్యాడు.

సుధాకర్‌కి గాయాల బాధ ఇప్పుడు ఏమాత్రం తెలియటం లేదు. అతను చాలా ఆనందంగా ఉన్నాడు.

దార్లో ఆటో నాపి, హోటల్నించి కారియర్ తీసుకున్నాడు జైరాజ్.

సుధాకర్ జైరాజ్ సాయంతో భోజనం చేశాడు. అవయవాలింకా స్వాధీనంలో లేవు. నోటి మీద కూడా ఇన్‌స్పెక్టర్ కొట్టాడు. ఏదో ఇంత తిన్నాడుగాని ఆకలి తీరలేదు. తినటానికి నోరు సహకరించటంలేదు.

"డాక్టర్‌ని పిలవనా?" అన్నాడు జైరాజ్.

"ఇప్పుడు వద్దు. నాకు కంటినిండా నిద్రపోవాలని వుంది" అన్నాడు సుధాకర్.

జైరాజ్ లేవబోయాడు వెళ్ళటానికి. "నువ్వు విశ్రాంతి తీసుకో: ఉదయం వస్తాను" అన్నాడు.

సుధాకర్ జైరాజ్ ముఖంలోకి చూసి చటుక్కున తల తిప్పుకున్నాడు. తన కింత సాయం చేసిన జైరాజ్‌కి తను ద్రోహం చేశాడు. అవును నిజంగానే క్షమించరాని ద్రోహం చేశాడు.

కాని అతనికి నిజం తెలిసి వుండదు. తెలిస్తే తనని శాశ్వతంగా జైల్లోనే మగ్గిపొమ్మని వదిలేసి వుండేవాడు.

'గుడ్‌నైట్' చెప్పి వెళ్ళిపోయాడు జైరాజ్.

వెళ్ళిపోయిన స్నేహితుడికి గాల్లోనే నమస్కారం చేశాడు సుధాకర్.

పశ్చాత్తాపం అతని మనసును అగ్నిలా దహించే

పోతోంది.

రెండు రోజుల క్రితం జరిగిన సంఘటన వద్దను కున్నా అతని స్మృతిపథంలో మెదిలింది.

జైరాజ్ భార్య రాణి. తన భార్య సుమిత్ర పుట్టింటికి వెళ్ళాక అప్పుడప్పుడు తనకి వాళ్ళింటి దగ్గిర్నుంచి భోజనం వచ్చేది. వద్దన్నా జైరాజ్ వినకుండా పంపేవాడు.

ఆరోజు కూడా అలాగే రాణి కారియర్ తీసుకుని వచ్చింది.

స్నేహితుడి భార్యలో తల్లిని, సోదరిని చూడవలసిన తనలో కామపిశాచి కళ్ళు తెరిచింది. ఆమెలో సుమిత్ర కనిపించింది. మరో అందమైన ప్రియురాలు కనిపించింది.

అంతే. చటుక్కున లేచి ఆమెను కౌగలించుకున్నాడు. తన వాంఛను తీర్చుకోవటాని కామెను బలిపశువును చేయబోయాడు.

అయితే ఆమె తన ప్రయత్నాన్ని ఆదిలోనే అటకా యించింది. తన రెండు చెంపలు ఛెళ్ళున కొట్టి, తనని దూరంగా నెట్టివేసి, తప్పించుకుని వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోయాక తనలో వివేకం తలెత్తింది - తనెంత ఘోరానికి ఒడికట్టాడో అర్థమై ఒళ్ళు సిగ్గుతో చచ్చిపోయింది. కన్నతల్లిలా అన్నంపెట్టిన అన్నపూర్ణ మీద అఘాయిత్యం చేయబోయిన తన సిగ్గుమాలిన తనా నికి తల గోడకేసి కొట్టుకోవాలనిపించింది.

జరిగింది తెల్సుకుని జైరాజ్ తనని చంపటాని కొస్తా డనుకున్నాడు. కాని అతను రాలేదు. మర్నాడు ఆఫీసులో చాలా ఆదరంగా మాట్లాడాడు. ఆప్యాయంగా పలక రించాడు. అయితే రాణి అతనితో నిజం చెప్పలేదని తను గ్రహించి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

మూడో రోజు రాత్రే తను ప్రమాదంలో చిక్కుకుని ఆ జైరాజ్ పుణ్యమా అని బతికి బయట పడ్డాడు. తను చేసిన ద్రోహానికి అతను శిక్షించటానికి బదులు మహోప కారం చేశాడు. రాణికి చేతులెత్తి దణ్ణం పెట్టాలి! ఆమె తనని క్షమించేసింది. భర్తతో నిజం చెప్పలేదు.

అయినా, దేవతలాంటి రాణికి చేసిన ద్రోహానికి మరో రూపంలో తనకి శిక్షపడింది—అనుకున్నాడు.

* * *

"బాగా దెబ్బలు తగిలాయా?" అడిగింది రాణి, భర్తని.

"ఆఁ....ఒళ్ళంతా హూనంచేసి వదిలాడు ఇనస్పెక్టర్ సారధి." నవ్వాడు జైరాజ్.

"అతను స్వతహాగా దుర్మార్గుడు కాదు. భార్య దగ్గర లేకపోవటంవల్ల కోరిక నదుపు చేసుకోలేకపోయాడు. అందుకు శిక్షను భారీగానే స్వీకరించాడు."

"వాడు ఓ మంచి స్నేహితుడే కాని, వాడు చేసిన ఘోరానికి ఫలితాన్ని అనుభవించి తీరాలనే నేనీ పథకం వేశాను."

"అయితే ఇదంతా మీరు చేయించినట్టు అతని కే మాత్రం తెలియదు కదూ!?...."

"ఇంకా అనుమానమా? ఈ విషయంలో సారథి నాకు చాలా సాయం చేశాడు. వాడి ప్లాన్‌లో భాగంగానే నిన్న రాత్రి సుధాకర్ స్కూటర్‌ని ఓ, అమ్మాయి ఆపటం, వాడి వెనక కూచొని వెళ్ళటం—అంతా. నిజంగానే తన వెనక కూచున్న అమ్మాయి హత్యచేసి తప్పించుకు పోతోందని, పోలీసులు తనని అనుమానంమీద అరెస్టుచేసి రిమాండులో పెట్టారని — సుధాకర్ పూర్తిగా నమ్మేశాడు. వాడి దృష్టిలో నేనిప్పుడో దేవుణ్ణి."

"వండ్రఫుల్! అయిందేదో అయింది, ఇక ఆ సుధాకర్‌తో స్నేహం మానెయ్యండి. నేను మటుకు మీరు ఆజ్ఞాపించినాసరే, అతనింటికి భోజనం తీసుకెళ్ళను."

"ఈసారి అతను నీ పాదాలు కళ్ళకు హత్తుకుని నీకు పాదపూజ చేస్తాడని గ్యారంటీ ఇవ్వగలను." నవ్వుతూ భార్యవంక చూశాడు జైరాజ్.

"వద్దు మహానుభావా, గ్యారంటీలు అక్కర్లేదు. సంపాదించారు మా లావు ఫ్రెండుని-స్నేహితుడి భార్యని నీచదృష్టితో చూసే మనిషి నింకా వెనకేసుకొస్తున్నారు! అమాయకురాలైన ఆ సుమిత్ర ముఖం చూసి అతన్ని అంతటితో వదిలేశానుగాని, లేకుంటే అక్కడే ఓ పట్టు పట్టి వుండేదాన్ని." అంది భర్త కౌగిటిలో గువ్వలా ఒదిగిపోతూ. □

మతిమరుపు మొగుడు?

ఫాలనేత్రం

వి.యస్.రావ్

సీరియల్

(గతసంచిక తరువాయి)

15

నక్షత్రకమూర్తి తనని కలుసుకుని, రెండు నెలలు కావస్తూంది. తరవాత వసూలుకి అతను ఎందుకురాలేదు? అతని చిరునామా తెలుసుకోనందుకు గణపతి విచా

రించాడు.

గతంలో అతనెవరో, ఏం చేస్తున్నాడో, అసలు పేరేమిటో, ఊరేదో, అతన్ని కలెక్షన్ ఏజెంటులా ఉప యోగిస్తున్న నిటలాక్షరావు ఎవడో కనిపెట్టాలని తనకి ఎంతగానో అనిపించింది. కానీ....వాళ్ళకి తెలిస్తే తను ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వుంటుందన్న భయం ఆ ప్రయత్నాన్ని విరమింపజేసింది. వాళ్ళెవరో తెలుసు కున్నా, తను చేయగలిగింది సున్న!

వాళ్ళ నిజరూపాల్ని గురించిన క్యూరియాసిటీని చంపు కుని, ముక్కుకి తాడు తగిలించబడిన ఎద్దులా వాళ్ళు ఆడించినట్టు ఆడుతూ వుండిపోయాడు తను! కానీ ప్రస్తుతం వాళ్ళిద్దర్నీ తను అత్యవసరంగా కలుసుకోవాలి! వాళ్ళెక్కడున్నారు? గతంలో తనున్న ఊళ్ళోనా? శోభ ఉన్న ఊళ్ళోనా? ఇక్కడా?

నాటకం కోసం గోవిందరావూ, తనూ నిర్ణయించిన గడువు దగ్గిరపడుతోంది. ఆలోగా నక్షత్రకమూర్తి తనని కలుసుకుంటాడన్న నమ్మకం నశిస్తూందతనిలో. వాళ్ళ దృష్టి తనమీద పడితేగానీ, నక్షత్రకమూర్తి త్వరగా రాడు! జంతువు చచ్చిపడిపోతే రాబందులు పసికట్టి ఎగు రుతూ వచ్చినట్టు, తనకి ఏదో డబ్బొచ్చిందని వాళ్ళకి తెలిస్తే. తన్నుకుపోడానికి నక్షత్రకుడు వచ్చి వాలతాడు!

కానీ తనకి డబ్బొచ్చేమార్గం ఎట్లా? డబ్బులేకుండా ఏదో వచ్చినట్టు పబ్లిక్ నాటకం ఆడితే? నిజంగానే వచ్చిం దనుకుని ఆ మొత్తాన్ని కక్కమంటారు! తను చిక్కులో పడతాడు!

ఆలోచించి, ఆలోచించి, మరో వారం రోజులు వేచి చూడ్డానికి గణపతి నిశ్చయించుకున్నాడు. ఆ తరవాత

షాపులవాళ్ళు నడిపే ఏదో లక్కీడిప్‌లో అయిదు వేలో, పదివేలో తన నందరుకి తగిలినట్టు పబ్లిసిటీ ఇప్పిస్తే సరి పోతుంది! తనలో నవ్వుకుంటూ గణపతి సిగరెట్ వెలిగించాడు. రాబందు ఎగురుతూ వచ్చాక, తన పథకంలోని మొదటి అడుగు ప్రారంభిస్తాడు!

అటెండర్ కాఫీ అతని ముందు పెట్టాడు. కప్పు అందుకోడానికి గణపతి చెయ్యి చాచాడు. ఉన్నట్టుండి టెలిఫోన్ మోగింది. ఎడంచేత్తో రిసీవర్ని చెవికి ఆనించాడతను.

"యస్?"

"మేనేజర్ గణపతిగారా?"

"యస్...." నక్షత్రకమూర్తి కంఠంలాగే వుంది ఆ కంఠం. ఈమధ్య ఎవరు ఫోన్లో మాట్లాడినా అతని కంఠమే వినిపిస్తుంది తనకి.

"గణపతీ, అత్యవసరంగా పదివేలు కావాలి...."

గణపతి ఉలిక్కిపడ్డాడు. సందేహం లేదు. నక్షత్రకమూర్తే. ఆ క్షణంలో, నక్షత్రకమూర్తి కంఠం ప్రేమగీతం పాడుతున్న రఫీ కంఠంలా తియ్యగా వినిపిస్తుందతనికి. తను ఉద్రేకపడకూడదు.

"సారీ....లాభంలేదు...." గణపతి నటిస్తూ అన్నాడు.

"లాభంలేదంటే లాభంలేదు! పీకలమీదికొచ్చింది. పని జరక్కపోతే, నీ పీకలమీదికొస్తుంది!" అటువైపున నక్షత్రకమూర్తి నవ్వాడు.

గణపతి శబ్దించేస్తూ నిట్టూర్చాడు. "మిస్టర్ మూర్తీ, అయామ్ బిజీ! నాకోసం ముగ్గురు పెద్దమనుషులొచ్చారిప్పుడే. మనం సాయంత్రం ఎక్కడేనా కల్సుకుందాం! సారీ...." గణపతి మర్యాద ఉట్టిపడే కంఠంతో అన్నాడు.

నక్షత్రకమూర్తి క్షణకాలం మౌనంగా వుండి పోయాడు. తను ప్రస్తుతం అతన్తో చర్చించలేననీ, బెదుగుడు ఆడలేననీ నక్షత్రకమూర్తి అర్థం చేసుకుంటాడా? గణపతి ఆలోచనకి అంతరాయం కలిగింది.

"ఓకే. సాయంత్రం ఏడూ ఏడుకి కోయా రెస్టారెంట్! ఉత్తిచేతుల్తో రావొద్దు!" నక్షత్రకమూర్తి డిస్కనెక్ట్ చేసేశాడు.

మొదటి ప్రయత్నం ఫలించింది! రిసీవర్ పెట్టేసి, గణపతి సంతృప్తితో నవ్వుతున్నాడు. చల్లారిపోయిన కాఫీని అమృతంలా తాగసాగేడు. తను భయపడ్డట్టు కాకుండా, నక్షత్రకుడు తనని కాంటాక్ట్ చేశాడు! తన యాతన ఎంతో తగ్గింది....

* * *

"తెచ్చావా?" కోయా రెస్టారెంట్‌లో, స్పెషల్ కాబిన్‌లో తన ఎదురుగా కూచున్న గణపతిని చూస్తూ, నక్షత్రకమూర్తి మొరిగినట్టు అడిగాడు.

"నేను అర్జెంటుగా నీ గురువుతో మాట్లాడాలి!" అతని ప్రశ్నను నిర్లక్ష్యంచేస్తూ అన్నాడు గణపతి.

నక్షత్రకమూర్తి గుబురు కనుబొమలు అతని నుదుర్ని పైకితోస్తూ గొంగళి పురుగుల్లా కదిలాయి. ఆశ్చర్యంగా గణపతిని చూస్తూ, అరంగుళం పొడవున్న తన గెడ్డాన్ని వేళ్ళతో బరుక్కుంటూ కాసేపు వుండిపోయాడు తను.

"మాటలతో జేబులు నిండవ్!" అన్నాడతను నవ్వుతూ.

"నేను ఆడబోయేవి సంచులు నింపే మాటలు!" గణపతి అతని కళ్ళల్లోకి తదేకంగా చూస్తూ అన్నాడు.

నక్షత్రకమూర్తి గొల్లున నవ్వాడు. "నిజంగా?"

గణపతి విసుగ్గా చూశాడు. "మీలాగా నేను అబద్ధాలాడాను!"

నక్షత్రకమూర్తి మళ్ళీ నవ్వాడు. "నిజంగా! నాకు తెలీదే!"

గణపతి తటాలున కుర్చీలోంచి లేచాడు. టేబుల్ మీద రెండుచేతుల్నీ ఆన్చి, ముందుకి వంగి నక్షత్రకమూర్తి కళ్ళల్లోకి సూటిగా, తీక్షణంగా చూశాడు. "ఎగతాళికీ, వెక్కిరింతలకూ టైమ్‌లేదు. నిటలాక్షరావుకి డబ్బు కావాలంటే, అతను చచ్చినట్టు నాతో మాట్లాడాలి! అర్థమైందా?"

"మాట్లాడకపోతే?" సిగరెట్ ముట్టిస్తూ ఛాలెంజ్ చేశాడు నక్షత్రకమూర్తి.

"మిస్టర్ నక్షత్రక్, మాటలాడకపోతే, మూటలు రావు!"

నక్షత్రకమూర్తి తటాలున తలెత్తి, ఆశ్చర్యంతో చూశాడు. గణపతి మొహం చెమటతో మెరుస్తోంది. చెమట బిందువులు అతని మొహంమీద ఏదో నిశ్చయాన్ని రాస్తున్నట్టున్నాయి.

"ఒహ్! తొందర ముదిరిందే!" నక్షత్రకమూర్తి ఎగతాళితో అన్నాడు. అతని కళ్ళు వజ్రాల్లా మెరుస్తున్నాయి. అతని కణతమీది నరం టకటకి కొట్టుకోడం ప్రారంభించింది. గణపతి అతన్ని చూస్తూ ఎగతాళిగా నవ్వాడు.

"తొందకాదు; ముదిరి ఊసరవెల్లి కాలేదు! మూసిన గదిలో ఇరుక్కున్న పిల్లి! అది తెగిస్తుంది. మీదికి దూకుతుంది. రక్కేస్తుంది!" గణపతి కంఠం గంటలా ధ్వనించింది.

నక్షత్రకమూర్తి సన్నగా ఈలవేశాడు. "నీ పంచ

ప్రాణాలూ నా గుప్పిట్లో—ఐ మీన్ విటలాక్షరావుగారి గుప్పిట్లో వున్నాయ్! మరిచిపోయావా?" అన్నాడతను గర్వంగా నవ్వుతూ.

గణపతి విరక్తితో నవ్వాడు. "ఎలా మరిచిపోతాను? నీ గురువు నన్ను కలుసుకోకపోతే, నేనో పని చేయాలని నిశ్చయించుకున్నాను. అతని కాళ్ళకింద పురుగులా ఇరుక్కుని నేరంమీద నేరం చేస్తూ, అనుక్షణం చావటంకన్నా జీవచ్ఛవంలా, నీడలా బతకడంకన్నా ఒక్కసారిగా చచ్చిపోతాను! నువ్వూ, నీ గురువూ నాలో ప్రాణంమీద ఆశను చంపేశారు. ఐడోంట్ వాంట్ టూ లివ్! ఈ కుక్కబతుకు నాకొద్దు!

"కానీ మిస్టర్ నక్షత్రక్, చచ్చిపోయే ముందు ఏం చేస్తానో తెలుసా? నీ బుర్రలోకి ఒక తూటాని ఎక్కించి, రివాల్వర్‌ని నావైపు తిప్పుకుంటాను! పీడ విరగడవుతుంది! ఆ తరవాత నీ గురువు ఎవర్ని బ్లాక్‌మెయిల్ చేస్తాడో ఇద్దరం పైనుంచీ చూద్దాం!" అతని కంఠం తగ్గుస్వరంలో, స్పష్టంగా ధ్వనించింది.

నక్షత్రకమూర్తి నమ్మలేనట్టు చూశాడు. గణపతి కళ్ళు నిర్భయంగా, ఎర్రగా చూస్తున్నాయి. అతను పూర్తిగా విసిగిపోయాడని అతని మొహం చెప్తోంది ..

"అంతకి తెగించినవాడివి, ఆయన్ని చూడ్డమెందుకు? ఆ పని ఇప్పుడే చేయొచ్చుగా?" నక్షత్రకమూర్తి ఎగతాళిగా అన్నాడు.

గణపతి చెయ్యి పైకి లేచింది. వేళ్ళు పిడికిలిగా బిగుసుకున్నాయి. పళ్ళు కొరుకుతూ చూశాడతను. మెల్లిగా చేతిని టేబుల్ మీదికి వాల్చాడు.

"చేయొచ్చు. కానీ, నీ గురువుకి యాభై వేల-

నైవేద్యం పెట్టడంకోసం అనూరాధని పెళ్ళాడాను. ఆమెని విధవగా రూపొందించే ముందు, నీ గురువుతో తుదిబేరం కుదుర్చుకోడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాను. అది జరక్కపోతే, అమాయకురాలైన నా భార్య పసుపు కుంకుమలూ, నీ గురువుగాడి అత్యాశా ఒకేక్షణంలో తుడిచి పెట్టుకుపోతాయ్!" గణపతి గంభీరంగా అన్నాడు.

నక్షత్రకమూర్తి కళ్ళు అటూ ఇటూ తిరిగాయి. ఏవో సందేహం వాటిలో ప్రత్యక్షమైంది.

"చివరిసారి చెప్తున్నా: నాతో మాట్లాడి, నేను ఇచ్చే పెద్ద మొత్తాన్ని తీసుకుని, ఆ సాక్ష్యాలు నాకు ఇస్తాడో, లేకపోతే పెద్ద మొత్తంతోబాటు, బంగారుగుడ్లు పెట్టే బాతుని ఆత్మహత్య చేసుకోనిస్తాడో తేల్చుకుంటాను! నక్షత్రక్, నేను నిటలాక్షరావుని అత్యవసరంగా, కలుసుకోవాలి! వెళ్ళు ఏర్పాటు చెయ్!" గణపతి ఉద్రేకంతో అన్నాడు.

నక్షత్రకమూర్తి తలాడిస్తూ వుండిపోయాడు. "గణపతీ, నువ్వు డెస్పరేట్ అయిపోయావు! వోకే. సిది చాలా చాలా చిన్న కోరిక: నిటలాక్షరావుగారితో సంప్రదించి ఇంటర్వ్యూ ఏర్పాటు చేస్తాను. ఏమిటి నిర్ణయిస్తాడో ఆయన ఇష్టం! నువ్వన్న ఆ రివాల్వర్లూ కత్తులూ మమ్మల్ని బెదిరించవ్. చిల్లరపేషాలేస్తే చెడేది నువ్వే! ఆయన తలుచుకుంటే నువ్వు ఆత్మహత్యకూడా చేసుకోలేవు! ఉరేసుకోడానికి కూడా దగ్గరలేకుండా, నీ మొలతాడుని తెంపి లాక్కొని, నిన్ను బొక్కలో తోస్తాడు! గుర్తుంచుకో!" అంటూ నవ్వుతూ లేచాడు.

గణపతి మౌనంగా అతన్ని చూశాడు. నక్షత్రకమూర్తి అతన్ని సూటిగా చూశాడు. "ఆయన్తో చెప్పబోయేది వివ

రంగా నాతో చెప్పు.... పెద్ద మొత్తం అన్నావు. బ్యాంకుని ఖాళీచేస్తావా?" నవ్వుతూ అన్నాడతను.

స్కౌండ్రల్! ఎగతాళిగా అన్నా నిజమే అన్నాడు! గణపతి నవ్వలేదు. "చెప్పను. నిటలాక్షలాక్షరావే నా మాటలు వినాలి!"

"ఓకే, గణపతీ. ఈ ఒక్కసారికి గెలిచావు! నువ్వు త్వరలో నిటలాక్షరావుగార్ని దర్శిస్తావు ..."

"అతనెక్కడున్నాడు?" గణపతి ఆత్రంగా అడ్డు తగిలాడు.

"ఎక్కడున్నా రేపటిలోగా నీకు దర్శన మిస్తారు! రేపంతా ఫోన్‌దగ్గిరే శివలింగంలా పాతుకుపో. ఎప్పుడు, ఎక్కడ, ఎలా కల్సుకోవాలో నీకు తెలియజేయబడుతుంది" అంటూ నక్షత్రకమూర్తి సిగిరెట్ వెలిగించాడు. ఇంకా నిలబడే వున్న గణపతిని చూశాడు.

"గుడ్‌నైట్!"

16

ఆటో రోడ్డువారగా ఆగింది. మీటర్ పైకం చెల్లించి, గణపతి కిందికి దిగాడు.

'హోటల్ హిమాలయా' నియాన్ సైన్ కొంచెం దూరంలో నీలాకాశం బ్యాక్‌గ్రౌండ్‌లో అవుపిస్తోంది. చివరి దమ్ము లాగి. సిగిరెట్‌ని కింద పడేసి అతను కదిలాడు.

చివరికి, తను రెండేళ్ళగా తనని చిత్రహింస పాల్జేసిన నిటలాక్షరావుని ముఖాముఖీ చూడబోతున్నాడు! తన బెదిరింపు నక్షత్రకమూర్తినీ, నిటలాక్షరావునీ హడలగొట్టినట్టుంది! అందుకే నక్షత్రకమూర్తి ఇంటర్వ్యూ యేర్పాటు చేశాడు....

"ఈ రాత్రి సరిగ్గా ఎనిమిదింటికి, హోటల్ హిమా

లయాకి వెళ్ళు. మూడువందలా ముప్పైమూడు నెంబరు గదికి వెళ్ళు. లిఫ్ట్ ఎక్కొద్దు. మెట్లమ్మట వెళ్ళు. తలుపు మీద మూడుసార్లు వేళ్ళతో చప్పుడు చెయ్. ఒక వ్యక్తి తలుపు తెరుస్తాడు. లోపలి కెళ్ళు. రాజారఘువర్మగార్ని చూడాలని అతనితో చెప్పు. నువ్వు ఎక్కడికెళ్లాలో అతను చెప్తాడు. అతను చెప్పినచోటికి తిన్నగా వెళ్ళు. నువ్వు చూడాలనుకున్న వ్యక్తిని, కళ్ళారా చూడు; నోరారా మాట్లాడు! ముఖ్యమైన వార్నింగ్: రివాల్వర్‌లూ, కత్తులూ వగైరాలమాట అటుంచి, ఫౌంటెన్ పెన్, బాల్‌పాయింట్ పెన్, పెన్సిల్, సిగిరెట్లూ, లైటరూలాంటివి కూడా నీ దగ్గిర వుండకూడదు. నువ్వూ, నీ దుస్తులూ—అంతే!" అంటూ సూచన లిచ్చాడు బ్యాంకు మూసేసే క్షణాల్లో నక్షత్రకమూర్తి.

గురుశిష్యులిద్దరూ, చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు! గణపతి తనలో నవ్వుకుంటూ మెట్లెక్కసాగేడు. 333 గది మూడో అంతస్థులో వుంది. మూడు ఫ్లోర్‌లూ ఎక్కేసరికి ఏడుకొండ లెక్కినట్టు తను అలసిపోయేలా వున్నాడు! నుదుర్ని కమ్మిన చెమటని అద్దుకుంటూ అతను మెల్లిగా మెట్లెక్కసాగేడు.

కాసేపట్లో గది-333 ముందు రొగురుస్తూ నించున్నాడు గణపతి. ఆయాసంతో, ఏదో అర్థంకాని ఉద్రేకంతో అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది. జేబురుమాలుతో మెడా, మొహమూ తుడుచుకుని, తలుపుమీద మూడుసార్లు వేళ్ళతో కొట్టా డతను.

తలుపు తెరుచుకోలేదు. ఎవరో దొంగచాటుగా తనని చూస్తున్నట్టు అనిపిస్తోందతనికి. మెల్లిగా తలతిప్పి, రెండు వైపులా నడవ పొడుగునా చూశాడతను. నడవ నిర్మాను

ష్యంగావుంది. అయినా ఏదో అజ్ఞాతనేత్రం తనని గమని స్తోందన్న భావం అతన్ని కంగారుపెడుతోంది.

మూడుసార్లు తలుపుమీద చప్పుడు చేయమని నక్షత్రక మూర్తి తనని హెచ్చరించారు. మరోసారి చప్పుడు చేయ డమా, వొద్దా....? గణపతి ఆలోచనకి అంతరాయం కలి గింది. అతని ముందున్న తలుపు ప్రాణం వచ్చినట్టు, హఠాత్తుగా లోపలికి కదిలింది.

"కమిన్!" అందో కంఠం కీచుగా, తలుపు చాటు నుంచీ. గణపతి గుమ్మం దాటాడు. అతని శరీరం ఒక్క సారి జలదరించింది. అతని మెడమీద చల్లగా యేదో ఆనింది. అదేక్షణంలో తలుపు మూసుకుంది.

"చేతులు పైకెత్తు!" కీచుకంఠం ఆజ్ఞాపించింది.

అప్రయత్నంగా గణపతి చేతుల్ని పైకెత్తేశాడు అతని గుండె డప్పులా మోగుతోంది. వీపుమీద చెమట సన్నగా కాలువకట్టింది. తన అంచనా తప్పిందా? ఆ దుర్మార్గుణ్ణి కల్సుకోవాలనుకుని తను పొరపాటు చేశాడా?

తనకి కనిపించేలా ముందుకి జరిగిన ఆకారాన్ని చూసి, గణపతి ఉలిక్కిపడ్డాడు. నున్నగా గీసిన గుండు. నున్నగా గెడ్డం. మీసాలులేని గుండ్రటి మొహం. నల్లటి కుండలా వున్న ఆ మొహంలోంచీ ఎర్రటి కళ్ళు, కుండచిల్లుల్లోంచీ వెలికి కనిపించే మంటలా వున్నాయి.

మెడమీద చల్లగా ఆనిన రివాల్వర్ కొస, అతని శరీరంమీద, మ్యాప్‌మీద క్రరలా పాకుతూ అతని ఛాతీ మీదికి చేరుకుంది. గణపతి, బొగ్గు విగ్రహంలా వున్న ఆ వ్యక్తిని ఆందోళనతో చూశాడు. కండలు తిరిగిన శరీరం. అతని ఛాతీ కండశిలా వుంది. నల్లటి అండర్ వేర్ అతని వొంటిరంగులో కలిసిపోయింది. అది తప్ప

అతని వొంటిమీద దుస్తులు లేవు. అతని శరీరం కొండ చిలువలా మెరుస్తోంది.

నల్లత్రాచులా కదిలిన అతని చెయ్యి ఎంతో అనుభవంతో గణపతి శరీరాన్ని తడువుతూ వుండిపోయింది. చొక్కా జేబూ, పాంటు జేబులూ, బెల్టులోపలా వెతికి అతను వెనక్కి జరిగాడు. నల్లటి మొహంలో తెల్లటిపళ్ళు ప్రత్యక్షమయ్యాయి. ఆ రివాల్వర్ పట్టుకున్న అతని ఎడమ చెయ్యి శిలావిగ్రహం చెయ్యిలా వుంది. అతను నవ్వుతూ గణపతి నడుముని చుట్టిన వెడల్పాటి బెల్టు బకిల్‌ని ఊడదీశాడు. ఒక్క ఊపుతో బెల్టుని లాగి, నిర్లక్ష్యంగా గది మూలకి విసిరాడు.

"జోళ్ళు తీసెయ్!" అన్నాడతను పాము బుసకొట్టినట్టు.

గణపతి చెప్పులు వదిలేశాడు. అతని ఛాతీమీంచి రివాల్వర్ దూరంగా జరిగింది. అతను పక్కకి జరిగి ముందుకి కదలమని గణపతికి రివాల్వర్‌తో సైగ చేశాడు. గణపతివి రాసుకుంటూ కదిలాడు.

తెప్పరిల్లిన గణపతి ఏదో గుర్తొచ్చి ఆగాడు. "రాజా.... రఘు ...వర్మగార్ని...." అతని నాలుక రబ్బరుముక్కలా తయారైంది.

జవాబుగా ఆ వ్యక్తి కుడిచెయ్యి ముందుకి కదిలింది. గోడ రంగులో కలిసిపోయిన బటన్ని నొక్కింది. ఆటోమాటిక్‌గా తలుపు తెరుచుకుంది. అతను విసురుగా గణపతిని గదిలోకి నెట్టాడు. తూలిపడబోతూ గణపతి నిలదొక్కుకున్నాడు. అతని వెనుకే తలుపు మూసుకుంది....

తను ఎయిర్‌కండిషన్డ్ గదిలో వున్నట్టు గణపతి గ్రహించాడు. ఎర్రటి గోడలు. ఎర్రటి సీలింగ్. ఎర్రటి

వెళ్తారు. గదంతపీ కప్పిన ఎర్రటి తివాచీ. హోటల్ హిమాలయాలో యింత పెద్ద గదులుంటాయని తనకి తెలీదు.

"సుస్వాగతం!" అందో కంఠం గంభీరంగా.

గణపతి ఉలిక్కిపడి ఎదురుగా చూశాడు. చిన్న హాలులా వున్న గదిచివర, టేబుల్‌కి అటువైపున రొటేటింగు కుర్చీలో కూచున్న వ్యక్తి తల కొద్దిగా కనిపిస్తోంది గణపతికి. తలపైన పొగ పల్చటి మేఘంలా వేళ్ళాడు తోంది. కుడిపక్కగా, చెయ్యీ, చేతిలో బిగించి పట్టుకున్న పైప్....

తనని ఏమార్చడానికీ, ముందు జాగ్రత్తతో ఏవేనా ఏర్పాట్లు చేసుకోకుండా వుండటానికి, హోటల్ హిమాల యాని ఒక 'అంచె'గా. నిటలాక్షరావుని కలుసుకోడానికి మొదటి మెట్టుగా, చెక్‌పోస్ట్‌గా చిత్రించాడా నక్షత్రక మూర్తి? ఆలోచిస్తూ గణపతి అడుగులు ముందుకి వేశాడు. గది సగం దూరం అతనికాళ్ళ కింద వెనక్కి జరిగాక, గణపతి కొద్దిగా తేరుకున్నాడు. సీగ్రోలా వున్న ద్వారపాలకుడు పరుగులు పెట్టించిన అతని గుండె ఇప్పుడు మామూలు వేగాన్ని చేరుకుంటోంది. అతని చూపులు రొటేటింగ్ కుర్చీమీదే వున్నాయి.

రొటేటింగ్ కుర్చీ తటాలున అతని వయిపు తిరిగింది. గణపతి పాదాలు అమాంతం కార్పెట్‌కి తాపడం అయి పోయాయి. అతని కళ్ళూ, నోరూ వెడల్పుగా తెరుచు కున్నాయి. అతని గుండె ఒక్కసారి కొట్టుకోడం మాని, మళ్ళీ పరిగెత్తడం ప్రారంభించింది.

తను యధార్థాన్ని చూస్తున్నాడా? కల గంటున్నాడా? రెప్పలు టపటపలాడించి, రొటేటింగ్ కుర్చీలో కూచున్న

వ్యక్తిని పరిశీలించి చూశాడు.

సన్నగా దువ్విన క్రాపు, గెడ్డం, మీసాలూ లేని శుభ్రంగా షేవ్ చేసిన మొహం, నెహ్రూ కోటు, టేబుల్ కిందినుంచీ చూడీదిర్ పైజామా అవుపిస్తూంది. గణపతి తన కళ్ళని నమ్మలేకుండా వున్నాడు. అతన్ని చిరునవ్వుతో చూస్తూ రొటేటింగ్ కుర్చీలో కూచున్నాడు నక్షత్రకమూర్తి!

17

కాసేపట్లో తెప్పరిల్లి జోరుగా టేబుల్ ముందుకు నడిచాడు గణపతి. పైప్‌ని పీల్చి, నిర్లక్ష్యంగా పొగ ఊది, తెల్లటిపళ్ళు చూపిస్తూ నవ్వాడు నక్షత్రకమూర్తి. గణపతి పిడికిళ్ళు బిగించాడు. తీక్షణంగా నక్షత్రకమూర్తి మొహంలోకి చూశాడు.

"ఏమిటీ నాటకం?" హుంకరించా డతను.

"ఏ నాటకం?" నవ్వుతూ అన్నాడు నక్షత్రకమూర్తి కానీ, అది అతని కంఠం కాదు. రెండు మూడుసార్లు ఫోన్‌లో తను విన్న నిటలాక్షరావు కంఠం గుర్తొస్తూంది గణపతికి.

"నక్షత్రకమూర్తీ, నేను డెస్పరేట్ అయ్యానని నువ్వే అన్నావు. నేను నిటలాక్షరావుని చూడాలి. అతనితో మాట్లాడాలి!" గణపతి అరిచాడు.

"చూస్తున్నావు. మాట్లాడు!" నక్షత్రకమూర్తి. నిటలాక్షరావు కంఠం.

గణపతి మొహం కుంపటిలా అయింది "ఏమిటీ వేళాకోళం? అత నెక్కడ?"

సరిగ్గా అదే క్షణంలో టేబుల్ మీదున్న ఎర్రటి టెలిఫోన్ గుర్రుమంది.

నక్షత్రకమూర్తి రిసీవర్ని అందుకున్నాడు. "యస్...."
అన్నాడు విసుగ్గా.

"...................."

"యస్. నిటలాక్షరావే. ఏం?"

"...................."

"ఓహ్! మీరా! కాన్ఫరెన్స్‌లో వున్నాను....ఆల్ రైట్ ఏమిటి? చెప్పండి!" అన్నాడతను నవ్వుతూ. అతని మాటల్లో, మొహంలో ఇప్పుడు విసుగులేదు. చిరునవ్వు, మర్యాదా కనిపిస్తున్నాయి. చెవులప్పగించి వింటున్నా డతను.

"మేయర్‌సాబ్, అయాం సారీ. రేపు నాకు అస్సలు తీరికలేదు. ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్ బిజినెస్ మేటర్ని ఫైనలైజ్ చేయడానికి అమెరికన్ బిజినెస్ మాగ్నెట్ హెరాల్డ్ ఫాక్స్ వస్తున్నాడు. మినిస్టర్‌గారికి నా తరఫున క్షమాపణలు చెప్పండి. వచ్చేవారం ఆయన్ని కల్సుకుంటాను" అన్నాడతను. గణపతి చెట్టులా నిలబడి నక్షత్రకమూర్తి నోటమ్మట నిటలాక్షరావు మాటల్ని ఆశ్చర్యంతో వింటున్నాడు. రేపు హోమ్ మినిస్టర్ వస్తున్నట్టు తను పేపర్లలో చదివాడు. నిటలాక్షరావు తనముందు నక్షత్రకమూర్తిగా నటించాడా? కంఠం మార్చి మాట్లాడ్డంలో అతను ఎక్స్‌పర్టా!

"ఓకే. థాంక్యూ. ఉంటాను గుడ్‌నైట్!" అంటూ అతను రిసీవర్ని పెట్టేసి గణపతిని నవ్వుతూ చూశాడు.

"గణపతీ మీట్ మిస్టర్ నిటలాక్షరావ్!" అన్నాడతను పైప్‌తో తన ఛాతీని తాకుతూ. గణపతి ఉలిక్కిపడ్డాడు. నక్షత్రకమూర్తి కంఠం! తన ముందున్న వ్యక్తి నిటలాక్షరావో, నక్షత్రకమూర్తో తనకి తెలీదుగానీ, అతను ఆరి

తేరిన మిమిక్రీ ఆర్టిస్ట్!

"గణపతీ, కూచో. నీ సందేహం తీరుస్తా" అన్నా డతను నవ్వుతూ.

గణపతి మంత్రముగ్ధుళ్ళా కూచున్నాడు. అతన్ని అయోమయంగా చూశాడు.

"బ్లాక్ మెయిలింగ్ ఒక గొప్ప ఆర్ట్. నిన్ను నేను బ్లాక్‌మెయిల్ చేసేప్పుడు మనిద్దరి మధ్యా మరో నక్షత్ర కుడు వుండకూడదు. అది మొదట నీకూ, తర్వాత నాకూ ప్రమాదం...." అంటూ ఆగా డతను. గణపతి నుదురు ముడతలు పడింది.

అతను నవ్వుతూ చూశాడు. "నేను పదివేలు పట్ట మ్మంటే అతను పదిహేను వసూలు చేసి, అయిదు వేలు మాయం చెయ్యొచ్చు. నా అనుమతి లేకుండానే నాకు తెలీకుండానే నీనుండి పైకం లాగొచ్చు. ఆ తర్వాత బ్లాక్‌మెయిలర్నే బ్లాక్‌మెయిల్ చేయొచ్చు! అంచేత.... నేను ఇలాంటివాటిలో అసిస్టెంట్స్‌ని నమ్మను. నీ కోసం నా క్షేమం కోసం నక్షత్రకమూర్తిగా నటించాను!"

"గుడ్‌గాడ్!" గణపతి అప్రయత్నంగా అన్నాడు. అతను చెప్పేది నిజమే. 'నీ పంచప్రాణాలు నా గుప్పిట్లో ఐ మీన్ నిటలాక్షరావుగారి గుప్పిట్లో వున్నాయ్!'— ముందురోజు నక్షత్రకమూర్తి తనతో తడబడుతూ అన్న మాటలు అతనికి గుర్తొచ్చాయి. మేయర్‌తో సాగిన ఇందాకటి సంభాషణ కూడా అతన్ని నిటలాక్షరావుగా నిరూపిస్తూంది. తను నిటలాక్షరావు చెంప పగలేశాడన్న మాట....!

"కమాన్, ఏమిటి ఆలోచన?" నిటలాక్షరావు హెచ్చ రించాడు.

గణపతి ఆశ్చర్యం నుండి తేరుకుని అతన్ని చూశాడు. కుర్చీలో సర్దుకు కూచుని, చిన్నగా దగ్గి, గొంతు సవరించుకున్నాడు.

"నన్ను పూర్తిగా బోల్తా కొట్టించావు!" అన్నాడు గణపతి.

నిటలాక్షరావు సగర్వంగా నవ్వాడు. "డోంట్ వేస్ట్ టైమ్!" అన్నాడతను క్లుప్తంగా.

"నిటలాక్షరావ్, నువ్వు నన్ను గానుగలా పిల్చి పిప్పి చేశావు. నాకు పూర్తిగా విసుగూ, విరక్తీ...."

"ఆ హరికథంతా నిన్ననే చెప్పావు? అసలు విషయం చెప్పు?" నిటలాక్షరావు గద్దించాడు.

"ఆల్‌రైట్....ఒక్కసారిగా పెద్ద మొత్తం నీ చేతికి వచ్చే యేర్పాటు చేస్తాను....నాకు తగిలించిన గాలాన్ని తీసేస్తావా?"

"పెద్ద - అంటే ఎంత పెద్ద మొత్తం?" నిటలాక్షరావు పైప్‌ని చూస్తూ ప్రశ్నించాడు.

"దాదాపు....పది లక్షలు...."

"వాట్!" నిటలాక్షరావు అదిరిపడి అరిచాడు.

"పది లక్షలు నువ్వు నానుండి వసూలు చేయలేవు. ఎందుకంటే నాలో బతకాలన్న ఆశా, వోపికా నశించాయి. అయామ్ డెస్పరేట్! నేను చెప్పే పథకాన్ని నువ్వు అమలు జరిపితే, నా కష్టాలు తీరిపోతాయి; నీ సంచులూ నిండుతాయి...."

"ఏమిటి నీ పథకం?"

"విన్నాక, వెనకడుగు వేయడానికి వీల్లేదు...." గణపతి నిర్ణయంగా అన్నాడు.

"కొమ్ములు చూస్తూ, చెరువులో మునిగిన గేదెను నేను

బేరం చేయను."

నిటలాక్షరావు నవ్వుతూ అన్నాడు. గణపతి ఆలో చిస్తూ తల పంకించాడు. విన్నాక, నిటలాక్షరావు వెను దీయడని తనకి తెలుసు. అనాయాసంగా వచ్చే అమృ తాన్ని అతను వొద్దనలేడు!

"ఈమధ్య, మన దేశంలో బ్యాంకు దోపిడీలు ఎక్కు వయ్యాయి. నువ్వు సై అంటే నేను పనిచేస్తున్న బ్యాంకులో దోపిడీ ఏర్పాటు చేస్తాను ..."

"వాట్!" నిటలాక్షరావు అడ్డొస్తూ అరిచాడు.

"నేను చెప్పిన రోజు, చెప్పిన టైమ్‌కి. చెప్పిన విధంగా దోపిడీ జరగాలి. నా ప్లాన్ నీకు వివరిస్తాను...." అంటూ గణపతి సిగరెట్ వెలిగించాడు.

అతను వివరించిన పథకాన్ని, మౌనంగా ఏకాగ్రతతో విన్నాడు నిటలాక్షరావు. అతని కళ్ళలో ఆశ మెరు స్తోంది.

"నా సహవాసంతో నీకూ తెలివితేటలొచ్చాయ్!" నిట లాక్షరావు సగర్వంగా అన్నాడు. "మిస్టర్ గణపతీ, నన్ను ఇరికించడానికి ఈ దోపిడీ ఒక బోనుకాదన్న గ్యారెంటీ ఏమిటి?"

గణపతి చిన్నగా నవ్వాడు. "నన్ను నీ పిడికిలిలో ఇరికించావు. నిన్ను మోసం చేయడానికి ప్రయత్నిస్తే నేనూ మునిగిపోతాను. దోపిడీ అయ్యాక నన్ను మోసం చేయడానికి ప్రయత్నిస్తే నువ్వూ మునుగుతావు!"

నిటలాక్షరావు తల ఆడించాడు. "దీని మూలంగా నీ కేమిటి లాభం?"

"అమాయకత్వం నటించొద్దు! నీ దగ్గరున్న ఎవి

డెన్స్‌ని నువ్వు సంపూర్ణంగా నాకు అప్పగిస్తావు. ఆ లాభం చాలు నాకు!"

"ఇంకా?"

గణపతి ఆశ్చర్యం నటిస్తూ చూశాడు. నిటలాక్షరావు చిన్నగా నవ్వాడు. "మనం పార్టనర్స్ అయ్యే సూచనలు అవుపిస్తున్నాయి. నాతో నిజం చెప్పు! బ్యాంకులో నువ్వు దుర్వినియోగం చేసిన పైకం ఈ దోపిడీ మొత్తంలో కలిసిపోతుంది! అవునా?" నిటలాక్షరావు కళ్ళు తెలివిగా నవ్వుతున్నాయి.

గణపతి నిట్టూర్చాడు. "ఆఫ్ కోర్స్! నీకు నాలుగు లోన్స్ ఇచ్చాను. అడిగినప్పుడంతా అల్లుడి కిచ్చినట్టు అందించాను. దాన్నంతా పూడ్చాలి మరి!"

"అంతేనా? ఆ మొత్తం ఎంత?" నిటలాక్షరావు ప్రశ్నించాడు.

"ఎంతైనా నీకు అనవసరం. మిస్టర్ నిటలాక్షరావ్, ఇంకో విషయం కూడా నీకు చెప్పాలి. ఈ పథకంలో మరో ఉద్యోగి మనకి సంపూర్ణంగా సహకరిస్తాడు. ఆ రోజు పదిలక్షలు నీ చేతిలోకి వస్తాయి. ఆరు నువ్వు తీసుకుని, నాలుగు అతని కిచ్చేయాల్సి వుంటుంది...."

"ఎవరతను?" నిటలాక్షరావు కళ్ళు చిట్లిస్తూ అడిగాడు.

"చెప్పను. ఆ సమయంలో అతను కౌంటర్లో వుంటాడు...."

"ఆ నాలుగులో నీ వాటా ఎంత?" నిటలాక్షరావు నవ్వాడు. గణపతి అతన్ని ఆశ్చర్యంతో చూశాడు. "కమాన్! నిజం చెప్పు!"

"అల్ రైట్....మేం చెరిసగం తీసుకుంటాం...."

"నాకు గిట్టుబాటు కాదు. కౌంటర్లో పదిహేను ఉండేలా

చూడు. నాలుగు మీకు ఇచ్చేస్తాను" నిటలాక్షరావు కంఠం నిర్లక్ష్యంగా ధ్వనించింది.

పదిహేను లక్షలు! గుడ్ హెవెన్స్! నిటలాక్షరావు ఆశ ఆకాశాన్ని మించుతోంది! గణపతి లాభం లేదన్నట్టు తలాడించాడు.

"నీ సొమ్మేం పోవట్లేదు. ఖర్చుచేసే చేవలేని పిసినారులు దాచుకున్నారు! వాళ్ళకీ నష్టంలేదు. బ్యాంక్ వాళ్ళ సొమ్ము వాళ్ళ కిచ్చేస్తుంది!" నిటలాక్షరావు నవ్వుతూ అన్నాడు.

"అంత పెద్దమొత్తం నా బ్రాంచిలో వుండదు...." గణపతి మెల్లగా అన్నాడు. "మెయిన్ బ్రాంచినుంచీ తెప్పిస్తే. తరవాత్తరవాత అనుమానాలొస్తాయి. అది మనిద్దరికీ క్షేమంకాదు. క్షేమకరమైన మొత్తాన్ని తీసుకుని తృప్తిపడి క్షేమంగా వుండు!"

"ఆల్‌రైట్.... రెండు లక్షలిచ్చేస్తాను. ఎనిమిది లక్షలు నాకు క్షేమకరమైన మొత్తమే!" నిటలాక్షరావు నవ్వుతూ అన్నాడు.

గణపతి లోపలే పళ్ళు కొరుక్కుంటూ చూశాడు. అడ్డు చెప్పబోయాడు. నిటలాక్షరావు అతనికి అడ్డు తగిలాడు. "ఈమధ్య ప్రభుత్వం ఏదో ప్రకటన చేసింది. బ్యాంకు దోపిడీలో చచ్చిపోయిన వ్యక్తి కుటుంబానికి ఇంతా, చావు తప్పి కన్ను లొట్టపోయిన వాడికి ఇంతా - ఇన్సెంటివ్‌గా ఇస్తారని విన్నాను...." అన్నా డతను సాభిప్రాయంగా.

గణపతి పెదవి కదపలేదు. నిటలాక్షరావు చిన్నగా నవ్వాడు.

"మీ ఇద్దరికీ కళ్లు లొట్టలుపోతే, నాకో లక్ష ఎక్కువగా గిట్టుబాటవుతుంది!"

గణపతి ఉలిక్కిపడి, అర్థం కానట్టు చూశాడు. అతని మూర్ఖత్వానికి నిటలాక్షరావు చిన్నగా నవ్వాడు. "నిన్నూ, నీ మిత్రుణ్నీ జాగర్తగా గాయపరిచే యేర్పాటు చేస్తాను. తద్వారా మీకు చెరో అరలక్షా వస్తుంది. ఆ రెండు అర లక్షల్నీ నేను తీసేసుకుంటాను. అంటే అది మినహాయించుకుని లక్ష ఇచ్చేస్తాను. లెక్క సరిపోతుంది!"

గణపతి నోరు వెళ్ళబెట్టాడు. స్కౌండ్రల్! డెవిల్! పళ్ళు కొరుక్కుంటూ చూశాడతను. ఉపాయం చెప్పిన తనకే ఉచ్చు బిగిస్తున్నాడు నిటలాక్షరావు!

"నాకిష్టంలేదు...."

నిటలాక్షరావు కుర్చీలోంచి లేచాడు. ముందుకు నడిచి, గణపతికి దగ్గిరగా టేబుల్‌కి ఏటవాలుగా ఆనుకున్నాడు. అతని మొహంలోకి నవ్వుతూ చూశాడు. "దోచబడే మొత్తానికి లోపల్లోపల ఎంత కలిపి, పోయిన సొమ్ము మొత్తాన్ని లెక్క చూపుతావో నాకు తెలీదు! నన్ను కత్తిలా వాడుకుని కుండలో ఎంత నింపుకోబోతున్నావో నాకు తెలీదు! నా చేతిలోని పాత్ర నిండేలా వుంటేగానీ నేను తేనెపట్టుని ముట్టుకోను!" అన్నాడతను నిర్ధారణగా.

గణపతి నిస్సహాయంగా చూశాడు. ఓడిపోతూ తలాడించాడు. "వోకే, నిటలాక్షరావ్. దానికీ వొప్పుకుంటున్నా. కానీ తన వాటా రెండులక్షలు లభిస్తేగానీ అతను వొప్పుకోడు. నా క్షేమంకోసం, నీ కబంధహస్తంలో ఇరుక్కుపోయిన ఆ ఫోటోలకోసం నేను డబ్బుని మరిచిపోతాను; రాబోయేదాన్ని త్యాగంచేస్తాను. అయితే, నా 'ఆస్తి'ని నాకు అప్పగించే గ్యారంటీ కావాలి నాకు!"

"గ్యారెంటీ ఇస్తున్నా!" నిటలాక్షరావు ఉత్సాహంగా అన్నాడు.

"ఏమిటా గ్యారెంటీ?" గణపతి కళ్ళుచిట్లిస్తూ అడిగాడు.

"నామాట!"

"నిటలాక్షరావ్, నీ మాటొక్కటే చాలదు!" చిన్నగా నవ్వుతూ అన్నాడు. అతని మాటలోని ఎగతాళి నిటలాక్ష రావుకి క్షుభంగా వినిపించింది.

"నిటలాక్షరావు ఆడినమాట తప్పడు!" అన్నాడతను సగర్వంగా.

"మాటల్తో జేబులు నిండవ్!" గణపతి నవ్వుతూ అన్నాడు.

"నా డైలాగులు నాకు అప్పజెప్ప నక్కర్లేదు; నీకేం కావాలో చెప్పు!" నిటలాక్షరావు గద్దించాడు.

"నా ఫోటోలు!"

నిటలాక్షరావు విసుగ్గా చూశాడు. "పని పూర్తయితే గానీ అవి నీ చేతిలోకి రావు!"

గణపతి చిన్నగా నవ్వాడు. నిటలాక్షరావు తను వదిలిన గాలంవైపు కదుల్తున్నాడు. తను కొంచెం మొండిగా వ్యవహరించి పని సాధించాలి! "నా ఆస్తి నా చేతిలోకి వస్తేగానీ, ఆ పని జరగదు!" అన్నాడతను నిటలాక్షరావు కళ్ళల్లోకి ధైర్యంగా చూస్తూ.

నిటలాక్షరావు బరువుగా నిట్టూర్చాడు. పైప్‌ని ఖాళీచేసి కొత్త పొగాకు నింపాడు. వెలిగించి తన్మయత్వంతో పొగ వదిలాడు. ఖరీదైన పొగాకు వాసన గాల్లో వ్యాపించింది. అతను తదేకంగా గణపతిని కాసేపు చూశాడు.

"పనయ్యాక నేను నిన్ను మోసంచేయొచ్చు. పూర్తి

వక ముందే ఫోటోలు ఇచ్చేస్తే, నువ్వు నన్ను మోసం చెయ్యొచ్చు; పథకాన్ని రద్దుచెయ్యొచ్చు! అంచేత ఇద్దరికీ గ్యారెంటీ వుండే, మంచిమార్గాన్ని మనం అన్వేషించాలి...."

"కరెక్ట్!" గణపతి నవ్వుతూ అన్నాడు. "రెండు లాకర్స్‌లో అవి జాగర్త చేయబడ్డట్టు చెప్పావు...."

నిటలాక్షరావు మాట్లాడకుండా చూస్తూవుండిపోయాడు. "ఒక పనిచేద్దాం...." అన్నాడతను సాలోచనగా.

"ఏమిటి?" గణపతి ఆత్రుతగా అడిగాడు.

"ఆ రోజు వాట్ని జేబులో, సీల్డ్‌కవర్లో తెస్తాను. పని పూర్తిచేసి, వెళ్ళిపోయే ముందు జారవిడుస్తాను!"

గణపతి తల అడ్డంగా వూగించాడు. "అది అపాయకరం. చివరిక్షణంలో, కంగారులో నువ్వు మరిచిపోయి ఉడాయించొచ్చు. మరిచిపోయినట్టు నటిస్తూ ఉడాయించొచ్చు. నేను నిన్ను నిలబెట్టి అడగలేను!"

నిటలాక్షరావు కళ్ళు చిట్లిస్తూ చూశాడు. "ఇద్దరం పార్టనర్స్ అవుతున్నాం. ఒకర్నొకరు— న్యాయంగా, నమ్మాలి. కానీ, నమ్మి రిస్క్ తీసుకోవాల్సిన అవసరం ఇద్దరికీ లేదు...."

"నిజం చెప్పినందుకు మెచ్చుకుంటున్నా!" గణపతి అద్దొస్తూ అన్నాడు.

"మరో ప్లాన్ చెప్తాను: రంగంలోకి దూకే ముందు రోజు నీ ఆస్తిని కళ్ళముందు కవర్లో పెట్టి సీల్ వేస్తాను. పాత న్యూస్‌పేపర్లూ వగైరా వేసిన ఒక బ్రీఫ్‌కేసులో కవర్ని పెట్టేస్తాను. ఇద్దరం కల్సి రైల్వేస్టేషన్ కెళ్దాం. క్లోక్‌రూమ్‌లో బ్రీఫ్‌కేస్ పెట్టేసి, రసీట్ నెంబర్ని నువ్వు

గుర్తుంచుకోవచ్చు; కావాలంటే: మరుసటిరోజు బ్యాంకులో పని పూర్తయ్యాక, క్లోక్‌రూమ్ రిసీట్‌ని నీకు రహస్యంగా అందిస్తాను. నువ్వెళ్ళి నీ ఆస్తిని తెచ్చుకోవచ్చు!

అయితే ఒక షరతు. ఆస్తిని కవర్లో పెట్టి, సీల్ చేసి బ్రీఫ్ కేస్‌లో భద్రపరిచే కార్యక్రమం నీ సమక్షంలోనే జరుగుతుంది. అంతసేపూ నీ చేతులూ కాళ్ళూ కట్టివేయబడతాయి: క్లోక్ రూమ్‌లో భద్రపరిచేదాకా, నా అంగరక్షకుడు నీ భుజమ్మీద చెయ్యి వేసుకునే వుంటాడు. అతని చేతిలో సైనెడ్ కోటెడ్ బులెట్ వున్న రివాల్వర్ వుంటుంది! వోకే?" నిటలాక్షరావు ప్రశ్నించాడు.

గణపతి తటపటాయిస్తూ చూశాడు. నిటలాక్షరావు ముందుకి వాలి, అతని భుజమ్మీద తట్టాడు. "నువ్వు చెప్పిందంతా నిజంగా జరిగితే, నీ ఫోటోల ద్వారా నిన్ను భవిష్యత్‌లో బ్లాక్‌మెయిల్ చెయ్యాల్సిన అవసరం నాకుండదు? ధారాళంగా నాకు డబ్బొస్తుంది. నాతో చేతులు కలిపాక నిన్ను మోసం చేయను!" అన్నాడు ధైర్యం చెప్తున్నట్టు.

ఆలోచిస్తూ, కాసేపు మౌనంగా ఉండిపోయాడు గణపతి. అతను నోరు తెరిచేలోగా నిటలాక్షరావు మళ్ళీ ప్రారంభించాడు: "నువ్వు వివరించిన విధంగా, అనుచరుల్తో నేను బ్యాంకులో జొరబడతాను. సిబ్బందినీ, ఖాతాదారుల్నీ గన్స్‌తో బెదిరించి, బోర్లాపడుకోబెడతాను. పని ముగిస్తాను. సరుకుని నా శిష్యులు బైటికి తీసుకెళ్తారు. నేను కాసేపు ఆగుతాను. అంతర్నాటకం ఆడి, నువ్వూ మా కోసం పోలీసుల్ని తయారుగా దాచివుంచ లేదని రూఢి చేసుకున్నాక, నీ రిసీట్ నీకిచ్చి నా దారినపోతాను!"

గణపతి నవ్వుతూ చూశాడు. తనకి కావల్సింది కూడా

అదే! అయితే తను తొందరగా తేలిపోకూడదు. ఇంకా ఆలోచించాలి.

"ఇదికూడా నాకు తృప్తికరంగా లేదు. ఇద్దరికీ క్షేమంగా వుండే మరో మార్గం వెతుకుదాం. ఇంకా వ్యవధి వుందిగా!"

నిటలాక్షరావు చిన్నగా నవ్వాడు. "ఓకే— మరో సంగతి: మీ వాటా పైకం మీకెలా అందజేయాలి? అన్యాయంగా ఆర్జించే డబ్బులో వాటాలు న్యాయంగా చెల్లిపోవాలి! లేకపోతే ప్రమాదం అని చరిత్రలో చాలాసార్లు రుజువైంది!"

గణపతి మాట్లాడకుండా సిగరెట్ వెలిగించాడు. పొగ పీలుస్తూ ఆలోచిస్తూ వుండిపోయాడు. తల పైకెత్తి నిటలాక్షరావు మొహంలోకి సూటిగా చూశాడు.

"నిటలాక్షరావ్, వాటాలూ, గీటాలూ లేకుండా మొత్తం కోటా నీకే వచ్చేలా, ఒక ఉపాయం చెప్తాను. ఆ ప్రకారం చేస్తావా?"

నిటలాక్షరావు కళ్ళు పెద్దగా అయ్యాయి. ఆశ్చర్యంతో చూస్తూ, తల పంకించాడతను. "అలాంటి ఉపాయాలంటే నాకెంతో ఇష్టం!" అన్నాడు నవ్వుతూ.

"ఆరోజు, టెల్లర్ సీట్లో మనకి తోడ్పడే వ్యక్తి కూచుంటాడు. అతనికి నా గురించి పూర్తిగా తెలుసు. నువ్వు నా దగ్గర నాలుగుసార్లు లోన్ తీసుకున్నట్టు అతనికి తెలుసు. అతను గుంటనక్కలాంటి వ్యక్తి. నాకు తెలిసినంతవరకూ, అతను అధికంగా తెలుసుకున్నాడు. అఫ్‌కోర్స్, ప్రస్తుతం అతను నా చెప్పుచేతల్లో వున్నాడు. రేపొద్దున అతను నోరు తెరవొచ్చు. అతను నోరు తెరిస్తే మనిద్దరి కళ్ళూ శాశ్వతంగా మూత పడతాయ్!"

నిటలాక్షరావు కళ్ళు చిట్లిస్తూ చూశాడు. అతని కళ్ళల్లో ఏదో అనుమానం దొంగలా తొంగిచూస్తూంది. కళ్ళు వడగళ్ళలా తయారయ్యాయి. అతను ఊపిరి బిగబట్టాడు.

"యాభై వేల కోసం అతన్ని గాయపరచడానికి నువ్వు సిద్ధంగా వున్నావ్. ఆ చేసే గాయాన్ని ఆయువుపట్టులో చెయ్! ఆ తరువాత అతని మూలంగా మనిద్దరికీ ప్రమాదం రాదు...." గణపతి మెరుస్తున్న కళ్ళతో చూశాడు.

"నిటలాక్షరావ్, పథకం అమలు జరిగాక, మనిద్దరం పర్మనెంట్ పార్టనర్స్‌గా, దాదాపు అర్ధనారీశ్వరుడిలా రూపొందుతాం! నా గురించి నువ్వూ, నీ గురించి నేనూ నోరు విప్పలేం. కానీ....అతను త్వరలో రిటైరవుతాడు. బ్యాంకుకి సంబంధించిన పై ఉద్యోగులతో, చట్టంతో తెలివిగా ఒప్పందం కుదుర్చుకుని, అతను నన్ను వేలెత్తి చూపించవచ్చు. నా ద్వారా నా వేలితో నిన్నూ చూపించవచ్చు. అది...."

"వాడికి కపాలంలో గాయం అవుతుంది!" నిటలాక్షరావు అడ్డొస్తూ అన్నాడు. గణపతి తృప్తికరంగా నవ్వాడు.

"వెరీగుడ్. ఆ తరవాత అదంతా నువ్వు తీసేసుకో. నా ఆస్తిని నాకు పారేయ్! నేను నిన్నూ, నువ్వు నన్నూ మరిచిపోదాం! ఏమంటావ్?"

నిటలాక్షరావు నవ్వుతూ నిటారుగా నించున్నాడు. కుడిచేత్తో గణపతి చేతిని పట్టుకుని ఉత్సాహంగా ఊగించాడు. నవ్వుతూ అతని మొహంలోకి చూశాడు. గణపతి మెల్లిగా లేచాడు.

"గణపతీ, కంగ్రాట్స్! ప్లానింగ్‌లో నువ్వు నాతో సమానంగా ఎదిగావ్! ఇన్నాళ్ళూ చేసిన తప్పుకి శిక్ష

అనుభవించావ్. అది చాలు! ఫొటోల్ని ఇప్పుడే నీకు ఇచ్చేయాలనిపిస్తూంది. కానీ, పని పూర్తయ్యేదాకా మనిషికి పారితోషికం ఇవ్వకూడదు! అంతా అనుకున్నట్టు జరుగుతుంది! వెళ్ళిరా!"

"మధ్యలో నిన్ను కల్సుకోవాల్సి రావొచ్చు...."

"వెల్‌కమ్ ఎనీటైమ్! ప్రతిరోజూ సాయంత్రంలోగా నేను నీకు ఫోన్ చేస్తూవుంటాను. అవసరమైతే అపాయింట్‌మెంట్ ఫిక్స్ చేసుకో!" నిటలాక్షరావు ఉషారుగా అన్నాడు. గణపతి నిష్క్రమించాడు.

అయిదు నిమిషాల తరవాత నిటలాక్షరావు టేబుల్ కిందున్న రెండు బటన్స్ నొక్కాడు. నల్లటివ్యక్తి ప్రవేశించి. వినయంగా నిలబడ్డాడు. "నాగూ, బాత్‌రూమ్‌లో వున్న టేప్‌రికార్డర్ పట్రా. మన 'పార్టనర్' ప్లాన్ ఎలా రికార్డయ్యిందో విందాం!" అన్నాడు.

(ఇంకా వుంది)

దయ?

పొరుగింటి ప్రేమలేఖ

వసుంధర

"డియర్ జయంతీ!

"నీ వివాహమై ఇరవై సంవత్సరాలయింది. నువ్విప్పుడెలాగున్నావో చూడాలనుంది. ఆరోజులు నాకు బాగా గుర్తున్నాయి.

మన మిద్దరం మనసారా ప్రేమించుకున్నాం. ఒకరి నొకరు పెళ్ళి చేసుకోవా లనుకున్నాం. ధైర్యంగా ఆ

విషయం పెద్దలకు చెప్పాం. కానీ మీవాళ్ళూ, నావాళ్ళూ కూడా మన పెళ్ళికి అంగీకరించలేదు. నువ్వు నన్ను పెళ్ళిచేసుకుంటే మీ అమ్మ ఉరిపోసుకు చస్తానంది. మా నాన్న విషం మింగుతానన్నాడు. మనిద్దరికీ వాళ్ళ నెదిరించే ధైర్యం లేకపోయింది.

నీకు వెంటనే పెళ్ళి కుదిరింది. నీ పెళ్ళికి నేను వచ్చాను. పెళ్ళిపీటలమీద నా స్థానంలో మరో వ్యక్తిని చూసి దుఃఖాన్ని దిగమింగుకోలేకపోయాను. ఓరకంట నువ్వు నన్ను చూశావు. వీలు చూసుకుని ఏకాంతంలో— "వివాహమైనా నేను నీదాన్నే విశాల్! నువ్వేడిస్తే నేను చూడలేను" అన్నావు.

పెళ్ళైన వెంటనే నువ్వు కాపురానికి వెళ్ళలేదు. ఒక ఆర్నెల్లపాటు నీ భర్త వస్తూ పోతూ ఉండేవాడు. అప్పుడే మనమూ కలుసుకుంటూండేవాళ్ళం. ఆరోజులు, అనుభవాలు నాకు మరుపురావు.

జయంతీ! నేను నీకు సర్వదా కృతజ్ఞుణ్ణి.

మనం చేస్తున్నది తప్పేమో తెలియదు. కానీ ఇద్దరికీ కూడా ఈ సమాజంమీద ఏదో కసి. ఎవరిమీదో పగతీర్చు కుంటున్నామనుకుంటూ మనం సంతోషించాం. ఆ తర్వాత నువ్వు కాపురానికి వెళ్ళిపోయావు. వెళ్ళేముందు నా బిడ్డ నీ కడుపులో ఉన్నాడనీ—నా స్మృతిగా వాడినిస్తున్నందుకు ధన్యవాదాలనీ చెప్పావు. నాకెంతో సంతోషం కలిగింది.

జయంతీ: నాకూ వివాహమయింది. ఇద్దరు మగపిల్లలు ఒక ఆడపిల్ల. నా భార్య చాలా మంచిది. ఉత్తమురాలు. అనుకూలవతి. అయినా మన కథ ఆమెకు చెప్పలేదు.

జయంతీ!

నేను మీ ఊరు వస్తున్నాను. ఒక్కసారి నిన్నూ, మన

బ్బాయినీ చూసుకుని వెడతాను. నీవైతే నా స్మృతిని మన బిడ్డలో చూసుకుంటున్నావు. నాకలాంటవకాశం లేదుకదా! అందుకే ఒక్కసారి....

ఇప్పుడు కోరికలు చల్లారాయి. జీవితం పచ్చగా ఉంది. నిన్ను చూడాలని తప్ప మరే దురుద్దేశ్యమూ నాలో లేదు. నన్నాదరిస్తావు కదూ!

నీ

విశాల్"

ఉత్తరం చూచి రామబ్రహ్మం ఉలిక్కిపడ్డాడు.

ఆ ఉత్తరాన్నతడామె టేబిలుమీద చూశాడు.

అప్పుడు రామబ్రహ్మం భార్య స్నానాల గదిలో ఉంది. పిల్లలింకా నిద్ర లేవలేదు. మామూలుగా అయితే రామ బ్రహ్మం కూడా అప్పుడే నిద్ర లేవడు. భార్య స్నానం చేసివచ్చి - "లేచి మొహం కడుక్కోండి. కాఫీ రెడీ అవుతోంది" అన్నాకే అతడు నిద్ర లేస్తాడు.

కానీ ఎందుకో ఆ రోజతడికి మెలకువ వచ్చేసింది. కారణం అతడూహించగలడు.

భార్య రుక్మిణి అతడికంటే ముందుగా నిద్ర లేస్తుంది. కానీ ఆ రోజు చాలా ముందుగా లేచిపోయింది. ఆమె లేచిన కాసేపటి కతడికి మెలకువ వచ్చేస్తుంది, బద్ధకం కొద్దీ కళ్ళు తెరవడంతే!

ఆ రోజు భార్య పక్కలో లేక నిద్ర పట్టక అటూ యిటూ కదిలి మధ్యలో ఓసారి సగం కళ్ళు తెరిచి గదిలో చూశాడు.

అప్పుడు రుక్మిణి కుర్చీలో కూర్చుని టేబిలు మీదకు వంగి ఏమో రాసుకుంటోంది.

రామబ్రహ్మం ఉలిక్కి పడ్డాడు.

ఏమయింది రుక్మిణికి? ఇంత పెందరాళే లేచి ఏమిటి రాసుకుంటోంది?

ఈ ఆలోచనలతో అతడి మత్తు వదిలిపోయింది. అతడామెనే ఓరకంట చూడసాగాడు. కాసేపటి కామె కుర్చీలోంచి లేచింది. ముఖం కడుక్కుని స్నానాల గదిలోకి వెళ్ళింది.

స్నానానికి వెడితే అరగంటదాకా బయటకు రాదామె.

ఒక్క రోజులో రామబ్రహ్మం పిల్లలు - గదినెందుకూ పనికిరాకుండా తయారు చేస్తారు. రుక్మిణి ఆ గదిని ఫైవ్ స్టార్ గదిలా మార్చగలదు. అందుకే ఆ యింట్లో అంతా ఆమె తర్వాతనే స్నానం చేస్తామంటారు.

ఆమె స్నానాల గదిలో అడుగు పెట్టగానే రామబ్రహ్మం లేచి బల్ల దగ్గిరకు వెళ్ళాడు. బల్లమీద ఉత్తరం!

ఎవరీ జయంతి?

ఉత్తరంతోపాటు బల్లమీద డైరీ కూడా ఉంది.

అప్పుడు రామబ్రహ్మానికి గుర్తొచ్చింది. ఇందాకా రుక్మిణి ఏదో రాసింది. ఉత్తరం ఆమె రాసింది కాదని దస్తూరీనిబట్టి ఊహించుకోవచ్చు.

అంటే ఆమె డైరీ రాసి ఉండాలి.

రామబ్రహ్మం భార్య డైరీని చదివాడు. అది చదవాలన్న ఆసక్తి కూడా అతడికి లేదు. ఆమె క్రమం తప్పకుండా డైరీ వ్రాస్తుందని మాత్రం అతడికి తెలుసు.

జయంతి ఎవరో తెలుసుకుందుకు డైరీ ఉపకరిస్తుందని అతడికి తోచింది. వెంటనే డైరీ తెరిచాడు.

వారం రోజుల డైరీ చదివితే అతడికి జయంతి ఎవరో తెలిసిపోయింది.

ఆమె పొరుగింటి కళ్యాణవర్మ భార్య. కళ్యాణవర్మ

ట్రాన్స్ఫర్ మీద ఆ ఊరొచ్చి ఆర్నెల్లయింది.

జయంతికి నలభై ఏళ్ళుండవచ్చు. కానీ చూడ్డానికి పాతికేళ్ళు మించవనిపిస్తూంది. ఇప్పటికీ ఎంతో అందంగా నాజూగ్గా ఉంటుంది.

అందంలో, ఆకర్షణలో, వయసులో ఒకరి కొకరు తీసి పోకుండా ఉంటారు జయంతి, రుక్మిణి. అందుకే ఇద్దరికీ మంచి స్నేహమయింది.

రుక్మిణి డైరీలో వ్రాసుకున్న ప్రకారం—ఆ ఉత్తరం జయంతిది. పోస్టుమన్ పొరపాటున రుక్మిణి కిచ్చాడు. రుక్మిణి చింపి చదివేసింది. అందులో ఆంతరంగికమూ, ఇబ్బందికరమూ అయిన విశేషాలున్నాయి. అందుకని ఆ ఉత్తరం జయంతికెలా అందజేయాలో తెలియక మధన పడుతోంది రుక్మిణి. అదీకాక కల్యాణవర్మ మంచివాడు కాదు. పెళ్ళయినప్పట్నించీ అతడికి భార్యంటే అను మానం. ఆ అనుమానం ఇప్పటికీ కొనసాగుతోంది. అత డామెను ఒంటరిగా బయటకు వెళ్ళనివ్వడు. ఇంట్లో తర చుగా సూటి పోటి మాటలతో బాధిస్తూంటాడు.

రుక్మిణికి జయంతి తన భర్త గురించి చెప్పుకుని బాధ పడుతూంటుంది ఇప్పు డీ ఉత్తరం వచ్చింది.

ఈ ఉత్తరం భర్తచేతిలో పడితే జయంతి పని అయి పోతుంది. రహస్యంగా జయంతి చేతికిస్తే తన రహస్యం రుక్మిణికి తెలిసిపోయిందనీ - ఆమె దృష్టిలో తను చులకనై పోయాననీ బాధపడుతుందామె.

ఇంతకాలం జయంతి రుక్మిణికి తన భర్త దౌష్ట్యం గురించి చెప్పుకుంటోంది. అందువల్ల రుక్మిణి ఆమెకు చేయగల సాయ మేమీలేదు. ఏదో మానసిక తృప్తి - అంతే!

ఇప్పుడు జయంతిలో దోషమున్నదనీ-భర్త ప్రవర్తనలో తప్పులేదనీ రుక్మిణి అనుకుంటుంది. ఆ భావన వారి స్నేహానికి మధ్య అడ్డుగోడ అవుతుంది.

నాకు చేతనైతే జయంతి భర్త ఆలోచనల్లో మార్పు తీసుకుని రావాలి. కానీ ఎలా? అని వ్రాసుకుంది రుక్మిణి.

రామబ్రహ్మం వెంటనే డైరీ బల్లమీద పెట్టి ముఖం కడుక్కునేందుకు వెళ్ళిపోయాడు. ముఖం కడుక్కుంటున్నంతసేపూ అతడికి జయంతి గురించిన ఆలోచనే:

జయంతిని చూస్తే ఆమె అలాంటిదనిపించదు. ఎంతో అమాయకంగా కనబడుతుంది.

ఒకే ఒక్కసారి అత డామెను బాగా దగ్గిర్నుంచి చూశాడు.

ఒకరోజున రామబ్రహ్మం అనుకోకుండా ఆఫీసుకు సెలవుపెట్టాడు. మధ్యాహ్నం ఎవరో తలుపుతడితే తనే వెళ్ళి తలుపుతీశాడు.

గుమ్మం దగ్గిర జయంతి!

ఆమె అతణ్ణి చూసి మొహమాటంగా నవ్వి—"మీ కీరోజు ఆఫీసు లేదా? నేను వచ్చి వెళ్ళానని రుక్మిణికి చెప్పండి—" అనేసి వెంటనే వెళ్ళిపోయింది. ఆమె నవ్వు నిర్మలంగా, పవిత్రంగా ఉంది. ఆమె సిగ్గు అతడికి చెల్లెల్ని గుర్తుచేసింది

జయంతి అంటే మంచి అభిప్రాయ మతడికి.

"ముఖం చూసి మోసపోకూడదు...." అనుకున్నా డతడు.

స్నానం చేసివచ్చిన రుక్మిణి అప్పటికే భర్త ముఖం కడుక్కోవడం చూసి ఆశ్చర్యపోయి—"అరే—అప్పుడే

లేచిపోయా రేమిటి?" అంది.

"ఈరోజు స్నానం చేశాకే కాఫీ—నేను కూడా?" అన్నాడతడు.

"మంచి అలవాటే—కానీ ఈ రోజు శనివారమైనా కాదు. ఎందుకూ పనికిరాని బుధవారం అయింది...." అని నిట్టూర్చింది రుక్మిణి.

"మనమేరోజు మంచిపని చేస్తే అదే పుణ్యదినం—" అంటూ రామబ్రహ్మం స్నానాలగదికి వెళ్ళాడు. అతడు స్నానాల గదినుంచి తిరిగివచ్చేసరికి రుక్మిణి కాఫీ గ్లాసుతో సిద్ధంగా ఉంది.

రామబ్రహ్మం కాఫీ చప్పరిస్తూ—"రుక్కూ నీతో-ఓ విషయం మాట్లాడాలి - పిల్లలు స్కూలుకు వెళ్ళేక...." అన్నాడు.

పిల్లలు ఎనిమిదిన్నరకల్లా బయల్దేరి స్కూలుకు వెళ్ళి పోతారు. అతడి ఆఫీసు పదిన్నరకు. పదింపావుకల్లా స్కూటర్ మీద బయల్దేరుతా డతడు.

"ఈరోజు పిల్లలు స్కూలుకు వెళ్ళరు. వాళ్ళకి సెలవు. తొమ్మిదిదాకా నిద్రలేపొద్దని రాత్రే వాళ్ళు నాకు చెప్పేశారు...." అంది రుక్మిణి.

"సరే—అయితే ఇప్పుడే చెప్పేస్తాను—" అన్నాడు రామబ్రహ్మం.

"ఏమిటండీ—చాలా సీరియస్‌గా కనబడుతున్నారు!" అంది రుక్మిణి.

"నిజంగానే సీరియస్‌గా ఉన్నాను రుక్కూ!"

"చెప్పండి...."

"నేను చెప్పబోయేది జయంతి గురించి...."

రుక్మిణి ఉలిక్కిపడి—"ఏ జయంతి?" అంది.

"నటించకు—నేను చదవాలనేకదా ఉత్తరం, డైరీ టేబిల్ మీద వదిలేశావు—...." అన్నాడు రామబ్రహ్మం.

"అంటే ఆ ఉత్తరం, డైరీ చదివేశారన్నమాట.... ఎప్పుడూ నన్నడక్కుండా నాకొచ్చిన ఉత్తరం కూడా చదవని మీరు—ఎంతపని చేశారండీ?" అని బాధపడింది రుక్మిణి.

రామబ్రహ్మం ఆశ్చర్యంగా—"నేను చదివితే తప్పేముంది? నీకూ నాకూ మధ్య రహస్యాలేముంటాయి!" అన్నాడు.

రుక్మిణి నిట్టూర్చి—"మనిద్దరి మధ్యా రహస్యాలుండకూడదనీ, లేవనీ నేనూ ఒప్పుకుంటాను. కానీ జయంతి రహస్యం మీకు తెలియడం నాకిష్టం లేదు" అంది.

"ఎందుకని?"

"మన సమాజంలో మగాడికున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఆడదానికి లేవు. అందుకని ఆడవాళ్ళ రహస్యాలు ఆడవాళ్ళ మధ్యనే ఉండటం మంచిది తప్ప మగాళ్ళదాకా వెళ్ళకూడదు...."

రామబ్రహ్మం నొచ్చుకుని—"ఇన్నేళ్ళ కాపురంలో నువ్వు నన్ను నీవాడిగా కాక మగాడిగా మాత్రమే గుర్తించావన్నమాట...." అన్నాడు.

"అయాం వెరీ సారీ! కానీ నేనన్నమాటే అన్నాను. ఈ సమాజంలో మగాళ్ళంతా ఒక్కటే! అందుకు నేను మిమ్మల్ని తప్పుపట్టను. నేను స్నానంచేసి వచ్చేదాకా మీరు లేవరని నమ్మకం. లేచినా నా కాగితాలు మీరు చూడరని నా నమ్మకం. నా రెండు నమ్మకాలూ వమ్మైపోయి—జయంతి రహస్యం మీదాకా చేరిపోయింది...."

"అందువల్ల నష్టమేదైనా ఉందా?"

"ఎందుకు లేదు? ఉత్తరం, డైరీ చదివితే మానవత్వ మున్న వారి కెవరికైనా జయంతి పరిస్థితి చూస్తే జాలి వేస్తుంది కానీ మగాడికి ఆడదాని విషయం వచ్చేసరికి మానవత్వ ముండదు. నిజం చెప్పండి—ఈ ఉత్తరం చదవగానే మీకు జయంతి అంటే తేలికభావం కలగలేదూ?" అంది రుక్మిణి.

రామబ్రహ్మం ముందు తెల్లబోయాడు. తర్వాత తడబడ్డాడు.

"నిజం చెప్పండి. నేను మిమ్మల్ని తప్పుపట్టను. మన సమాజంలోని ప్రతి మగాడూ ఒకేలా ఆలోచిస్తాడు...." అంది రుక్మిణి.

"నేనెలా ఆలోచిస్తే నీకు నచ్చుతుందీ చెప్పు" అన్నాడతడు.

రుక్మిణి నవ్వి—"నేను చెప్పేది మీకు నచ్చదు—" అంది.

"ఫరవాలేదు—చెప్పు!"

"చెప్పేక మీరు నన్నుకూడా అనుమానిస్తారని నా భయం...."

రామబ్రహ్మం ఉలిక్కిపడి—"అంటే?" అన్నాడు.

"మీ మగాళ్ళు బార్లలోకి వెళ్ళి తాగుతారు. ఆడవాళ్ళ గురించి అసభ్యంగా చర్చిస్తారు. అవకాశమొస్తే పరాయి ఆడదాన్ని చేరదీస్తారు. తప్పు బైటపడితే—వయసులోని తొందరపాటనీ, మన్నించమనీ అంటారు. మన్నించక పోవడం ఒక నేరంగా భావిస్తారు. అదే ఆడదైతే కండకావరమంటారు. ఆత్మహత్య చేసుకుని చావమంటారు...." అంది రుక్మిణి.

"ఈ సోదంతా దేనికి? నువ్వు చెప్పదల్చుకున్నది చెప్పు...."

"చెబుతున్నాను వినండి! వయసు చెడ్డది. అది స్త్రీ పురుషులిద్దర్నీ దగ్గిర చేస్తుంది. అలాంటి సందర్భంలో అను కోకుండా తప్పులు జరగవచ్చు. విశాల్, జయంతిల విష యంలో అలాంటి తప్పే జరిగింది. వాళ్ళా తప్పును సవ రించుకోవాలనే అనుకున్నారు. కానీ పెద్దలందు కంగీక రించలేదు. అంటే అందులో తప్పు పెద్దలదే కానీ వాళ్ళది కాదు. జయంతికి వేరే పెళ్ళి జరిగింది. విశాల్‌కి వేరే పెళ్ళి జరిగింది. జయంతి భర్తకూ, విశాల్ భార్యకూ జయంతిలోనూ, విశాల్‌లోనూ ఇన్నేళ్ళ కాపురంలోనూ కూడా తప్పులు కనపడలేదు. అంటే ఈ తప్పు కంటికి కనిపించేదికాదు. చెబితేనే తెలుస్తుంది. అలాంటి తప్పును తప్పుగా కాక మానవసహజంగా భావించడంలో మానవత్వ ముంది. కాదంటారా?"

రామబ్రహ్మం మాట్లాడలేదు.

"జరిగిపోయిన విషయాన్ని వాళ్ళిద్దరూ మర్చిపోయారు. వాళ్ళు మామూలు స్నేహితులుగా ఉండాలనుకుంటున్నారు. అందువల్ల జయంతికేమైనా ఇబ్బంది కలిగితే అందుకు మీ సానుభూతి ఉండాలి. కాదంటారా?"

"రుక్కూ—నాకు జయంతిపట్ల సానుభూతి ఉంది" అన్నాడు చటుక్కున రామబ్రహ్మం.

"అయితే నేను చెప్పినట్లు చేస్తారా?"

"ఏం చేయాలి?"

"జయంతి తన ప్రేమను భర్తకే పంచి ఇచ్చింది. కానీ ఆమెకూ విశాల్‌కూ సంబంధముందని భర్తకు తెలిస్తే అతడామెకు విడాకులిస్తానంటాడు. అతణ్ణి మీరు సంస్క

రించాలి....”

“ఎలా?”

“మీకేమైనా మంచిమార్గం తోస్తే చెప్పండి. లేకుంటే నేనే నాకు తోచింది చెప్తాను....”

“ప్రయోజనం లేనిచోట నా బుర్ర పనిచేయదే!”

“ప్రయోజన ముంటుంది....”

“ఇంతకాలం మీరు నా ప్రేమను రుచి చూశారు. నచ్చిందా?”

“బోలెడు నచ్చింది....”

“అది వదులుకోగలరా?”

“అమ్మో!” అన్నాడు రామబ్రహ్మం.

“అయితే వినండి. మీరు జయంతి భర్తను మార్చ డంలో సాయపడితే—ఇప్పటి నా ప్రేమ రెట్టింపవుతుంది. సాయపడకపోతే ఉన్న ప్రేమ సగానికి తగ్గిపోతుంది....” అంది రుక్మిణి.

రామబ్రహ్మం కాసేపాలోచించి—“ఎంత ఆలోచించినా నాకేం తట్టడంలేదు. అందులోనూ నీ దగ్గర పథకం సిద్ధంగా ఉందని తెలిసేక నా బుర్ర అసలే పనిచేయదు..” అన్నాడు.

రుక్మిణి అప్పుడతడేం చేయాలో వివరించింది. ఆమె చెప్పిన ప్రకారం అతడు కళ్యాణవర్మతో స్నేహాన్ని మరింతగా పెంచుకోవాలి. మాటల సందర్భంలో విశాల్ ప్రసక్తి తీసుకుని వచ్చి అత డిక్కడకు వస్తున్నట్లు చెప్పాలి.

“విశాల్ ఎవరని అతడడిగితే?”

“పెళ్ళికి ముందు నేనూ, విశాల్ ప్రేమించుకున్నామని అబద్ధం చెప్పండి. పెద్దలు మా పెళ్ళికి ఒప్పుకోకపోతే—

తర్వాత మన పెళ్ళి జరిగినట్లు చెప్పండి—" అంది రుక్మిణి.

"అందువల్ల ప్రయోజనం?"

"చాలా ప్రయోజనముంది. మీరు విశాల్ అంటే అసూయ ప్రకటించరు. అతడితో స్నేహమున్నట్లు మాట్లాడుతారు. మా పవిత్రతను విశ్వసిస్తున్నట్లూ. మా గతం గురించి పట్టించుకోనట్లూ మాట్లాడుతారు. అప్పుడు కళ్యాణవర్మ తన తప్పు తెలుసుకుంటాడు. స్త్రీ పురుషుల సంబంధం గురించిన అపోహలన్నీ తొలగిపోతాయి. విశాల్‌ను ద్వేషించడం తప్పని గ్రహిస్తాడు...."

"నిజంగా అలా జరుగుతుందా?"

"తినబోతూ కూర రుచి అడగడ మెందుకు?"

"అంటే నేను తింటున్నానన్నమాట—ఎలాగైనా తెలివైన దానివి. నాచేత ఒప్పించేశావు...." అన్నాడు రామబ్రహ్మం.

2

రామబ్రహ్మానికీ, కళ్యాణవర్మకూ అంత వరకూ అంతంత మాత్రం పరిచయముంది. రామబ్రహ్మం పూనుకోవడంతో ఆ పరిచయం బాగా వృద్ధి చెందింది. అతడు విశాల్ గురించి చెబుతూంటే కళ్యాణవర్మ నిజంగానే తెల్లబోయాడు.

"మీరు చాలా అమాయకుల్లా ఉన్నారు. నేనైతే యీ విషయం తెలిస్తే పెళ్ళానికి విడాకు లిచ్చి ఉండేవాణ్ణి—...."

"ఎందుకు?"

"ఆడది పెళ్ళికి ముందో మగవాణ్ణి ప్రేమించిందంటే — తప్పకుండా అప్పటికే శరీరా న్నర్పించి

ఉంటుంది— ...."

"ఆ మాత్రం నేనూ అర్థం చేసుకోగలను...."

"అన్నీ తెలిసీ ఆమెను మీరు క్షమించగలరా?"

"డియర్ వర్మగారూ! పెళ్ళికి ముందు ఏ ఆడ దెలా తిరిగిందో యెవరూ చెప్పలేరు. ఆడదాని పవిత్రతను కొలవడానికి సాధనంలేదు. అందుకే పెళ్ళికి ముందు పవిత్రత గురించి నేను పట్టించుకోలేను. పెళ్ళయ్యాక నన్ను మాత్రమే యిష్టపడితే చాలు...."

"అందుకు ఋజు వుంటుందా?"

"భార్యాభర్తల అనుబంధానికి కావలసింది ఋజువులు కావు. నమ్మకం. వారికి ఉన్న ప్రేమనుబట్టి నమ్మకం ఏర్పడుతుంది. ఒక స్త్రీని గతం గురించి అడక్కుండా భార్యగా మనస్ఫూర్తిగా ఆదరిస్తే—ఆ స్త్రీనుంచి ఎలాంటి ప్రేమ లభిస్తుందో నా జీవితానుభవమే సాక్ష్యం...."

"మిమ్మల్ని మీరు మోసం చేసుకుంటున్నారు. విశాల్‌ని మీరు ద్వేషిస్తూంటారని నా అనుమానం...." అన్నాడు కళ్యాణవర్మ.

"విశాల్ అంటే నాకు ద్వేషమెందుకు? మే మిద్దరం మంచి స్నేహితులం...." అన్నాడు రామబ్రహ్మం.

"నేను నమ్మలేను...."

"ఈసారి అతడెప్పుడైనా మా యింటికి వస్తే—మీకు పరిచయం చేస్తాను...."

"అతడు మీ యింటికి వస్తూంటాడా? వస్తే ఆమె గతంలో చేసిన తప్పే మళ్ళీ చేయదని నమ్మకమేమిటి?...."

"డియర్ వర్మగారూ! అపనమ్మకమున్న మనిషిని నమ్మకం గురించి ప్రశ్నించాలి. నా శ్రీమతి నన్ను మోసం

చేస్తే అది నాకు తెలియకుండా జరుగుతోంది. నాకు తెలియకుండా జరిగే విషయాల నూహించుకుని నేను బాధపడలేను. విశాల్ స్నేహభావంలోగానీ. రుక్మిణి ప్రేమలోగానీ నాకే అపస్వరమూ అనిపించనంతకాలం నేను వాళ్ళను నమ్ముతూనే వుంటాను....” అన్నాడు రామబ్రహ్మం.

“ఈసారి విశాల్ మీ యింటికి వచ్చినపుడు నాకూ పరిచయం చేయండి—....” అన్నాడు కళ్యాణవర్మ.

“ష్యూర్—” అన్నాడు రామబ్రహ్మం.

3

జరిగేది యెప్పటికప్పుడు భార్యకు తెలియపరుస్తున్నాడు రామబ్రహ్మం.

“మీరు చాలా మంచిపని చేస్తున్నారు. ఇప్పుడు కళ్యాణవర్మలో మార్పు వస్తున్నట్లు జయంతి చెబుతోంది....” అంది రుక్మిణి.

“జయంతికి నువ్వన్నీ చెప్పేశావా?”

“ఊఁ”

“ఆమెకు చెప్పకుండా ఉండాల్సింది—” అన్నాడు రామబ్రహ్మం.

“చెప్పందే ఎలా కుదురుతుంది?”

“ఆమె గురించి నాకు తెలిసిందంటే ఆమె మొహమాటపడదూ?”

“ఇన్నాళ్ళకు మీ ఆలోచన మంచిదారిలో పడింది. అయితే నేను జయంతికి విశాల్ గురించిన రహస్యం నాకు తెలిసినట్లు చెప్పలేదు...”

“మరి?”

“కళ్యాణవర్మను సంస్కరించడానికి మీరు విశాల్ అనే పాత్ర నెన్నుకున్నట్లు చెప్పాను. పొరపాటున అందుకున్న

ఆమె ఉత్తరాన్ని ఆమె అడ్రెసుకు మళ్ళీ పోస్టులో పంపాను. నేను విశాల్ గురించి చెప్పగానే ఆమె తడబడి తనకూ విశాల్ అనే ప్రియుడున్నట్లు ఒప్పుకుని ఉత్తరం కూడా చూపించింది...."

రామబ్రహ్మం ఆశ్చర్యంగా - "ఆమె నీకా ఉత్తరం చూపించిందా?" అన్నాడు.

"అవునండీ—విధిలేక చూపించింది. ఆమెకు విశాల్ నిక్కడికి పిలవాలనే ఉంది ..."

"అయితే?"

"విశాల్ మనింటికి వస్తాడు. మీ రతణ్ని కళ్యాణ వర్మకు పరిచయం చేస్తారు...."

"ఓహ్—అర్థమయింది...." అన్నాడు రామబ్రహ్మం. కానీ అతడికి తృప్తిగాలేదు.

ఎలాంటి ఆడది జయంతి?

పెళ్ళికిముందు పరాయి మగాడితో సంబంధం పెట్టుకుంది. తొలిబిడ్డ అతడికే చెందితే భర్తకు చెందినట్లు నమ్మించింది. ఇన్నేళ్ళు కాపురం చేశాక పాతప్రియుణ్ని చూడాలనుకుంటోంది. తన బిడ్డను చూపాలనుకుంటోంది.

తన భావాల నతడు భార్యకు చెప్పలేదు కానీ— "జయంతిని భర్త అనుమానిస్తున్నాడంటే - అందుకు పూర్తిగా అతణ్ణి తప్పుపట్ట నవసరంలేదేమో - నువ్వు నన్ను ప్రేమించినట్లామె అతణ్ణి ప్రేమించడంలేదేమో.." అని మాత్రం భార్యతో అన్నాడు.

"కళ్యాణవర్మతో చనువుగా తిరుగుతున్నారు గదా— అతడి వ్యక్తిత్వం గురించి మీ కృలిగిన అభిప్రాయ

మేమిటి?" అంది రుక్మిణి.

"అంత మంచివాడనిపించదు ...."

"జయంతిని చూస్తే ఏమనిపిస్తుంది?"

"అమాయకురా లనిపిస్తుంది ...."

"ఫేసీజ్ ది ఇండెక్సాఫ్ మైండ్ అన్న సామెత ఎందుకొచ్చిందో తెలుసా? మనసులో భావాలు ముఖంలో ప్రతిఫలిస్తాయని....దీన్నిబట్టి లోపం ఎవరిలో ఉందో మీరే చెప్పండి ...."

"ఏమీ అనుకోకు రుక్కూ: ప్రియుడికి బిడ్డను కని ఆ బిడ్డను - ఇన్నేళ్ళ తర్వాత - ప్రియుడికి చూపించాలనుకోవడం మనసులో పవిత్ర భావాలున్నట్లు ఋజువు చేస్తుందా?" అన్నాడు రామబ్రహ్మం తటపటాయిస్తూ.

"మంచి ప్రశ్నే వేశారు. కాపీ దీనికి సమాధానం తెలుసుకోవాలంటే మంచితనపు లోతులు ముందుగా అర్థం చేసుకోవాలి ...." అంది రుక్మిణి.

"చెప్పు—తెలుసుకుంటాను ...."

"తన పెద్దకొడుకును జయంతి అత్తవారింటికి పంపిస్తుంది—ఏదో వంకన. ఎందుకో తెలుసా?"

"ఎందుకు?"

"వాడివి అచ్చుగుద్దినట్లు కళ్యాణవర్మ పోలికలు ...."

రామబ్రహ్మం తెల్లబోయాడు. ఆడదాన్ననుమానించడంలో పురుషుడు పొందే ఆనంద మేమిటో తెలియదు కానీ - అతడికి కళ్యాణవర్మ పెద్దకొడుకువి పూర్తిగా తండ్రి పోలికేనన్న విషయం — ఇంకా ముందే తెలుసు.

"అయామ్ సారీ రుక్కూ! కానీ విశాల్ ఉత్త

రంలో మరి అలా ఎందుకు రాశాడు?" అన్నాడు రామ బ్రహ్మం.

"అందుకే నేను మంచితనపు లోతుల గురించి మాట్లాడాను-" అంది రుక్మిణి.

జయంతి వయసు వేడిలో విశాల్‌ను నిజంగానే ప్రేమించింది. అతణ్ణి పెళ్ళిచేసుకోవాలనుకుంది. కానీ కుదరలేదు. ఆమె వివాహం కళ్యాణవర్మతో జరిగింది. అనుకున్నది నెరవేరలేదన్న ఆవేశంలో విశాల్‌కు లోబడింది కానీ నిజంగా అతడి బిడ్డకు తల్లికాలేదు. ఎక్కడో దూరంగా ఉండే విశాల్‌కు తన ప్రేమను నిరూపించుకోవాలన్న భావం కలిగి అతడికి అబద్ధం వ్రాసిందామె. అతడికి ఆమె దగ్గరైనమాట నిజం. ఆ నిజానికో చిన్న అబద్ధం జోడించి అతణ్ణి సంతోషపెట్టింది. అందువల్ల తనకు కలిగే నష్టమేమీలేదని ఆమె అనుకుంది. ఇప్పుడు విశాల్ తన్ను చూడ్డానికి వస్తూంటే—ఇన్నేళ్ళుగా అతడిలో ఉన్న నమ్మకంమీద దెబ్బ తీయడం ఇష్టంలేక తన పెద్దకొడుకుని వేరే పంపిచేస్తోంది.

రామబ్రహ్మం భార్య చెప్పగా విని జయంతి మంచితనాన్నర్థం చేసుకుందుకు ప్రయత్నిస్తున్నాడు.

4

"డియర్!

"నీవు వెంటనే బయల్దేరిరా నే నిచ్చిన చిరునామాకు. నాకూ నిన్ను చూడాలనుంది. కానీ చూడాలని మాత్రమే ఉంది.

"నే నిప్పుడు నా భర్తను త్రికరణశుద్ధిగా ప్రేమిస్తున్నాను. కలలో కూడా ఆయన కన్యాయం చేయలేను.

కాపీ నీకూ, నాకూ ఉన్న సంబంధాన్ని తెలిసిన ఓ దుర్మార్గుడు నన్ను బ్లాక్ మెయిల్ చేసి లోబర్చుకోవాలనుకున్నాడు. వాడి బారినుంచి ఎలా తప్పించుకున్నానో నీకు నేను స్వయంగా చెబుతాను. వాడికి నిన్ను పరిచయం కూడా చేస్తాను.

"నా భర్తకు మన సంబంధం గురించి తెలియనివ్వలేదు. ఆయన్ను మానసికంగా శుభ్రపర్చడానికి నీపేరే ఉపయోగించుకున్నాను. నీ కారణంగానే ఆ దుష్టుడిలోనూ మార్పు వచ్చింది.

"నా పిల్లల్ని చూసే అవకాశంలేదు. వాళ్ళు కొన్నాళ్ళపాటు మేనమామల ఇంటికి వెడుతున్నారు. అన్యథా భావించకు.

"నీకు నన్ను చూడాలనుంది. నాకూ నిన్ను చూడాలనుంది. అంతకుమించి నన్నూ, మావారినీ కలిపి చూడాలనుంది. అందుకే ఈ ఆహ్వానం.

"వెంటనే బయల్దేరిరా....

నీ

ఒకనాటి ప్రేయసి—

P. S: అన్నట్లు నువ్వు రాసిన ఉత్తరంలో డియర్ అని వ్రాసి ఊరుకున్నావు. ఆ పక్కన జయంతీ అని వ్రాసి ఆ ఉత్తరాన్ని మావారికి చూపించి కథ నడిపించాను. ఆ విశేషాలేమిటంటే...."

ఇంకా వ్రాయాలా మానాలా అని ఆలోచిస్తూ ఆగిపోయింది రుక్మిణి.

ఆమె తర్వాత కథ రాసినా రాయకపోయినా మన కథమాత్రం ఇక్కడే ఆగిపోతుంది. □

తననేరబటగవ్వ

డి.వి.వి.సత్యనారాయణ

విజయవాడ స్టేషన్....

ఉదయం తొమ్మిదిన్నర అవుతోంది.

సికిందరాబాద్ వెళ్ళే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర లేటుగా వచ్చి ప్లాటుఫారం మీద ఆగింది.

జనాలు హడావిడిగా అటూ యిటూ తిరుగుతున్నారు.

కొందరు ఇడ్లీలు, వడలు కొనుక్కుని తింటున్నారు. మరి కొందరు తాము తిని బండిలో వున్న తమ వాళ్ళకి పట్టుకెళుతున్నారు.

'ఎఫ్' కోచ్‌లో కిటికీ దగ్గిర కూర్చున్నతను తన

భార్యతో 'టిఫిన్ తెస్తానుండు' అని చెప్పి బయటికి వచ్చాడు.

ఐదు నిమిషాలు పోయాకా ఆమె వద్దకు ఒక యువకుడు వచ్చి 'మీరేనా సరోజగారంటే?' అని అడిగాడు.

ఆమె "అవును" అంది.

"మీవారు విశ్వంగారు అక్కడ టిఫెన్ తింటున్నారు. కాఫీ తేవడానికి ఫ్లాస్కు ఇమ్మన్నారు."

అలాగా అని ఆమె ఫ్లాస్కు తీసి ఇచ్చింది. అతను వెళ్ళిపోయాడు. ట్రెయిన్ బయలుదేరబోతోంటే ఆమె భర్త విశ్వం వచ్చాడు.

"ఫ్లాస్కు మర్చిపోయారా? కాఫీ ఏదీ?" అని అడిగిందామె.

"ఏం కాఫీ కావాలా! ఆ మాట ముందు చెప్పి ఫ్లాస్క్ ఇవ్వవచ్చుగా?"

"పంపించానుగా ఫ్లాస్క్!"

కాసేపటికి ఆ దంపతులకు తాము మోసపోయామని అర్థమైంది. ఎవరడిగినా ఇచ్చేయడమేనా? అని భర్త భార్యని కేకలేశాడు.

2

మీనాక్షి వడియాలు పెడుతోంది.

"ప్రసాద్‌గారూ!"

గుమ్మంలో పిలుపు విని ఆమె వస్తున్నా అని చేతులు కడుక్కుని వచ్చింది. గుమ్మంలో ఒక యువకుడు నిలబడి వున్నాడు.

"ఏం బాబూ! ప్రసాద్‌గారు ఊళ్లో లేరు."

"రామ్మూర్తి మాస్టారు పంపారు."

"అలాగా, ఏమిటి విషయం?"

"మాస్టారు తిరుపతి వెళుతున్నానని చెప్పారు కదండీ!"

"అవును. ఏం ప్రయాణం మానుకున్నారా?"

"లేదండి. సాయంత్రం తిరుమలలో వెళుతున్నారండి. నిన్న అడుగుదామని మర్చిపోయారట. వీలుంటే ఈ నెల ఫీజు ఇమ్మని చెప్పమన్నారండి."

మీనాక్షి నవ్వి, "ఆయన మర్చిపోలేదు. మొహమాట పడ్డారు. మొన్న డబ్బులు కావాలా అని అడగితే వద్ద న్నారు. సరేలే! ఎల్లుండి ఎలాగూ ఫస్టేగా! నెల జీతం పూర్తిగా ఇవ్వమన్నారా?"

"ఆ(....వందా ఇమ్మన్నారండి." డబ్బు లోపలనుండి తెచ్చి ఆవిడ ఇచ్చాకా అతను వెళ్ళిపోయాడు.

ఆ ఇంటి ట్యూషన్ మాస్టరు రామ్మూర్తికి వచ్చేదాకా విషయం తెలియదు పాపం!

3

"సరస్వతీ విజ్ఞాన కేంద్రము."

విజయవాడలో పేరు పొందిన పాఠశాల అది. ప్రిన్సిపాల్ శ్రీమతి సరస్వతి పదకొండు గంటలకు క్లాసులన్నీ ఒకసారి విజిట్ చేసి కాంపౌండులో తిరుగుతున్న పిల్లలను కేకలేసి రూముల్లోకి పంపి ఆఫీసు రూములో అడుగు పెట్టింది. ఆఫీసు రూములో అడుగు పెడుతూ రూము బయట తనకి విష్ చేసిన యువకుడ్ని గమనించిం దామె.

ఆమె కాలింగ్ బెల్ కొట్టి ప్యూన్ వచ్చాకా "బయట నున్న ఆయన్ని పిలు" అంది.

"గుడ్ మార్నింగ్ మేడమ్" అంటూ వచ్చాడు ఆ యువకుడు. "అయామ్ అరవింద్. అయామ్ ది అడ్వర్ టైజ్ మెంట్ రిప్రజెంటేటివ్ ఆఫ్ ది న్యూలీ స్టార్టెడ్

ఇంగ్లీష్ న్యూస్ పేపర్ ఇన్ అవర్ టౌన్ 'ది సిటీ స్టార్'."
"ఐసీ."
"దీసీజ్ అవర్ ఫస్ట్ ఇష్యూ" అని ఒక సంచిక ఇచ్చాడతను. ఆమె దానిని చూసి "వెరీ నైస్ అండ్ అట్రాక్టివ్" అంది.
"చూడండి మేడమ్! ఇప్పుడు మన విద్యామాత్యులు చెప్పినట్లు ఈ ప్రయివేట్ కాన్వెంట్లు కుక్కగొడుగుల్లా లేస్తున్నాయి. ఎక్కడ చూసినా ఇవే! పేరెంట్స్ ఏ స్కూల్ మంచిదో తెలియక దగ్గిర స్కూల్లోనో ఎందులోనో ఒకదాంట్లో వేసేసి తమ పిల్లల భవిష్యత్‌ని పాడు చేసుకుంటున్నారు. అలాటి స్కూళ్ళవలన మీలాటి ఉన్నత విద్యాసంస్థలకి కూడా చెడ్డపేరు వస్తోంది. అందుకే మన నగరంలోని మంచి విద్యాసంస్థల్ని రోజుకొకటి పరిచయం చేయాలనుకుంటున్నాం. ప్రజల అభిప్రాయాన్నిబట్టి మొట్ట మొదటసారిగా మీ కాన్వెంట్‌ను పరిచయం చేయాలనుకుంటున్నాము. క్రొత్తపత్రిక కాబట్టి న్యూస్‌ని కూడా నేనే గేదర్ చేస్తున్నాను" ఇంగ్లీషులో చెప్పాడా యువకుడు.
"అబ్బే....ఎందుకులెండి!" మొహమాటపడిందామె.
"ఇది మీ కోసం కాదు. పబ్లిక్ కోసం."
మరో పదినిముషాలు అతను ఆమెతో మాట్లాడి చివరగా "దయచేసి నాకో చిన్న అడ్వర్‌టైజ్‌మెంట్ ఇవ్వాలి. కనీసం పానల్ అయినా సరే."
"పానల్ ఛార్జ్ ఎంత?"
"ఓన్లీ వన్ హండ్రెడ్ ఫిఫ్టీ రూపీస్."
ఆమె డబ్బు తీసి ఇచ్చి బిల్ పుచ్చుకుని ప్రకటన మేటర్‌ని వ్రాసి ఇచ్చింది.
"రేపు వస్తాను. మీ ఫోటో, మీ స్కూల్ హిస్టరీని

ప్రిపేర్ చేసి ఉంచండి."

అలాగే అందామె. మర్నాడు ఆ యువకుడు రాలేదు. పత్రికలవాళ్ళకి చాలా పన్లుంటాయనుకుందామె. ఎన్నాళ్ళకీ అతను రాకపోతే విషయం అర్థమైంది.

4

"కృష్ణమూర్తిగారూ!"

కృష్ణమూర్తి బయటకు వచ్చాడు. అతను బ్యాంకులో పని చేస్తున్నాడు.

"నేను కంకిపాడులో ఉంటున్నాను. మా ఇంటి ప్రక్కన మీ బావమరిది వైకుంఠంగా రుంటున్నారండి. వారి భార్యగారికి చాలా సీరియస్‌గా ఉంది. డాక్టర్లు లాభం లేదన్నారండి. మిమ్మల్ని రమ్మనమని చెప్పమన్నారండి."

కృష్ణమూర్తి కంగారుపడ్డాడు. బియ్యం ఏరుతూ గదిలో కూర్చున్న ఆయన భార్య వెంటనే ఏడుపు మొదలెట్టింది.

"సరే! మేమందరం బయల్దేరి వస్తాములే."

"అలా చెప్తానండి. ఆవిడకలా ఉండేసరికి నాకు కాళ్ళు ఆడక భోజనం కూడా చెయ్యకుండా బయల్దేరాను."

"అరెరే!"

"జేబులో కూడా డబ్బులు చూసుకోకుండా బయల్దేరాను. నేనూ మీతోపాటు వస్తాను."

"మేము బండిమీద వస్తాములే! నువ్వు ఏ హోటల్లోనో భోజనం చేసి బస్సుమీద రా" అంటూ ఇరవయి రూపాయలు తీసిచ్చాడు కృష్ణమూర్తి.

కంకిపాడు చేరిన కృష్ణమూర్తి కుటుంబానికి వైకుంఠం దంపతులు "ఎన్నాళ్ళ కొచ్చార్రా అందరూ కలిసి" అని

ఎదురొచ్చేసరికి కృష్ణమూర్తి, అతని భార్య ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

5

హైదరాబాద్ నాంపల్లి స్టేషన్....

సేట్ చమన్‌లాల్ తన సూట్‌కేస్‌తో దిగాడు.

స్టేషన్ నుండి బయటికి రాగానే ఒక యువకుడు అతని దగ్గరకు వచ్చాడు. "సేట్‌జీ! మీ సూట్‌కేస్‌లో నాలుగు లక్షల రూపాయలున్నాయ్. మీరు వ్యాపారంమీద బొంబాయి నుండి వచ్చారు. రేపు రాత్రి తిరిగి బొంబాయి వెళ్తారు. అవునా?"

సేట్ ఆశ్చర్యంగా "అవును. నీ కిదంతా ఎలా తెలుసు?" అని అడిగాడు. ఆ యువకుడు నవ్వాడు.

"అదంతే సేట్‌జీ! ఇక్కడ మీరు మరో రెండు లక్షలు వసూలు కోసం వచ్చారు. మొత్తం ఆరు లక్షలు. ఈ డబ్బుని మీరు ట్రావెలర్స్ చెక్కుగా గాని, డ్రాఫ్ట్‌గా గాని మార్చుకునేలోపునే మీరు ఈ డబ్బుని పోగొట్టుకోబోతున్నారు."

సేట్ భయంగా "ఎవరు నువ్వు? నిన్ను పోలీసులకి పట్టిస్తా" అన్నాడు.

"పిచ్చి సేట్‌జీ! అందువల్ల మొదటికే మోసం వస్తుంది. మీరు ఇప్పుడు ఇరవై వేలకి అమ్మబడ్డారు."

"నేను ఇరవై వేలకి అమ్మబడ్డానా? ఏమిటి నువ్వనేది?" ఆదుర్దాగా సేట్ అడిగాడు.

"రండి నాతో. వివరంగా చెప్తాను. ఎదురుగా మరో గాంగ్‌వాళ్ళు చూస్తున్నారు. నేను మిమ్మల్ని వదిలేసిన పక్షంలో మీరు హుసేన్‌సాగర్‌లో తేలుతారు. మీ డబ్బుతో వాళ్ళు నిషాలో తేలుతారు."

సేట్‌కి కాళ్ళు వణకసాగాయి. ఆ యువకుడే అన్నాడు. "సేట్‌జీ! మీరు భయపడక్కర్లేదు. నన్ను నమ్ముకుంటే మీ ప్రాణాలకి హానికాదు"

సేట్ విధిలేక ఆ యువకుని వెంట నడిచాడు.

ఇద్దరూ హోటల్ అన్నపూర్ణాలో ఒక రూములోకి నడిచారు.

లోపల ఇద్దరూ కూర్చున్నాక ఆ యువకుడు చెప్ప సాగాడు:

"మీరు బొంబాయిలో బయల్దేరినపుడు మీతో ఒక వ్యక్తి ప్రయాణం చేశాడు. మీరు లక్షరూపాయలు వసూలు చెయ్యాల్సి ఉంది దారిలో. అక్కడ వసూలు చేసుకుని ట్రైన్ ఎక్కగానే ఆ వ్యక్తి మీ డబ్బుని దొంగిలించాలి. కాని అతను రిస్క్ తీసుకోలేక మిమ్మల్ని మరోవ్యక్తికి ఐదువేలకి అమ్మేశాడు. అయితే మీరు అనుకోకుండా ఎక్కువ వసూలు చేసుకున్నారు. ఆ మరో వ్యక్తి మిమ్మల్ని ఇంకో స్టేషన్లో పదివేలకి అమ్మేశాడు. నా దగ్గరకు వచ్చే సరికి ఇరవై వేలకి మీ రేటు పెరిగిపోయింది. ఇప్పుడు మీరు ఏభై వేలు ఇస్తే మీకే కష్టంగాని నష్టంగాని రాకుండా రేపు సాయంత్రం ట్రైన్ ఎక్కుతారు." అంతలో కుర్రా డొకడు వచ్చి కాఫీ ఇచ్చాడు.

సేట్‌కి కాస్త ధైర్యం వచ్చింది. కాఫీ త్రాగుతూ అడి గాడు.

"నీ పేరేమిటి?"

"భయంకర్"

"అచ్చా! నాదో అనుమానం. ఈ కొనుక్కోవడం, అమ్ముకోవడం బాగానే ఉంది కానీ నా దగ్గర ఏ కారణం చేతనైనా డబ్బు దొంగిలించలేకపోతే నీకు ఇరవై వేలు

నష్టమేగా!"

"అవును. చివరి పార్టీ ఆ నష్టానికి సిద్ధపడే కొనుక్కుంటాడు. ఆమాత్రం రిస్కు మా బిజినెస్‌లో తప్పదు. కాని మేము అంత జాగ్రత్తగానూ ఉంటాము"

"మీదీ ఒక బిజినెసేనన్న మాట!"

"ఆఁ....మా గ్రూప్‌ల మధ్య ఒక అవగాహన ఉంటుంది. కొనుక్కున్న మనిషి జోలికి మరో గ్రూప్ వెళ్ళదు"

"బాగుంది. నువ్వడిగిన డబ్బు నేను ఇవ్వలేదనుకో" సేట్‌జీ నవ్వాడు.

"చెప్పానుగా! ఆ మధ్య మల్హోత్రా కేసు పేపర్లో చూడలేదా? చార్‌మీనార్ మీదనుండి దూకేశాడు. అలాగే మీనార్ ఎక్స్‌ప్రెస్‌నుండి కాలుజారి పడిన జస్వంత్‌సింగ్, కృష్ణానదిలో తేలిన సేట్ రామ్‌లాల్ వగైరాలు అలా డబ్బు ఇవ్వని కేసులే!" తాపీగా చెప్పాడా యువకుడు.

సేట్ తను ఎంత ప్రమాదంలో చిక్కుకున్నాడో గ్రహించాడు.

"సేట్‌జీ! మీకు పోలీసులపై నమ్మకం ఉండొచ్చు. కాని మీకేసు వాళ్ళదాకా వెళ్ళదు. మీరు మేము చెప్పిన దానికి భిన్నంగా ఏమాత్రం ప్రవర్తించినా ఈ లోకంలో ఉండరు. ఆలోచించుకోండి. తీరిగ్గా ఆలోచించుకోండి" అని ఆ యువకుడు లేచి "మరో అరగంటలో వస్తాను" అని దర్జాగా బయటికి వచ్చాడు.

ఈ అరగంట సమయంలో పారిపోదామనుకున్నాడు సేట్. కాని అది మంచిదా కాదా తర్కించుకుని చివరికి భయంకర్ చెప్పినట్లు వినాలనే నిర్ణయించుకున్నాడు. తలుపు లోపల లాక్ చేసి స్నానం చేశాడు. బాత్‌రూమ్

నుండి బైటకు రాగానే తలుపు చప్పుడయేసరికి తలుపు తీశాడు.

హోటల్ కుర్రాడు భోజనం తెచ్చాడు. సేట్ ఆత్రుతగా తినేశాడు.

అంతలో భయంకర్ వచ్చాడు.

"చూడు భయంకర్! నువ్వు అడిగినట్టుగానే డబ్బిస్తాను. కాని నిన్నుమాత్రం ఎలా నమ్మడం?"

"నమ్మక తప్పదు. కాని నా వంతుగా నేను హామీ నిస్తున్నాను. మీకూ మాకూ ఒక ఒడంబడిక జరిగాక ఇక దానికి తిరుగుండదు. మీ జోలికి ఎవరూ రారు."

"సరే నేనేం చెయ్యాలి? నన్ను ఎలా బొంబాయి చేరుస్తావ్ నువ్వు?"

"మీరు మీ డబ్బుని ఈ రూమ్‌లో నిరభ్యంతరంగా దాచుకోవచ్చు. బైటకెళ్ళి మీ బాకీలు వసూలుచేసి తెచ్చుకోవచ్చు. మీరు ఎక్కడికెళ్ళినా మీ కూడా నేను ఉంటాను. మీమీద ఈగ వాలదు. నేను మిమ్మల్ని వదిలేసిన క్షణం తర్వాత మీ డబ్బుకాని మీరు కాని ఉండరు. అందుకే చెప్తున్నా. మీకు తెలియకుండానే మీవెంట నేను ఉండి మీ రక్షణ నేను చూసుకుంటా. మొత్తం డబ్బుని మీరు డ్రాఫ్టుగాగాని ట్రావెలర్స్ చెక్కుగాగాని మార్చుకుంటారు. మిమ్మల్ని భద్రంగా రేపు సాయంత్రం ట్రైన్ ఎక్కిస్తాను."

"ట్రైన్‌లో ఎవరూ నా జోలికిరారా? ఎందుకంటే చిల్లర దొంగలు రావచ్చుగా!"

"రారు, మీ కో స్లిప్ ఇస్తాం. దానిని మీ సూట్‌కేసు

మీద అంటిస్తాం. స్టిక్కర్ లెండి. ఎవడైనా పొరపాటున మీ బాగ్ తీసినా మళ్ళీ మీ అడ్రస్‌కు తిరిగి చేరుతుంది."

"ఆ స్టిక్కర్ మీద ఏముంటుంది?"

"మా కోడ్ నెంబర్."

"సరే నేను ఒప్పుకుంటున్నాను"

"గుడ్! మన కాంట్రాక్ట్ సొమ్మును మీరు ట్రెయిన్ ఎక్కేముందు ఇవ్వచ్చు"

* * *

సేట్ చమన్‌లాల్ క్షేమంగా బొంబాయి చేరాడని చెప్పనక్కర్లేదు. అయితే బొంబాయి చేరగానే అతనొక తెలివైన పని చేశాడు. బొంబాయిలో తనకి తెలిసిన ఒక పోలీసు ఆఫీసర్‌కి అన్ని వివరాలు చెప్పాడు.

ఆ పోలీస్ ఆఫీసర్ డబ్బుకి ఆశపడని వ్యక్తి కావడం, అతనే ఈ కేసు స్వయంగా ఇంటలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌కి తెలియపరచడంతో పరిశోధన ప్రారంభమై విజయవాడ, హైదరాబాద్‌ల వరకు వచ్చింది.

అయితే సేట్ చమన్‌లాల్ పేరును ఆ పోలీస్ ఆఫీసర్ బయటపెట్టలేదు. హైద్రాబాద్ పోలీసులకి కూడా ఈ విషయం తెలియనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోబడ్డాయి.

ఇంటలిజెన్స్ శాఖ పట్టుదలగా కృషిచేసి మొత్తానికి ఆ యువకుల ముఠాన పట్టుకోగలిగింది. ఈ ముఠాలో ఐదు రూపాయల నుండి వేల రూపాయల వరకు మోసంతో ఎవరి శక్తికి తగ్గట్టుగా వారు దోచుకునే వాళ్ళున్నారు.

ఇంటలిజెన్స్ శాఖవారు ముఠాని పట్టుకున్నారు కనుక

ఇక మనకు భయం లేదనుకోకూడదు.

ఈ కోట్ల ప్రజలలో ఎందరో మోసగాళ్ళు ఉన్నారు. అలాగే విశ్వం, మీనాక్షి, రామ్మూర్తి, కృష్ణమూర్తి, సేట్ లాటి వాళ్ళు కూడా మరెందరో ఉన్నారు.

కనుక ఈ నేరాలు ఆగవు. ఎక్కడో అక్కడ ఏదో విధంగా జరుగుతూనే ఉంటాయ్! పునరావృతం అవుతూనే ఉంటాయ్!

ఈ మోసాల్ని, నేరాల్ని జరగనివ్వకూడ దనుకునే పక్షంలో మనం అత్యాశలకు లొంగిపోక ఒక విషయాన్ని ఎల్లవేళలా గుర్తుంచుకోవాలి!

అది—

"మోసగాళ్ళుంటారు! జాగ్రత్త!!" □

పారిపోయే కష్టమర్లు!!



కొత్త సీరియల్ ప్రారంభం

పబ్లిక్ టెలిఫోన్ బూత్ ముందు నిలబడి వున్నాడు వినాయక్. అతడి చేతిలో సిగరెట్టు సగంవరకు కాలి వుంది.

చీకటి పడటానికి ఇంకా ఎక్కువ సమయంలేదు. నగరంలో కొంచెం దూరంలో వున్న ఇళ్ళలో అప్పుడే వెలుగుతున్న దీపాలు కనబడుతున్నాయి.

టెలిఫోన్ బూత్‌లోకి వెళ్ళాడు వినాయక్. ఒక నెంబర్‌ను అతడు గుర్తుచేసుకున్నాడు.

డయల్ చేశాడు.

కనెక్షన్ రాగానే కాయిన్ హోల్‌లో వేశాడు.

అవతలివైపునించి జైన్ గొంతు వినబడింది.

"దిసీజ్ జైన్."

నవ్వాడు వినాయక్. నవ్వటానికి ముందు ఎడమచేత్తో ప్యాంటుజేబులోనించి వులిపిరి కాయితం తీసి నోటికి అడ్డుగా పెట్టుకున్నాడు.

"ఎవర్నువ్వు?" కోపంగా అడిగాడు జైన్. ఆ విము షంలో అతడి మొహం ఎలావుంటుందో వూహించుకుంటు న్నాడు వినాయక్.

"నే నెవర్నో నీకు చెప్పను జైన్" అన్నాడతడు.

"కాని నేను తెలుసుకోగలను."

"అసాధ్యం జైన్" మళ్ళీ అన్నాడు అతడు.

"ఆల్ రైట్ ....నువ్వెవరివని అడగను. ఎందుకు ఫోన్ చేశావో చెబుతావా?"

"గుడ్ జైన్. సూటిగా మాట్లాడుతాను. నా పేరు చెప్పకపోయినా నా వృత్తేమిటో చెబుతాను. నే నొక ప్రమాదకరమైన బ్లాక్ మెయిలర్ని. చీకటి సామ్రాజ్యపు చక్రవర్తుల రహస్యాలు తెలుసుకుని వాళ్ళని బ్లాక్ మెయిల్ చేసి డబ్బు సంపాదించటం నా ప్రొఫెషన్" మధ్యలో ఆపాడు అతడు.

"నా రహస్యాలు కూడా తెలుసుకున్నావా!" హేళనగా అడిగాడు జైన్.

"అవును జైన్. చాలా గొప్ప రహస్యాలు తెలుసు కున్నాను. వాటికి సంబంధించిన సాక్ష్యాలు కూడా సేకరిం చాను. ఆ సాక్ష్యాల ఆధారంగా నువ్వు జీవితాంతం జైలు గోడల మధ్య వుండొచ్చు."

"ఏమిటా రహస్యాలు?"

"ఇప్పుడే చెప్పను. ఆ రహస్యాల రిజల్టు చెప్పాను. చాలనుకుంటాను. ఆ సాక్ష్యాలు నాశనం కావాలంటే నువ్వు పాతికలక్షలు ఇవ్వటానికి సిద్ధపడాలి."

"పాతిక లక్షలా? యూ ఆర్ మేడ్ ....రహస్యాలు ఏమిటో తెలుసుకోకుండా నేను అంత డబ్బు యివ్వటానికి ఒప్పుకుంటానని నువ్వెలా అనుకున్నావ్ బ్లాక్ మెయిలర్"

అన్నాడు జైన్.

వినాయక్ ఒక్క సెకెండ్ ఆలోచించాడు.

"జైన్: ఆ రహస్యమేమిటో నీకు తెలిసిన తర్వాత మళ్ళీ ఫోన్ చేస్తాను" అని ఫోన్ పెట్టేశాడు.

క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా టెలిఫోన్ బూత్‌లో నుండి బయటకు వచ్చాడు.

జైన్ శక్తి, సామర్థ్యం అతడికి బాగా తెలుసు. ఇప్పటికే అతడు ఫోన్‌కాల్‌ను ట్రేస్‌చేసి వుంటాడు.

ఫెన్సింగ్‌మీదకు ఎక్కి అవతలి వైపుకు దూకాడు. కొంచెం దూరంలో ఎత్తుగా పెరిగిన పొలాల మధ్యకు వెళ్ళిపోయాడు.

పదినిముషాలు నడిచి పొలాలు దాటి అవతలివైపుకు వెళ్ళాడు. ఎర్రటి మట్టిరోడ్డు కనబడింది. రోడ్డు పక్కనే కొంచెంసేపు నిలబడ్డాడు వినాయక్. అతను మారువేషంలో వున్నాడు.

జేబులోనించి సిగరెట్ ప్యాకెట్ తీశాడు. ఒక సిగరెట్ తీసి ముట్టించాడు.

అతని బ్రాండ్ సిగరెట్‌కాదు అది. సిగరెట్ ముక్కల ఆధారంగా తన ఉనికి శత్రువుకు తెలియడం అతనికి ఇష్టంలేదు. అందుకే వీలైనన్ని ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటున్నాడు వినాయక్.

బాగా చీకటిపడింది.

కొన్నిక్షణాలకు పొలాల మధ్యనించి ఒక గడ్డిబండి రోడ్‌మీదకు వచ్చింది. బండి అతడ్ని దాటగానే వెనుకనించి దానిమీదకు యెక్కి గడ్డిమీద వెల్లికిలా పడుకున్నాడు.

నగరంవైపుకు వెళుతోంది బండీ.

ఐదు నిముషాలకు గడ్డిబండికి ఒక ఫోర్డు కారు యెదురువచ్చింది. బండి రోడ్ పక్కకు జరిగింది.

ఫోర్డుకారు బండిని దాటి మట్టిరోడ్ మీద పరుగుదీసింది. దాటిపోతున్న ఫోర్డుకారును చూసి చిన్నగా నవ్వుకున్నాడు వినాయక్.

అవును - అదే కారు. జైన్ దే. అందులో జైన్ మనుషులు బ్లాక్ మెయిలర్ కోసం వెతుకు తున్నారను కున్నాడు.

ఇరవై నిముషాల తర్వాత వినాయక్ బండిమీదనించి నాలుగురోడ్ల కూడలిలో దిగి చీకట్లో రోడ్ వారగా నడ వటం మొదలుపెట్టాడు.

2

చవకబారు లాడ్జి అది. బాగా తక్కువ ఆదాయం వచ్చే వాళ్ళు ఆ లాడ్జిలో బసచేస్తూ వుంటారు. సన్నగా వున్న వీధిలో వుంది.

లాడ్జి ముందువున్న కాలువలో మురికినీళ్ళు చప్పుడు చేస్తూ పరుగుదీస్తున్నాయి.

'హసీనా లాడ్జి' అని రాసివున్న బోర్డును చూశాడు వినాయక్. వీధిచివర్లో ఆటో దిగి నడుస్తూ వచ్చాడు. బోర్డుమీద గుడ్డిగా వున్న లైటు వెలుగుతోంది.

లోపలకు నడిచాడు వినాయక్.

రిసెప్షన్ కౌంటర్ దగ్గర పొడుగాటి జుట్టు వున్న మనిషి కూర్చొని సిగరెట్ కాలుస్తూ రోడ్ మీదకు చూస్తు న్నాడు.

సింగిల్ రూమ్ తీసుకున్నాడు అతడు—అడ్వాన్స్ పే చేసి. రిజిష్టర్లో తన పేరు 'చిదంబరం' అని రాశాడు.

కీ తీసుకుని పైకి నడిచాడు.

504 నెంబర్ గదిముందు ఆగాడు.

పై అంతస్తులో ఐదువందల నెంబర్ నుండి గదులు మొదలవుతున్నాయి.

తాళం తీసి లోపలకు నడిచాడు.

బయటనించి పడుతున్న దీపం వెలుతురులో స్విచ్ నొక్కాడు. లైటు వెలుతుర్లో మాసిపోయి నల్లగావున్న గోడలు, దుమ్ము నిండిన బల్ల, కుర్చీ కనపడ్డాయి.

బల్లమీద నల్లగావున్న కూజా ఒక గాజు గ్లాసు ఉన్నాయి. గదిలోపల సిగరెట్లపొగ వాసన కొడుతోంది.

వినాయక్ అటువంటి గదుల్లో ఎప్పుడో ఎన్నో ఏళ్ళ క్రితం ఉన్నాడు. అప్పుడు అతనికి ఆ వాతావరణం చాలా మామూలుగా అనిపించింది. ఇప్పుడు చాలా కష్టంగా ఉంది ఆ గదిలో వుండటం. ఐనా తప్పదు. ఎటువంటి కష్టాలనూ ఎదుర్కోకుండా గమ్యాన్ని చేరాలంటే కొంత కష్టపడక తప్పదు.

చేతిలోవున్న సూట్ కేసును బల్లకింద ఉంచాడు. తలుపుమూసి బాత్ రూంలోకి నడిచాడు. మొహం కడుక్కొని బయటకు వచ్చాడు.

సూట్ కేసు తెరిచి అందులోనించి మేకప్ సామగ్రి బయటకు తీశాడు. మసగ్గావున్న అద్దంముందు నిలబడి కొద్దిగా తన రూపాన్ని మార్చుకున్నాడు. జుట్టును పూర్తిగా వెనక్కు దువ్వుకున్నాడు. సూట్కేసు అడుగునవున్న వీడియో కేసెట్ ను తీసి ప్యాంటులో దోపుకున్నాడు.

జైన్‌గ్యాంగ్ ను చట్టం చేతులకు అందించే ఆధారం అదే. ప్యాంటు జేబులో పిస్తోలును ఉంచాడు.

సూట్కేసు మూసి బెడ్ కింద వుంచి సిగరెట్టు ముట్టిం

చాడు. పొగ వదులుతూ గది కిటికీ దగ్గరకు వచ్చి నిల బడ్డాడు.

ఇరుగ్గావున్న వీధిలో జనం నడుస్తున్నారు. ఒక ర్నొకరు పట్టించుకోవటం లేదు. లాడ్జి ఎదురుగావున్న ఇరానీ హోటల్లో జనం నిండుగా వున్నారు.

వినాయక్ గదిలోనించి వచ్చి లాక్ చేశాడు.

స్టోర్ రూం పక్కనించిఉన్న మెట్లు లాడ్జి వెనకవైపుకు ఉన్నాయి. మెట్ల చివర వసారాలో దీపం వెలుగుతోంది.

కిందికి వచ్చాడు వినాయక్.

అతడ్ని ఎవరూ గమనించలేదు. నిముషం తర్వాత అతను రోడ్డుమీద ఇరుకు సందులో వున్నాడు.

ఎదురువస్తున్న మనుషులను నడుస్తూనే గమనించాడు. కొంచెంసేపటికి అతను విశాలంగావున్న రోడ్డుమీదకు చేరుకున్నాడు.

ఆటో స్టాండు దగ్గిరలోనే ఉంది.

కాని అతను అక్కడకు వెళ్ళలేదు. రోడ్డుమీద నడు స్తూనే ఖాళీగా వెళుతున్న ఆటోను ఆపాడు. ఎక్కి కూర్చుని అడ్రసు చెప్పాడు.

వీధి దీపాలు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి.

తన ప్రయత్నం ఫలిస్తుందా?

ఈ ప్రయత్నంలో తను ప్రాణాలతో బయటపడ గలడా? ఇంకొన్నాళ్లు తను ఈ భూమ్మీద బతికే అవకాశం ఉందా?

లేకపోవచ్చు. ఇప్పటికే జైన్ తన గురించి వాళ్ళతో చెప్పి ఉంటాడు. అంతా తనకోసం వలపన్ని ఉంటారు.

జాగ్రత్తగా ఉండాలి వెయ్యికళ్ళతో చూడాలి.

రివ్వున వీస్తున్నగాలికి అణిచిపెట్టి దువ్వుకున్న అతడి

జుట్టు ఎగురుతోంది.

అతడి కళ్ళముందు జరీనా కనపడింది.

మబ్బుల్లో తేలిపోతూ తనని ఈ లోకం విడిచి రమ్మని ఆహ్వానిస్తున్నట్టుగా ఉంది.

వినాయక్ పిడికిలి ఆవేశంతో బిగుసుకుంది.

తన ప్రాణానికి ప్రాణం జరీనా....

నిర్దాక్షిణ్యంగా ప్రాణం తీసి విసిరేశారు.

'జైన్' చిన్నగా గొణిగాడు అతను.

డ్రయివర్ వెనక్కు తిరిగిచూశాడు.

కొంచెం సేపటికి ఆటో సెంటర్లో ఆగింది.

ఫేర్ చెల్లించి పేవ్‌మెంటుమీదకు ఎక్కాడు వినాయక్.

ఐదు నిముషాలకు అతను ఫోటోస్టూడియో ముందు ఆగాడు. "జూబ్లీ స్టూడియో" బోర్డుమీద నియాన్ దీపాలు వెలుగుతున్నాయి.

లోపలకు నడిచాడు.

"ఏం కావాలి సర్?" నవ్వుతూ అడిగాడు మేనేజర్.

"పర్సనల్" అన్నాడు వినాయక్ చిన్నగా....

అర్థమయినట్టుగా నవ్వాడు మేనేజర్.

అప్పుడప్పుడు కొంతమంది పైకప్పులేని బాత్‌రూముల్లో స్నానాలు చేస్తున్న ఆడవాళ్ళ ఫోటోలు తీసి నెగిటివ్‌లు తీసుకువచ్చి ఇస్తూవుంటారు. వాళ్లు మేనేజర్‌తో పర్సనల్‌గా మాట్లాడతారు.

పర్సనల్ గదిలోకి వెళ్ళారు ఇద్దరూ.

ప్యాంటు జేబులో దోపుకున్న కేసెట్‌ను తీస్తున్నప్పుడు "బ్లూఫిల్మ్ నెగిటివా?" అనడిగాడు మేనేజర్ మెరిసే కళ్ళతో....

వినాయక్ మాట్లాడలేదు.

తల అడ్డంగా వూగించాడు.

"ఇంకేమిటి? దేశ రహస్యాలా?" చిన్నగా గుసగుస లాడుతున్నట్టుగా అడిగాడు.

"మేనేజర్....ఈ నెగిటివ్ ఫిల్మ్‌కు రెండు ప్రింట్లు కావాలి. చాలా అర్జంటు. రేపు సాయంత్రానికి రెడీ కావాలి. ఇది బ్లూఫిల్మ్ కాదు." అన్నాడు వినాయక్.

అది బ్లూఫిల్మ్ కాదని తెలియగానే మేనేజర్ ఉత్సాహ మంతా జారిపోయింది.

"రెండు ప్రింట్లు సరిపోతాయా?"

తలవూపాడు వినాయక్.

"రేపు సాయంత్రం ఆరు గంటలకు రండి. సిద్ధంగా వుంటాయి."

"జాగ్రత్త....చాలా ముఖ్యమైన ఫిల్మ్" అడ్వాన్సు పే చేస్తూ చెప్పాడు వినాయక్.

తల వూపాడు మేనేజర్ నవ్వుతూ.

వెనక్కి తిరిగాడు అతను.

"ఒక్క నిముషం" అన్నాడు మేనేజర్.

ఆగాడు.

"బ్లూఫిల్మ్ నెగిటివ్‌లు వుంటే తీసుకురండి. ప్రింట్లు అందంగా వేసి డెలివరీ ఇస్తాను."

వినాయక్ అతడి మాటలు పట్టించుకోనట్టు బయటకు వచ్చాడు. అతడి మనసులో జైన్ కదులుతున్నాడు. ప్రింట్లు తయారుకాగానే జైన్‌కు అందజేయాలి.

సిగరెట్ వెలిగించాడు నడుస్తూనే.

రోడ్డు పక్కనే వున్న దీపాలు తెల్లని కాంతులను పరి సరాలమీదకు నెడుతున్నాయి.

వాహనాలు రివ్వున పరుగు దీస్తున్నాయి.

రద్దీగా వున్న ఆ రోడ్డు మీద తనని ఎవరో కనిపెడతా రనే అనుమానం అతడికి లేదు. అందుకే నెమ్మదిగా నడిచి రోడ్డు పక్కనే వున్న టెలిఫోన్ బూత్‌లోకి నడిచాడు.

ఒక నెంబర్‌కు డయల్ చేశాడు.

కనెక్షన్ రాగానే కాయిన్ వేసి "హలో" అన్నాడు గొంతు మార్చి.

"హూ యీజ్ స్పీకింగ్?" బొంగురు గొంతుతో అడిగాడు వాడియా.

"డియర్ వాడియా....నిన్ను జీవిత ఖైదుకు నెట్టే సాక్ష్యాలు. ఆధారాలు నా దగ్గర వున్నాయి. వాటివి కొన్ని గంటల్లో నీకు అందజేస్తాను. వాటిని చూసిన తర్వాత పాతిక లక్షలు అడుగుతాను. నువ్వు ఇవ్వటానికి ఒప్పుకుంటావు. వింటున్నావా?" అడిగాడు వినాయక్.

అప్పటికే ఫోన్‌లో అరుస్తున్నాడు వాడియా.

ఎలుగుబంటిలా వుండే వాడియా మొహాన్ని వూహించుకున్నాడు అతను.

"స్టూపిట్" కోపంగా అరిచాడు వినాయక్.

"యూ ఫూల్" అంటున్నాడు వాడియా.

"నీ రహస్యకార్యకలాపాలను కేమెరాలో బంధించినా తెలుసుకోలేని ఫూల్‌వి నువ్వే వాడియా....ఇడియట్‌లా అరవకు....జైన్‌ను కలుసుకుని నీ సందేహాలకు జవాబులు తెలుసుకో. మళ్ళీ ఫోన్ చేస్తాను" అని రిసీవర్ పెట్టేశాడు వినాయక్.

బూత్‌లోనించి బయటకు వచ్చి ఒక్కసారి అటూ ఇటూ చూశాడు. హారన్లు మోగించుకుంటూ వాహనాలు పరుగుదీస్తున్నాయి.

షాపుల నిండా జనం వున్నారు.

కొంచెం దూరం సిగరెట్ కాలుస్తూ నడిచాడు అతను-ఆలోచిస్తూ....

జరీనా అందమైన రూపం అతడి కళ్ళ ముందు కదులుతూనే వుంది.

అతడి గుండె ఒక్కసారిగా భగ్గుమన్నది.

రాక్షసులు——

చిన్న పొరపాటుకు మరణశిక్షను విధించారు. అంతకంటే ఘోరంగా ఆమెను చిత్రహింస పెట్టారు.

తన గుండెను నిలువునా రంపంతో కోశారు.

అతడి కళ్ళు మండాయి.

తప్పదు.

ఈ జ్వాల ఆ రాక్షసుల్ని దహించాలి!

జీవితాంతం వాళ్ళు కుళ్ళి చావాలి....

వినాయక్ మళ్ళీ నడిచాడు.

రెండు వీధులు దాటాక స్ట్రీట్‌లైటు పక్కగా వున్న టెలిఫోన్ బూత్ కనబడింది.

లోపలకు వెళ్ళి డయల్ చేశాడు.

కాయిన్ వేసి "హలో" అన్నాడు వులిపిరి కాయితాన్ని నోటికి అడ్డంగా పెట్టుకుని.

"ఎవరు?" అవతల్నించి ధనుంజయ్ అడిగాడు.

"చెప్పేది విను ధనుంజయ్....నీ పాపాలకు, నేరాలకు ప్రత్యక్షసాక్ష్యాలు నా దగ్గర వున్నాయి. వాటిని కొన్ని గంటల్లో నీకు పంపుతాను. అవి చూసిన తర్వాత నువ్వు నాకు పాతిక లక్షలు ఇవ్వాలి. ఇవ్వకపోతే జీవితాంతం జైలు గోడల మధ్య కుళ్ళి చస్తావ్."

"ఇడియట్—నీ రక్తం తాగుతాను" అరుస్తున్నాడు ధనుంజయ్.

నవ్వాడు వినాయక్.

"ఈ షాక్ నించి తేరుకోటానికి ముందు ఫారెన్ విస్కీ తాగు ధనుంజయ్. నీ భాగస్తులిద్దరూ ప్రస్తుతం అదే పనిలో వుండి వుంటారు. వాళ్ళ దగ్గిరికి వెళ్ళు."

ఫోన్ పెట్టేసి బయటకు వచ్చాడు.

నిర్మానుష్యంగా వుంది రోడ్డు.

బూట్ల చప్పుడు వినపడుతోంది.

ఆ ముగ్గురినీ కాల్చి చంపితే? — ఆలోచిస్తున్నాడు అతడు నడుస్తూ.

అవును. ఆ ముగ్గుర్నీ కాల్చి చంపితే బాగానే వుంటుంది. కాని అది వాళ్ళకి చాలా చిన్న శిక్ష. చాలదు. జరీనాని క్రూరంగా హత్యచేసినందుకు వాళ్ళు కుళ్ళి చావాలి.

చట్టం చేతులకు వాళ్ళను అందించాలి. దాని ఉక్కు పిడికిలిలో వాళ్ళు నలిగిపోవాలి.

3

వేషాన్ని మార్చుకుని ఒకసారి అద్దంలో చూసుకున్నాడు వినాయక్. మేకప్ బాక్స్‌ను మూసి సూట్కేసులో వుంచి టేబిల్ కిందకు నెట్టాడు.

పిస్తోలును ప్యాంటుజేబులోకి తోసి గదిలోనించి బయటకు వచ్చాడు.

గది లాక్‌చేసి హసీనాలాడ్జి స్టోర్ రూం పక్కనే వున్న మెట్లు దిగి కిందకు వచ్చాడు.

రోడ్డుమీద జనం ప్రవాహంలా వున్నారు.

రెస్టారెంట్‌లో మనుష లెవరూ అతడి గురించి పట్టించుకోలేదు.

ఫారము - 4

1. ప్రచురణ స్థలము : హైద్రాబాదు-29.

2. ప్రచురణ కాలము : మాసపత్రిక.

3. ముద్రాపకుని పేరు : శ్యామ దామోదర రెడ్డి.
   జాతీయత : భారతీయుడు.
   చిరునామా : హైద్రాబాదు-29.

4. ప్రచురణ కర్త పేరు : —డిటో—
   జాతీయత :
   చిరునామా :

5. సంపాదకుని పేరు : —డిటో—
   జాతీయత :
   చిరునామా :

6. వార్తాపత్రికపై యాజమాన్యము గల వ్యక్తులు, భాగస్తులు పేర్లు, చిరునామాలు : శ్యామ దామోదర రెడ్డి
   3-4-554,
   నారాయణగూడ,
   హైద్రాబాదు-29.
   (సోల్ ప్రొప్రయిటరు)

శ్యామ దామోదర రెడ్డి అయిన నేను, పై తెలిపిన వివరములు నాకు తెలిసినంతవరకు, నేను విశ్వసించినంత మేరకు సత్యమైనవని, ఇందు మూలముగా ప్రకటించుచున్నాను.

తేది : శ్యామ దామోదర రెడ్డి

1-3-88. (ప్రచురణకర్త సంతకం)

సాయంత్రం ఐదు గంటల నలభై నిముషాలయ్యింది. ఎండ బాగా తగ్గిపోయింది.

ఇరుగ్గా వున్న సందు దాటి విశాలమైన రోడ్డు మీదకు వచ్చాడు.

ఆటోస్టాండు దాటి కొంతదూరం నడిచాడు.

రోడ్డున వెళుతున్న ఆటోను ఆపి ఎడ్రసు చెప్పాడు.

"జూబ్లీ స్టూడియో."

వెళుతోంది ఆటో....

"మీరు అందులో జాబ్ చేస్తున్నారా సాబ్?" అడిగాడు ఆటో డ్రయివర్.

"ఎందుకు?"

"నిన్న కూడా మీరు ఇదే ఆటో ఎక్కి ఆ వైపుకే వెళ్ళారు."

ఉలిక్కిపడ్డాడు వినాయక్.

అప్పుడు చూశాడు అతడు డ్రయివర్ మొహాన్ని. అవును అతడే. క్రితం రోజు తను అదే ఆటోలో ఎక్కాడు.

తను అజాగ్రత్తగా ప్రవర్తిస్తున్నాడా? ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తను అనుకుంటున్నాడు. కాదు. ఆలోచనల్లో పడి తను సరిగా గమనించటం లేదు.

జూబ్లీస్టూడియో ఇంకా సగందూరం వున్నప్పుడు ఆటో ఆపమన్నాడు వినాయక్.

"ఇక్కడ దిగిపోతాను" అన్నాడతను దిగుతూ.

"జూబ్లీ స్టుడియో చెప్పారు సాబ్."

"అవసరం లేదు" అన్నాడు ఫేర్ చెల్లిస్తూ.

డ్రయివర్ తనను గుర్తుపట్టటం అతడికి యిష్టం లేదు.

శ్రీ మహాలక్ష్మి వారి వెరైటీ నవలలు

తప్పక చదవండి!

1. నిశాంత యద్దనపూడి సులోచనారాణి 25-00
(డైరెక్టు నవల)

2. ప్రమాదాల్లో - ప్రమదలు నవీన్ 30-00
(స్వాతి వీక్లీ సీరియల్)

3. అన్వేషణ వి. యస్. రావ్ 20-00
(అపన సీరియల్)

4. మానసిక సమస్యలు డా॥ ఇండ్ల
సమాధానాలు రామసుబ్బారెడ్డి 20-00

నేడే అడ్వాన్సుతో పాటు ఆర్డర్సు పంపండి.

ఫోన్ నెం : 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్

మ్యూజియం రోడ్, గవర్నరు పేట,

విజయవాడ - 520 002.

ఆటో వెళ్ళిపోయేవరకు అక్కడే వున్నాడు.

ఐదునిముషాలకు అక్కడ్నించి నడవటం మొదలు పెట్టాడు.

సాక్ష్యాలను వాళ్ళకు చేరవేస్తే డెబ్బయ్ఐదు లక్షలు వస్తాయి. ఆ క్యాసెట్‌లను చూస్తే వాళ్ళు యాభైలక్ష లయినా యివ్వటానికి ఒప్పుకుంటారు.

ఆ సాక్ష్యాలు ఆ ముగ్గురి ప్రాణాలకూ ఉరితాడులా చుట్టుకుంటాయి.

డబ్బు చేతికి దొరగ్గానే క్షణం కూడా ఆలస్యం చెయ్య కుండా వీలయినంతదూరం పారిపోవాలి.

'జూబ్లీ స్టూడియో'లో మేనేజర్ నవ్వుతూ విష్‌చేశాడు వినాయక్‌ను.

"రండి! ...రండి! ....మీ కోసమే యెదురు చూస్తు న్నాను."

మేనేజర్ నెత్తిమీద గోడకు గడియారం వ్రేలాడు తోంది.

ఆరుగంటల పదినిముషాలయ్యింది.

"ప్రింట్లు రెడీ ఐనాయా?"

"ఎప్పుడో ...ఇప్పుడే ఇచ్చేస్తాను....ఒక్కసారి ఆ గదిలోకి రండి........మీతో మాట్లాడాలి" అన్నాడు మేనేజర్....

అతనితో ప్రయివేటు గదిలోకి వెళ్ళాడు వినాయక్.

"కంగ్రాచ్యులేషన్స్" వినాయక్ చెయ్యి పట్టుకుంటూ అన్నాడు మేనేజర్....

"ఏమిటిదంతా?" అన్నాడు విసుగ్గా అతను.

"బాగా షూట్‌చేశారు....అందులో ఒక మనిషి జైన్ గారు కదూ....ఎప్పుడో చూశాను."

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు, వారికి పత్రికలన్నీ రిజిష్టర్ లేదా బుక్ పోస్టులో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జూలై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా రు. 90/- చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

3. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేవిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

4. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియ జేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై- మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి రెండేసి నెలలకొకసారి V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యం కూడా వుంది. ఈ పద్ధతిలో పత్రికల ఖరీదు రు. 30/-లు చెల్లించి కాపీలు పొందవచ్చును. యీ సౌకర్యం కావలసివస్తే మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!

"షటప్!" అరిచాడు వినాయక్.

అతను షాక్ ఫీలయ్యాడు.

మేనేజర్ దాని ప్రింటువేసి ప్లేచేసి చూస్తాడనుకో లేదు.

"అరవకండి సార్....ఇలాంటి ఫిల్ములు మా దగ్గరకు ఎన్నో వస్తూ వుంటాయి. యువర్ సీక్రెట్స్ ఆర్ సేఫ్ విత్ మి....మీకేం భయం అవసరంలేదు. బ్లాక్‌మెయిల్ చెయ్యటానికి అద్భుతం ఆ ఫిల్మ్."

ప్యాంటు జేబులో చెయ్యిపెట్టాడు వినాయక్.

ఒక్కక్షణం ఆలోచించి పిస్తోలు మీదనించి చేతిని బయటకు లాగాడు.

"ఆల్‌రైట్....ప్రింట్లు ఇచ్చెయ్....బాలెన్స్ ఎమవుంట్ పే చేస్తాను" అన్నాడు వినాయక్.

నవ్వాడు మేనేజర్.

"కనీసం ఆ ఫిల్ము గురించి తెలిసినందుకైనా మీరు నాకు కొంత డబ్బు ముట్టజెప్పాలి....ఇటువంటి విషయాల్లో నాకూ కొంత అనుభవం వుంది. చెప్పండి....ఏం చేద్దాం?"

"ముందు ఆ నెగిటివ్, ప్రింట్లు ఇవ్వు."

"ఇవ్వను....ముందు నా విషయం తేల్చాలి మీరు."

"సరే....పదివేలిస్తాను....వాటిని ఇచ్చెయ్యి....ఇప్పుడే డబ్బులిస్తాను."

"చాలా తక్కువ. చాలా గొప్పమనుషుల క్రీడలు మీ ఫిల్ములో బంధించబడ్డాయి. వాటికి బాగా రేటు పలుకుతుంది....పదివేలు మరీ తక్కువ."

"నువ్వు మరీ ఆశకు పోతున్నావు....నేను ఆరితేరిన హంతకుడ్ని. ప్రాణాలను గాలికి వదిలి బతుకుతున్నాను.

శ్రీ గణేశ్ బుక్ హౌస్

బుక్ డిస్ట్రిబ్యూటర్స్ & స్టేషనరీ

మా వద్ద సుప్రసిద్ధ రచయితల, రచయిత్రుల సాంఘిక నవలలు, డిటెక్టివ్‌లు, బాల సాహిత్యం, నాటకములు, వైద్య, విద్య. స్కూలు, కాలేజి విద్యార్థులకు కావలసిన అచ్చు పుస్తకములు, ఎక్సర్‌సైజ్ పుస్తకములు

మరియు

రామాయణం, భారతం

భాగవతం, దేవీ భాగవతం

ఇంకా

హిందీ, ఇంగ్లీషు

నవలలు లభించును.

తప్పక విచ్చేయండి!

నేడే మా కేటలాగు కొరకు వ్రాయండి.

శ్రీ గణేశ్ బుక్ హౌస్

(పాత కూరగాయల మార్కెట్ వద్ద)

రాజమండ్రి - 533 101.

నువ్వు అందుకు సిద్ధపడితే చెప్పు. ఎంత కావాలో ఇస్తాను" అన్నాడు వినాయక్.

"అంటే?"

"నువ్వు చస్తావు" అంటూ ప్యాంటు జేబులోనించి సైలెన్సర్ అమర్చిన పిస్తోలు బయటకు తీశాడు.

మేనేజరు మొహంలో అప్పుడు భయం బయట పడింది.

"చెప్పాను గదా....నేను బ్లాక్‌మెయిలర్నే కాదు. హంతకుడ్ని కూడా. నువ్వు పదిలక్షలడిగినా యివ్వగలను. కాని వెంటనే నిన్ను చంపి ఆ డబ్బును మళ్ళీ తీసుకువెళతాను. అందుకే మరీ ఆశపడకు ఎంత కావాలో చెప్పు!"

"పాతికవేలు."

"సరే....ఒక ప్రింటు నీ దగ్గిర వుంచుకుని, మిగిలిన ప్రింట్లు నెగిటివ్ నాకిచ్చెయ్యి. రాత్రి పదిగంటలకు పాతికవేలతో నిన్ను కలుసుకుంటాను. డబ్బు తీసుకుని ఆ ప్రింటు ఇచ్చెయ్యి."

"ఆల్‌రైట్" అన్నాడు మేనేజరు.

"రాత్రి పదిగంటలకు నువ్వెక్కడ వుంటావ్?"

"హోటల్ మూన్‌లైట్ రూం నెంబర్...."

"అవసరంలేదు....టెంపుల్ స్ట్రీట్ కార్నర్‌లో పేవ్‌మెంటుమీద నిలబడి వుండు. పదిగంటల తర్వాత నిన్ను నేను కలుసుకుంటాను."

"ఎవరైనా చూస్తారేమో....మరీ రోడ్డుమీద"

"ఫర్వాలేదు ఎవరికీ అనుమానం కలక్కుండా ప్రవర్తించు. ఒక స్నేహితుడికోసం ఎదురుచూస్తున్నట్టు నిలబడు. ఐనా రాత్రి పదిగంటల సమయంలో టెంపుల్

అపరాధ పరిశోధన పోటీ-237

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ. 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-4-'88 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జూన్ '88 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఇక్కడ ప్రతి రైతుల 'ఆత్మహత్యా పరంపర' జాతికి సిగ్గుచేటు కలిగిస్తున్నది—?
(ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్)
2. దీనిపై ఇండియా రోజుకు 10 కోట్లు ఖర్చుచేస్తున్నది—?
(శాంతిదళం, రష్యా ఉత్సవాలు)
3. నేటి మన సినిమాలలోని హీరోలు ఎక్కువగా—?
(నేరస్థులు, ఆకతాయిలు)
4. దీనికి 'శౌర్యం' ఎక్కువ—? (పులి, సింహం)
5. ప్రపంచంలోకెల్ల ఇక్కడ పెట్రోలు ధర ఎక్కువ—?
(ఇండియా, చైనా)

స్ట్రీట్‌లో జనసంచారం ఎక్కువగా వుండదు. భయం లేదు" అన్నాడు వినాయక్.

మేనేజర్ నవ్వుమొహంతో బయటకు నడిచాడు. అతడి వెనకనే వినాయక్ వచ్చాడు.

ఒక యువతి—యువకుడు ఫోటోలు డెలివరీ తీసుకుని వెళుతున్నారు.

అతడికి జరీనా గుర్తుకు వచ్చింది.

అతడి నరాలు పొంగాయి.

ఆ రాక్షసుల్ని వదలకూడదు!!

మేనేజర్ ప్రింట్లు, నెగిటివ్‌లు ప్యాక్ చేసి ఇచ్చాడు. బ్యాలెన్స్ ఎమౌంట్ పే చేసి అక్కడ్నించి కదిలాడు.

"థాంక్‌యూ మేనేజర్" అంటూ ముందుకు వంగి "మోసంచేస్తే నీ ప్రాణాలు నిలవ్వు" అన్నాడు చిన్నగా గుసగుసలాడినట్టు వినాయక్.

మేనేజర్ కళ్ళు భయంతో పెద్దవయినాయి.

జేబులో చెయ్యిపెట్టి పిస్తోలును తడుముకుంటూ రోడ్డు మీదకు వెళ్ళాడు.

నడుస్తూ ఆ క్యాసెట్లను ఆ ముగ్గురు రాక్షసులకి అంద జేసే పథకం గురించి ఆలోచించటం మొదలుపెట్టాడు వినాయక్.

4

రిసెప్షన్ కౌంటర్లో వున్న యువతి ఎర్రగా వున్న పెదవులతో నవ్వుతూ చూసింది వినాయక్‌ను. చాలా నీట్‌గా టక్ చేసుకుని కళ్ళకు గోల్డ్ ఫ్రేమ్ అద్దాలు పెట్టుకుని వున్నాడు అతను.

"ఎక్స్‌క్యూజ్‌మి మేడమ్. మీరు నాకో సాయం చెయ్యగలరా?"

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-4-'88 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు జూన్ '88 నెల సంచికలో ప్రకటిస్తాము.

ఫిబ్రవరి'88 పోటీ ఫలితాలు

(1) ఫిబ్రవరి '88 నెల "అపరాధ పరిశోధన" ముఖ చిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

మనసెరిగిన నేస్తం!
నేలకొరిగిన హస్తం!!

పంపినవారు: శ్రీ ఎన్. ఉష, టి 2-481, III సెక్టర్ కాలనీ, గోదావరిఖని-505 211.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

వయసు వేడి సెగలు!
మనసు నీలి నీడలు!!

పంపినవారు: శ్రీమతి ఆర్. శ్రీజ్యోతి, W/o ఆర్. విశ్వేశ్వరరావు, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, ఏలూరు-534 001.

"చెప్పండి"

"ఐతే మీరు నాకు ఫ్రీగా సాయంచేస్తే నేను ఒప్పుకోను"

"చెప్పండి. అసలు నేనేం చెయ్యాలి?"

"చాలా చిన్నపని....ఈపాకెట్టును మీ దగ్గిర వుంచండి. అరగంటలోపల మీ దగ్గిరకు నా ఫ్రెండ్ వచ్చి ఈ ప్యాకెట్టును రిసీవ్ చేసుకుంటాడు. నేను అతడికి ఫోన్‌చేసి చెబుతాను ఇప్పుడే. చాలా ముఖ్యమైన పనిమీద నేను వెళుతున్నాను .... ఏమంటారు?" పర్సులోనించి వంద రూపాయల నోటును తీస్తూ అడిగాడు.

ఆమె ఆ నోటువంక ఆశగా చూసింది.

"ఆ ప్యాకెట్ ఇవ్వండి" అన్నదామె నవ్వుతూ.

కాయితంలో చుట్టిన ప్యాకెట్‌ను ఇచ్చాడు అతను. దాంతోనే వందరూపాయల నోటును కూడా ఆమె అందుకున్నది.

చాలా చిన్న పని. ప్రతిఫలం అందుకు వంద రూపాయలు.

కొన్ని హోటళ్ళలో రిసెప్షనిస్టులు డబ్బుకు ఆశపడి ఇటువంటి పనులు చేస్తారని అతడికి తెలుసు.

"థాంక్ యు మేడమ్" అన్నాడు.

"నో మెన్షన్....ఎప్పుడయినా సరదాగా మా హోటల్లో బసచెయ్యండి" అన్నదామె.

"తప్పకుండా" అన్నాడతను.

"ఇంతకీ మీ ఫ్రెండ్‌కు ఫోన్ చెయ్యరా."

"టైం లేదు. స్టేషన్నించి చేస్తాను" అని అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

ఐదు నిముషాలకు జైన్‌కు ఫోన్ చేశాడు వినాయక్.


ఆధునిక సాహిత్య విక్రయంలో
అపూర్వ విప్లవం!
బాలభారతి & వి.వి.ఎన్.ఎంటర్‌ప్రైజెస్ వారు తమ స్వంత భవనం "బాలభారతి భవన్" లోకి మారిన సందర్భంలో ఏజెంట్లకు, హోంలైబ్రరీ వారికి కలుగజేస్తున్న గొప్పఅవకాశం
మీ అభిమాన ప్రఖ్యాత రచయితల డిటెక్టివ్, మిస్టరీ, జానపద నవలలు!!
రూ 250/- విలువ చేసే నవలలు
రూ 100/- లకు మాత్రమే!
ఈ అవకాశం 1-1-88 నుండి 30-4-88 వరకు మాత్రమే!
వివరాలకు: వి.వి.ఎన్.ఎంటర్‌ప్రైజెస్
(బాలభారతి భవన్) 21.A రంగరాజపురం మెయిన్‌రోడ్డు
కోడంబాక్కం, మద్రాసు-600024

హోటల్ షియాన్ రిసెప్షనిస్టు దగ్గిర వున్న వీడియో క్యాసెట్ కలెక్ట్ చేసుకొమ్మని.

ధనుంజయ్ - వాడియా కూడా వినాయక్ అటు వంటి యేర్పాటునే చేశాడు.

అప్పటికి రాత్రి ఏడూ నలభై అయ్యింది.

పది గంటలకు పాతికవేల రూపాయలతో టెంపుల్ స్ట్రీట్‌లో స్టూడియో మేనేజర్ని కలుసుకోవాలనే విషయాన్ని గుర్తు చేసుకున్నాడు వినాయక్.

రోడ్డుమీద నడుస్తూనే ఒక బార్ అండ్ రెస్టారెంట్ లోకి వెళ్ళాడతను.

హత్య చెయ్యటానికి ముందు ఎక్కువగా తాగే అలవాటు వినాయక్‌కు వుంది.

5

జన సంచారం తక్కువగా వుంది టెంపుల్ స్ట్రీట్‌లో. టెంపుల్‌స్ట్రీట్‌కు కొంచెం దూరంలోనే రిక్షా దిగాడు వినాయక్. బాగా తాగినందువల్ల అతని అడుగులు నడుస్తున్నప్పుడు అటూ ఇటూ పక్కకు పడుతున్నాయి.

ఐనా అతడి ఆలోచనల్లో తడబాటు లేకుండానే వుంది.

తొమ్మిది గంటలకే టెంపుల్‌స్ట్రీట్‌లో షాపులన్నీ మూతపడతాయి.

పది గంటలకు సందడి పూర్తిగా తగ్గిపోతుంది.

వీధి దీపం వెలుతుర్లో చేతి వాచీకేసి చూసుకున్నాడు అతను. (సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY 3-4-554 Narayanaguda, Hyderabad-500 029, and Printed at Kranti Press, Madras - 600 001.

Blank Page

Regd. no: H/HD-48